www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 3-8-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 148 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం, తిథి: నవమి ఉ.9.42 తదుపరి దశమి, నక్షత్రం: విశాఖ ఉ. 6.35 తదుపరి అనూరాధ, వర్జ్యం: ఉ.11.01-12.47, దుర్ముహూర్తం: సా.5.01-5.52, అమృతఘడియలు: రా.9.40-11.27, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 5.58, సూర్యాస్తమయం: 6.43 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గుట్టలు గుట్టలుగా నోట్ల కట్టలు

దోచుకున్న సొమ్ముతో దొరికేశారు!

'సిట్' చేతికి చిక్కిన వీడియో

లెక్కబెడుతున్న చెవిరెడ్డి అనుచరుడు వెంకటేశ్

ఎన్నికల ముందు వైసీపీ అభ్యర్థులకు పంపిణీ!

రాజ్ కసిరెడ్డి పంపే సొమ్ములు భద్రపరిచి

చెవిరెడ్డి చెప్పిన వాళ్లకు అప్పగించిన వెంకటేశ్

లిక్కర్ కేసులో ఏ34.. చెవిరెడ్డితోపాటే అరెస్టు

ఇలాంటి వీడియోలు అనేకం రిట్రీవ్ చేసిన సిట్



వీడియోలో నోట్ల కట్టలతో చెవిరెడ్డి అనుచరుడు వెంకటేశ్ నాయుడు

అదో 'డెన్'! అందులో... టేబుల్‌పై కట్టలు... కట్టలుగా నోట్లు! అట్టపెట్టెల్లో సర్దుతూ మరిన్ని నోట్ల కట్టలు! అక్కడున్న వారిపై అజమాయిషీ చేస్తూ... ఒక వ్యక్తి! "ఇప్పుడు ఇది 25 ఉంది. ఇది... ఫోర్ ఉంటుంది. ఇదీ ఉంది. సరిపోతుందిలే! మొత్తం 5 ఉంది"... అంటూ లెక్కలు సరిచూస్తున్నాడు! ఆయన ఎవరో కాదు! వైసీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అనుచరుడు వెంకటేశ్ నాయుడు! మద్యం స్కామ్‌లో... ఏ34. వెంకటేశ్ నాయుడు ఫోన్ నుంచి 'సిట్' వెలికి తీసిన వీడియో... మొత్తం లిక్కర్ స్కామ్‌కు తిరుగులేని ఆధారంగా మారింది.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

లిక్కర్ స్కామ్ 'దొంగలు' నోట్ల కట్టల సాక్షిగా అడ్డంగా దొరికిపోయారు. మద్యం ముడుపులను... ఎన్నికల సమయంలో ఓట్ల కొనుగోలుకు ఉపయోగించారనే ఆరోపణలకు తిరుగులేని సాక్ష్యం లభించింది. ఇంకెవరో కాదు... లిక్కర్ స్కామ్‌లో ఇప్పటికే అరెస్టయిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ముఖ్య అనుచరుడు వెంకటేశ్ నాయుడు నోట్ల కట్టలను సర్దుతూ... లెక్కలు చెబుతున్న వీడియో బయటపడింది. ఈ కేసులో వెంకటేశ్ నాయుడు (ఏ34)ను సిట్ అధికారులు జూన్ 18వ తేదీన బెంగళూరు ఎయిర్‌పోర్టులో

మిగతా 13వ పేజీలో...



తాడేపల్లిలో వెంకటేశ్ నాయుడుతో జగన్ కరచాలనం... మధ్యలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి. (ఫైల్)



అన్నదాత సుఖీభవ పథకం నిధుల విడుదల సందర్భంగా రైతులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

అన్నదాతకు అండగా

చంద్రన్న ఉన్నంత వరకు భరోసా

సాగుకు చేయూతగా అన్నదాత సుఖీభవ

ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా అమలు

46.86 లక్షల మంది రైతులకు రూ.3,174 కోట్ల నిధులు విడుదల

కేంద్ర సాయంతో కలిపి ఏటా 20 వేలు

వ్యవసాయంలో సాంకేతికతకు పెద్దపీట

వచ్చే సీజన్‌కు వెలిగొండ తొలిదశ పూర్తి

మేలు చేసే ప్రభుత్వానికి అండగా నిలవండి

ప్రకాశం జిల్లా తూర్పువీరాయపాలెం సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు

నువ్వు లేపేస్తా అంటే.. ఇక్కడ ఉన్నది సీబీఎన్

రప్పా, రప్పా ఏమిటో ప్రజలు ఆలోచించాలి

నా 49 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి నాయకుడినీ, పార్టీనీ చూడలేదు

జగన్, ఆ పార్టీ నేతలపై చంద్రబాబు ఫైర్

పొలాల్లో.. మంచాలపై కూర్చొని

రైతులతో చంద్రబాబు ముఖాముఖి

వినూత్నంగా అన్నదాత సుఖీభవ కార్యక్రమం


సూపర్-6లో మరో హామీ అమలు

> సాగునీటి రంగంపై 2014-19లో టీడీపీ ప్రభుత్వం దాదాపు రూ.67 వేల కోట్లు ఖర్చు చేస్తే.. 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం రూ.12 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. కూటమి ప్రభుత్వం తిరిగి ఈ రంగంపై ప్రత్యేక దృష్టిసారించింది. ప్రకాశం జిల్లా కరువు నివారణ కోసం చేపట్టిన వెలిగొండ తొలిదశను వచ్చే సీజన్‌కు పూర్తి చేసి నీరిస్తాం.
>
> - సీఎం చంద్రబాబు

ఒంగోలు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అన్నదాతలను అన్నివిధాలా ఆదుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. రైతులకు సాగులో ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా 'అన్నదాత సుఖీభవ'ను అమలు చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్‌తో ఇచ్చే రూ.6 వేలకు

మిగతా 13వ పేజీలో...

'ఫిరాయింపు' చిక్కులు!



పార్టీ ఫిరాయింపు చట్టం లోపభూయిష్టంగా ఉండటంతోపాటు నిర్ణయాలు తీసుకోవడంలో చట్టసభల స్పీకర్లకు నిర్దిష్ట కాలవ్యవధి లేకపోవడమే వివాదాలకు కారణం అవుతోంది.

> స్పీకర్ వద్ద వివాదాలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. ఫలితంగా ఫిరాయింపుల నిరోధక చట్టం అపహాస్యం పాలవుతోంది. ఆ చట్టాన్ని మరింత పకడ్బందీగా సవరించడంతోపాటు స్పీకర్లకు కాలవ్యవధి నిర్ణయిస్తూ పార్లమెంటు చర్యలు తీసుకున్నప్పుడే ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

గతంలో కేసీఆర్ చేసిన విధంగానే తన ప్రభుత్వ సుస్థిరతకోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఫిరాయింపులను ప్రోత్సహించారు. బీఆర్ఎస్ తరఫున గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌తో జట్టుకట్టారు. దీంతో బాధితుడిగా మిగిలిన కేసీఆర్, తమ పార్టీ తరఫున గెలిచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన వారిపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేయించారు.

> వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ తరఫున శాసనమండలికి ఎన్నికైన కొందరు రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో తమ సభ్యత్వాలకు రాజీనామా చేశారు. సదరు రాజీనామాలు ఆమోదం పొందితే వారి స్థానాలు కూటమికి దక్కుతాయి. కూటమికి శాసనసభలో తిరుగులేని మెజారిటీ ఉన్నప్పటికీ శాసనమండలిలో వైసీపీకే మెజారిటీ ఉంది. చైర్మన్‌గా కూడా ఆ పార్టీకే చెందిన మోషేన్ రాజు ఉన్నారు. దీంతో ఆయన సదరు రాజీనామాలను ఆమోదించకుండా పెండింగ్‌లో పెట్టారు.

గతంలో చట్టసభల స్పీకర్లు, చైర్మన్లుగా ఎన్నికైన వారు అప్పటివరకు తాము ప్రాతినిధ్యం వహించిన పార్టీకి రాజీనామా చేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. చట్టసభల అధిపతులు పార్టీ సభ్యుల్లా వ్యవహరిస్తున్నారు.

> ముందుగా పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని పకడ్బందీగా సవరించాలి. ఫిరాయింపులకు పాల్పడే వారికి దొడ్డిదారులు లభించకుండా చట్టాలను సవరించాలి. ప్రస్తుత చట్టంలో లొసుగులను సవరించాలి.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..

అమ్మో.. ఆ ఎమ్మెల్యే

దందాలతో దడ

రియల్టర్లకు చుక్కలు చూపిస్తున్న సీనియర్ నేత

ఆయనో సీనియర్ ఎమ్మెల్యే! పలుమార్లు శాసనసభ్యుడయ్యారు. చూడటానికి సున్నితంగా కనిపిస్తారు! అంతకు ముందు పెద్దగా వివాదాల్లో చిక్కుకున్న దాఖలాలూ లేవు! ఇప్పుడు ఏమైందో ఏమో... మనిషి మొత్తంగా మారిపోయారు! మంత్రి పదవి రాలేదనే ఆక్రోశమో... 'నేను మాత్రం ఎందుకు వెనుకబడాలి' అనే ఆలోచనో తెలియదుగానీ వైసీపీ నేతల తరహా దందాలకు తెరలేపారు. తన కుటుంబ వ్యాపారాల్లో వస్తున్న ఆదాయానికి... అవినీతి సొమ్మును పాలూ నీళ్లలా జత చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో... రాజధానిని ఆనుకుని ఉన్న తన నియోజకవర్గాన్ని సొంత సామ్రాజ్యంలా మార్చుకున్నారు.

వైసీపీ పాలనను గుర్తుచేస్తున్న వైనం

అనుచరులతో కలిసి వసూళ్ల పర్వం

దళారులను అడ్డుపెట్టి బెదిరింపులు

వెంచర్ వేస్తే వాటాలు డిమాండ్

లేదా ఎకరానికి 10 లక్షలు ఇవ్వాలి

కాదూకూడదంటే అనుమతులు రావు

ఏడాదిగా ల్యాండ్ కన్వర్షన్ అనుమతులకు చెక్

రిజిస్ట్రేషన్, రెవెన్యూ అధికారులకూ బెదిరింపులు

సొంత పార్టీ ఎమ్మెల్యేకు సైతం తప్పని తిప్పలు



(గుంటూరు - ఆంధ్రజ్యోతి)

'రియల్ ఎస్టేట్ వెంచర్ వేశారా? అయితే... మాకు కొంత వాటా ఇవ్వాలి. లేదా.. ఎకరాకు రూ.10 లక్షలు కప్పం కట్టాల్సిందే! లేదంటే... పర్మిషన్లు రావు. రిజిస్ట్రేషన్లు కావు'... వైసీపీ ఎమ్మెల్యేలు చాలామంది చేసిన దందా ఇది! ఆ ప్రభుత్వం పోయింది! కానీ... ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన సీనియర్ ఎమ్మెల్యే ఒకరు ఇదే దందాకు తెరలేపారు. రాజధానికి సమీపంలోని సొంత నియోజకవర్గంలో ఆయనే రాజు.. ఆయనే మంత్రి. ఎమ్మెల్యేకు తెలియకుండా అక్కడ చీమ చిటుక్కుమనటానికి కూడా వీల్లేదు. ఆయన అనుచరులు చేస్తున్న అడ్డగోలు దందా చూసి ఆ ప్రాంతానికి

మిగతా 11వ పేజీలో...

15లోగా మెగా డీఎస్సీ ఫలితాలు

16 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన.. నెలాఖరుకు పోస్టింగ్

16,347 మంది టీచర్లకు వారాంతాల్లో శిక్షణకు ప్రణాళిక

2

18న డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్!

27న సీట్ల కేటాయింపు, 28 నుంచి తరగతులు

నెల్లూరులో 38.7 డిగ్రీలు

ఆగస్టులో ఇంత వేడి నాలుగు దశాబ్దాల్లో ఇదే తొలిసారి

రేపటి నుంచి దక్షిణ కోస్తా, సీమలో వర్షాలు

14

శ్రీశైలానికి తగ్గిన వరద

ఆరు గేట్ల నుంచి నీటి విడుదల



శనివారం మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న గడ్కరీ

రెండేళ్లలో ఏపీకి
లక్ష కోట్ల రోడ్లు

కేంద్రమంత్రి గడ్కరీ వరాల జల్లు

27వేల కోట్ల విలువైన ఆరు ప్రాజెక్టులకు తక్షణ ఆమోదం

త్వరలో అమెరికాతో ఏపీ రోడ్లు పోటీ.. మాటిస్తే చేసి చూపిస్తా: గడ్కరీ

2,800 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన

రెండు రహదారులు జాతికి అంకితం..

ఏది అడిగినా గడ్కరీ నో చెప్పలేదు

రాష్ట్రానికి 20 పోర్టులు వస్తున్నాయి: సీఎం

ప్రధాని స్ఫూర్తితో అడవిలో రహదారులు

అడగ్గానే సీఎం రూ.50 కోట్లు ఇచ్చారు: పవన్

గడ్కరీ ఆమోదించిన ఆరు ప్రాజెక్టులివీ..

- విజయవాడ-హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే
- విజయవాడ-మచిలీపట్నం రహదారి ఆరు వరుసలుగా విస్తరణ
- వినుకొండ-గుంటూరు
- గుంటూరు-నారాకోడూరు
- ముద్దనూరు-కడప
- విజయవాడ- హైదరాబాద్ రహదారి ఆరు వరుసలుగా అభివృద్ధి

అమరావతి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వచ్చే రెండేళ్ల వ్యవధిలో ఆంధ్రప్రదేశ్‌కు లక్ష కోట్ల రూపాయల విలువైన రహదారి ప్రాజెక్టులను మంజూరు చేస్తామని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్‌గడ్కరీ ప్రకటించారు. శనివారం మంగళగిరి సీ కన్వెన్షన్ వేదికగా జరిగిన సమావేశంలో ఆయన ఏపీపై వరాలజల్లు కురిపించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఆరు కీలక ప్రాజెక్టులకు గడ్కరీ తక్షణ ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టుల విలువ 27వేల కోట్లపైమాటే. ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రూ.2800 కోట్ల విలువైన కొత్త రహదారి పనులకు శంకుస్థాపన

మిగతా 13వ పేజీలో...



మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తున్నాం

ట్రంప్ 'డెడ్ ఎకానమీ' వ్యాఖ్యలకు ప్రధాని మోదీ కౌంటర్

అప్రమత్తంగా ఉండాల్సిన సమయమిది.. అస్థిరంగా ప్రపంచ పరిస్థితులు

ప్రతి దేశమూ స్వలాభం కోసమే.. స్వదేశీ ఉత్పత్తులపై మనం దృష్టి పెట్టాలి

మాపై దాడికి తెగిస్తే పాతాళంలో ఉన్నా వదలం.. పాక్‌కు మోదీ హెచ్చరిక

12



ఎన్నికల్లో రిగ్గింగ్

100 ఎంపీ స్థానాల్లో ఫలితాలు తారుమారు

మా వద్ద వంద శాతం ఆధారాలున్నాయి

వాటిని త్వరలోనే బయటపెడతాం

ఇది అణుబాంబు వంటిది.. ఇక ప్రకంపనలే

ఎన్నికల కమిషన్ పూర్తిగా నిర్వీర్యమైంది

కాంగ్రెస్ లీగల్ సదస్సులో రాహుల్ గాంధీ

12



ప్రజ్వల్ రేవణ్ణకు యావజ్జీవం

పనిమనిషిపై అత్యాచారం కేసులో శిక్ష

రూ. 10 లక్షల జరిమానా.. అందులో 7 లక్షలు బాధితురాలికి

ప్రజాప్రతినిధుల న్యాయస్థానం తీర్పు

12

శ్రీవారి సన్నిధిలో గడ్కరీ దంపతులు



కేంద్రమంత్రి గడ్కరీ దంపతులకు శ్రీవారి ప్రసాదం అందజేస్తున్న టీటీడీ ఏఈవో వెంకయ్య చౌదరి

- అనంతరం బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న కేంద్రమంత్రి
- ప్రపంచ శాంతి కోసం ప్రార్థించినట్లు వెల్లడి

తిరుమల, విజయవాడ (ఇంద్రకీలాద్రి), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రపంచమంతా శాంతి నెలకొనాలని శ్రీవారిని కోరుకున్నట్టు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. శ్రీవారి దర్శనార్థం శుక్రవారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆయన శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో వేదాశీర్వచనం అందుకున్నారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆయనకు శ్రీవారి తీర్థప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల గడ్కరీ మీడియాతో మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగు నిండే రోజు రావాలని స్వామిని మనస్ఫూర్తిగా కోరుకున్నట్టు చెప్పారు. సాయంత్రం విజయవాడ విచ్చేసిన గడ్కరీ.. సతీసమేతంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయ ఈవో శీనానాయక్, వేద పండితులు, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం గడ్కరీ దంపతులకు ఈవో, ప్రధాన అర్చకుడు దుర్గాప్రసాద్ అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేశారు. కేంద్ర మంత్రి వెంట ఎంపీలు సీఎం రమేశ్, టి.కృష్ణప్రసాద్, రాష్ట్ర మంత్రులు సత్యకుమార్, బీసీ జనార్దన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యే పార్థసారథి, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ ఉన్నారు.

15లోగా మెగా డీఎస్సీ ఫలితాలు

- 16 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన.. నెలాఖరుకు పోస్టింగ్
- 16,347 మంది టీచర్లకు వారాంతాల్లో శిక్షణకు ప్రణాళిక

అమరావతి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 ఫలితాలను ఈ నెల 15లోగా విడుదల చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. 16 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభించనుంది. క్రీడల కోటాలో ఉన్న 421 పోస్టులకు సంబంధించిన వివరాలు ఇంకా శాప్ నుంచి అందలేదు. అవి రాగానే జిల్లాల్లో కటాఫ్ మార్కులు ప్రకటిస్తుంది. ఈలోగా మార్కుల నార్మలైజేషన్ ప్రక్రియ పూర్తిచేస్తారు. నెలాఖరు నాటికి కొత్త టీచర్లకు పోస్టింగులు ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ యోచిస్తోంది. కాగా, కొత్తగా వచ్చే 16,347 మంది ఉపాధ్యాయులకు వారాంతాల్లో శిక్షణ ఇవ్వాలని యోచిస్తోంది. సాధారణంగా ఈ శిక్షణ పోస్టింగ్‌లకు ముందే పూర్తిచేస్తారు. ఇప్పటికే విద్యా సంవత్సరం ప్రారంభం కావడం, చాలా పాఠశాలల్లో టీచర్ల కొరత ఏర్పడటంతో నాలుగైదు శని, ఆదివారాల్లో శిక్షణ ఇవ్వాలని అధికారులు భావిస్తున్నారు. మొత్తంగా సెప్టెంబరు మొదటి వారం నుంచే కొత్త టీచర్లు పాఠశాలల్లో చేరనున్నారు.

టీచర్లకు బోధనేతర కార్యక్రమాలు రద్దు చేయాలి

- రాష్ట్రవ్యాప్తంగా ఫ్యాప్టో ధర్నాలు.. కలెక్టర్లకు వినతిపత్రాలు

అమరావతి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): టీచర్ల సమస్యలపై ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) శనివారం రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేసింది. టీచర్లకు బోధనేతర కార్యక్రమాలు పూర్తిగా రద్దు చేయాలని, 12వ పీఆర్సీ అమలు చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఫ్యాప్టో చైర్మన్ ఎల్. సాయి శ్రీనివాస్ గోదావరి జిల్లాల్లో, సెక్రటరీ జనరల్ ఎస్.చిరంజీవి తిరుపతిలో నిర్వహించిన ధర్నాల్లో పాల్గొన్నారు. టీచర్లకు ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలుచేయాలని, ఎంఈవో-1 పోస్టుల భర్తీకి ఉమ్మడి సీనియారిటీ ప్రామాణికంగా తీసుకోవాలని, 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న 3 డీఏలు విడుదల చేయాలని, ఉద్యోగుల పదవీ విరమణ అనంతరం ప్రయోజనాల నగదు ఇవ్వాలని, డీఎస్సీ-2003 టీచర్లకు పాత పెన్షన్ స్కీం వర్తింపజేయాలని కోరారు. ఈ ధర్నాల్లో అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పెద్దఎత్తున టీచర్లు పాల్గొన్నారు.

18న డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్!

- 27న సీట్ల కేటాయింపు, 28 నుంచి తరగతులు
- తాత్కాలిక షెడ్యూలు విడుదల

అమరావతి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉన్నత విద్యామండలి తాత్కాలిక షెడ్యూలు రూపొందించింది. ఈ నెల 18న నోటిఫికేషన్ జారీచేయాలని భావిస్తోంది. ఈలోగా ఈనెల 4 వరకు కాలేజీలు కోర్సులను సింగిల్ మేజర్‌లోకి మార్చుకునేందుకు గడువు పొడిగించింది. 7న సింగిల్ మేజర్‌పై నిబంధనలు జారీ చేయనుంది. 9 నుంచి 16 వరకు కాలేజీలకు యూనివర్సిటీలు అఫిలియేషన్లు మంజూరుచేస్తాయి. 18 నంచి 20వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. 21 నుంచి 24 వరకు వెబ్ ఆప్షన్ల ఎంపికకు గడువు ఇస్తారు. 27న సీట్లు కేటాయించి, 28 నుంచే తరగతుల ప్రారంభించేందుకు అనుమతిస్తారు. కాగా, ఈ ఏడాది నుంచి ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించారు. విద్యార్థులు నేరుగా కాలేజీలకు వెళ్లి దరఖాస్తు సమర్పిస్తారు. అయితే దానిని కూడా ఆన్‌లైన్ చేస్తారు. ఒకవేళ విద్యార్థి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ రెండిటిలోనూ దరఖాస్తు చేసుకుంటే ఆఫ్‌లైన్ దరఖాస్తుకు తొలి ప్రాధాన్యత ఇస్తారు. ఆఫ్‌లైన్‌లో కోరుకున్న కాలేజీలో సీటు రాకపోతే ఆన్‌లైన్ ఎంపికలు తర్వాతి ప్రాధాన్యతలో ఉంటాయి.

కర్నూలు మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ కలకలం!

- సీనియర్ విద్యార్థులకు పోలీసుల కౌన్సెలింగ్



యాంటీ ర్యాగింగ్ కమిటీతో ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ అంశం కలకలం రేపింది. తమను మూడో సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులు ర్యాగింగ్ చేస్తున్నారని, వినాయక చందాలు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారని మొదటి సంవత్సరం విద్యార్థులు నేషన్ మెడికల్ కమిషన్, కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు వెంటనే స్పందించారు. శుక్రవారం సాయంత్రం డీఎస్పీ బాబుప్రసాద్ ఆధ్వర్యంలో కాలేజీ మెన్స్ హాస్టల్‌లో సీనియర్ విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే, ర్యాగింగ్ ఆరోపణలపై వైస్ ప్రిన్సిపాల్ సాయిసుధీర్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ కె.చిట్టినరసమ్మ విచారణ కమిటీని నియమించారు. ఈ కమిటీ శుక్ర, శనివారాల్లో విచారణ చేపట్టి సీనియర్ విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చింది. జూనియర్లను ర్యాగింగ్ పేరిట వేధించి, భవిష్యత్తును ఇబ్బందుల్లోకి నెట్టుకోవద్దని హెచ్చరించింది. కాగా, కాలేజీలో ఎటువంటి ర్యాగింగ్ జరగలేదని, విచారణలో ర్యాగింగ్ జరిగినట్లు విద్యార్థులెవ్వరూ చెప్పలేదని తెలిపారు. చందాలు అడిగిన విషయమై స్పందిస్తూ, ఇది.. హాస్టల్‌లో ఎన్నో ఏళ్లుగా విద్యార్థులు స్వచ్ఛందంగా జరుపుకునే ఉత్సవాలకు సంబంధించిన అంశమని, ర్యాగింగ్ కిందకు రాదని చెప్పారు.

రెవెన్యూ లోటును సర్దుబాటు చేసుకుంటాం

- వినియోగదారుడిపై భారం వేయం: విజయానంద్

అమరావతి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): 'రెవెన్యూ లోటును సర్దుబాటు చేసుకుంటాం. వినియోగదారుడిపై భారం వేయం' అని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ స్పష్టం చేశారు. శనివారం ఆయన ఓ ప్రకటన చేశారు. 'ప్రతి ఐదేళ్లకు ఒకసారి రాష్ట్ర విద్యుత్తు పంపిణీ సంస్థల ఆదాయ వ్యయాల నివేదికను సమీక్షించే విధానం 2006-07 నుంచి అమలులోకి వచ్చింది. ఆమేరకు రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలికి రెవెన్యూ గణాంకాలను సమర్పించాలి. అందులో భాగంగానే 2019-20 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరం వరకూ ఆర్థికాంశాల నివేదికను ఈఆర్సీకి అందజేశాం. నివేదికలో పేర్కొన్న రెవెన్యూ లోటును వచ్చే వార్షిక ఆదాయ వ్యయాల నివేదిక(ఏఆర్ఆర్)లో సర్దుబాటు చేసుకుంటాం. ఈ నివేదికలపై ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన అభ్యంతరాలను కూడా పరిగణనలోనికి తీసుకుంటాం. ఈఆర్సీ ఇచ్చిన నోటీసుకు ప్రభుత్వ నిర్ణయాన్ని 29న వెల్లడిస్తాం' అని విజయానంద్ పేర్కొన్నారు.

బీఈఎస్ఎస్‌కు ఈఆర్సీ గ్రీన్ సిగ్నల్

- నోడల్ ఏజెన్సీగా ఏపీ ట్రాన్స్‌కో

అమరావతి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్)ను అమలు చేసేందుకు విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో పవర్ సిస్టమ్ డెవలప్‌మెంట్ ఫండ్ (పీఎస్‌డీఎఫ్) కింద నిధులు వ్యయం చేసేందుకు కూడా ఈఆర్సీ అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఏపీఈఆర్సీ ఉత్తర్వు జారీ చేసింది. సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో పగటి పూట ఉత్పత్తి అయిన విద్యుత్తును రాత్రి సమయంలోనూ వినియోగించుకునేందుకు వీలుగా బ్యాటరీ స్టోరేజీ విధానాన్ని వాడుకోవాలని కేంద్ర ఇంధన శాఖ రాష్ట్రాలకు సూచించింది. ఈ వెసులుబాటును సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఇంధన శాఖ నిర్ణయించింది. ప్రధానంగా గిరిజన తండాల్లో సౌర విద్యుత్తును బ్యాటరీలో నిక్షిప్తం చేసి రాత్రి సమయంలో వాడుకునే పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర విద్యుత్తు పంపిణీ సంస్థలు ఇప్పటికే కార్యాచరణను రూపొందించాయి. ఈ కార్యచరణపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. ఈ ఉత్తర్వును పరిశీలించిన ఈఆర్సీ... వయబిలిటీ గ్యాఫ్ ఫండింగ్ (వీజీఎఫ్) కింద బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌కు నిధులు వ్యయం చేసుకోవచ్చంటూ ఏపీ ట్రాన్స్‌కోకు అనుమతి ఇచ్చింది. నోడల్ ఏజెన్సీగా ఏపీ ట్రాన్స్‌కో బీఈఎస్ఎస్ కోసం టెండర్లను పిలవనుంది.

ఆధునిక భారత నిర్మాణానికి యువతే సారథులు

» మానవీయ విలువలు, వ్యవసాయంతో పాటు

ఏఐ డిజైన్‌పై విద్యార్థులు అధ్యయనం చేయాలి: గవర్నర్

» ఘనంగా విజ్ఞాన్స్ వర్సిటీ 13వ స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

గుంటూరు(విద్య), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆధునిక భారత నిర్మాణానికి యువత సారథులుగా మారాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ కోరారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 13వ స్నాతకోత్సవం సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడారు. విజ్ఞాన్‌లో విద్యార్థులు ఇంజనీరింగ్‌తో పాటు మానవీయ విలువలు, వ్యవసాయంతో పాటు కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) డిజైన్‌తో పాటు చట్టాలను అధ్యయనం చేయాలని సూచించారు. వర్సిటీలు గ్రాడ్యుయేట్లను తయారు చేయడం మాత్రమే కాకుండా నవీన భారత భవిష్యత్ నిర్మాణానికి శిల్పుల్ని తయారు చేయాలన్నారు. విశ్వవిద్యాలయాలు కేవలం విద్యా కేంద్రాలు కాదని, పరిశోధన, ఆవిష్కరణ, స్టార్టప్‌లు, సమగ్ర అభివృద్ధికి కేంద్రాలుగా మారాయన్నారు. ఇంజనీరింగ్ వల్ల వ్యవసాయ రంగానికి డ్రోన్స్, సెన్సర్లు, డేటా ఆధారిత ఫార్మింగ్ సాధ్యమైందని తెలిపారు. ఆరోగ్య రంగంలో డయాగ్నస్టిక్స్, డ్రగ్ డెలివరీలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమరావతిని కేవలం పరిపాలనా రాజధానిగానే కాకుండా టెక్, నాలెడ్జ్ సిటీగా తీర్చిదిద్దే దిశగా కృషి చేస్తోందన్నారు. 'క్వాంటం వ్యాలీ' ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ క్వాంటం టెక్నాలజీ కేంద్రంగా మార్చాలన్న దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని అబ్దుల్ నజీర్ వివరించారు. స్నాతకోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని బల్క్‌మెన్స్ గ్రూప్ ఫౌండర్ చింతలపాటి శ్రీనివాసరాజు, హైదరాబాద్‌లోని జెన్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ అట్లూరి, మ్యూజిక్ గురు, ఇండియన్ ప్లేబ్యాక్ సింగర్ కంపోజర్, లిరిల్ మ్యూజియన్స్ అకాడమీ ఫౌండర్ డాక్టర్ కొమాండూరి రామాచారికు విజ్ఞాన్స్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేసింది. కార్యక్రమంలో విజ్ఞాన్ వర్సిటీ వీసీ ఆచార్య పి.నాగభూషణ్, చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవ రాయలు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై వైసీపీ నేత దాడిశెట్టి రాజా అనుచరుల దాడి

» అన్నవరం దేవస్థానంలో టెండర్ సమయంలో ఘటన

అన్నవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో శనివారం నిర్వహించిన టెండర్ కు బహిరంగ వేలంలో పాల్గొనేందుకు వచ్చిన ఓ కాంట్రాక్టర్‌పై మాజీ మంత్రి, వైసీపీ నేత దాడిశెట్టి రాజా అనుచరులు దాడికి పాల్పడ్డారు. అన్నవరంలోని వ్రత మండపాల్లో వ్రత అనంతరం భక్తులు వదిలి వెళ్లిన మారేడు, జమ్మి పత్రితో పాటు స్వామివారి అలంకరణ అనంతరం వాడిపోయిన పువ్వులను పోగు చేసుకుని తీసుకెళ్లేందుకు మొదటిసారిగా టెండర్ కం బహిరంగ వేలం శనివారం నిర్వహించారు. ఇందులో ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలకు చెందిన ఒకరు, తిమ్మాపురానికి చెందిన ఇంకొకరు పాల్గొన్నారు. ద్వారకా తిరుమలకు చెందిన రాజేష్ అనే వ్యక్తి సీల్డ్ టెండర్‌లో నెలకు రూ.45,000 దేవస్థానానికి చెల్లించేలా హెచ్చు మొత్తంలో సీల్డ్ టెండర్ వేశారు. మిగిలిన ఇద్దరు వైసీపీకి చెందిన వ్యక్తులు రూ.35,000, రూ.30,000కు కోట్ చేశారు. వీరిద్దరిలో ఒకరు ఇంతకుముందు వైసీపీ హయాంలో ఒక లీజు లైసెన్స్ పొంది ఇప్పటికీ కొనసాగుతున్నారు. దీంతో ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ టెండర్ అధికంగా వేస్తావా అంటూ కొండపై వేలం నిర్వహించే ప్రాంగణంలోనే ఇద్దరూ కలిసి రాజేష్‌పై దాడి చేశారు. తర్వాత రాజేష్ వర్గీయులు కూడా ప్రతి దాడి చేశారు. ఇరువర్గీయులు అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

బడి మార్చారని విద్యార్థి ఆత్మహత్య

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఇంటికి దూరంగా, వేరే పాఠశాలలో చదవడం ఇష్టం లేక ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం నామాల గ్రామానికి చెందిన ఎం.జగన్ మోహన్(14) ఇదే మండలంలోని మేడాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతుండేవాడు. పెనుకొండ మండల కేంద్రంలోని ఎంజేపీ గురుకుల పాఠశాలలో సీటు రావడంతో తల్లి సంజమ్మ అక్కడ చేర్పించి వచ్చారు. తాను మేడాపురంలోనే చదువుకుంటానని, పెనుకొండలో ఉండటం ఇష్టం లేదని జగన్ మోహన్ మూడ్రోజుల క్రితం ఇంటికి తిరిగి వచ్చాడు. తల్లి నచ్చజెప్పినా వినలేదు. తనను తిరిగి గురుకుల పాఠశాలకే పంపిస్తారనే ఆవేదనతో, శుక్రవారం ఇంట్లో ఉన్న విషపు గుళికలు మింగాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి, ఆ తరువాత అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్వీ జూపార్కులో ఆడ పులి మృతి



మెడపై గాయంతో ఉన్న పులి (ఫైల్)

తిరుపతి(మంగళం), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ జూపార్కులో శనివారం ఓ ఆడపులి అనారోగ్యంతో మృతి చెందింది. ఆత్మకూరు ప్రాజెక్టు టైగర్ డివిజన్ కంపార్టమెంట్ నంబరు 707లో ఉన్న ఆడపులి మెడ భాగంలో గాయం కావడంతో గత నెల 6న ఎస్వీ జూపార్కుకు తీసుకొచ్చారు. 7వ తేదీన ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ సర్జరీ విభాగ ప్రొఫెసర్ల ఆధ్వర్యంలో శస్త్రచికిత్స నిర్వహించారు. 16న మరోసారి శస్త్ర చికిత్స చేశారు. అనంతరం పులికి మెత్తటి మాంసం, గ్లూకోజ్, ఎలక్ట్రోల్‌తో పాటు యాంటీ బయాటిక్స్ ఇచ్చారు. ఈ క్రమంలో 30వ తేదీ నుంచి ఆహారం తీసుకోకుండా నీళ్లు తాగుతూ నీరసపడిన పులి శనివారం తెల్లవారుజామున చనిపోయింది. ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ పేథాలజీ విభాగ ప్రొఫెసర్ ఆధ్వర్యంలో పోస్టుమార్టం చేసి సెప్టికిమియా షాక్ వల్ల పులి మృతి చెందినట్టు నిర్ధారించారు. అనంతరం పులి కళేబరాన్ని ఎస్వీ జూపార్కులో ఖననం చేశారు.

కన్నతండ్రినే కారుతో గుద్దించి..!

» 'ఇన్సూరెన్సు' కోసం కడతేర్చబోయిన కొడుకు

» ప్రాణాలతో బయటపడ్డ తండ్రి.. నిందితుడు వైసీపీ నేత.. అరెస్టు



నాటి సీఎం వైఎస్ జగన్‌తో కరచాలనం చేస్తున్న విప్పర్తి హర్షవర్ధన్(ఫైల్)

అమలాపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తండ్రిని చంపేస్తే అతని పేరిట ఉన్న బీమా సొమ్ము వస్తుందన్న దురాశతో కన్న కొడుకే తండ్రిని కారుతో గుద్దించి చంపాలని కుట్రపన్నాడు. అయితే, తండ్రి ప్రమాదం నుంచి బయటపడగా.. పోలీసుల విచారణలో కొడుకే నిందితుడని తేలడంతో అతడిని అరెస్టు చేశారు. వివరాలివీ.. కోనసీమ జిల్లా అమలాపురం పట్టణ శివారు కామనగరువు హైవేపై ఏప్రిల్ 21న మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తున్న విప్పర్తి వెంకటరమణను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయినట్టు అతడి తనయుడు, వైసీపీలో చురుకైన పాత్ర వహిస్తున్న, అమలాపురం మండలం సాకుర్రు గ్రామానికి చెందిన విప్పర్తి హర్షవర్ధన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ తర్వాత వెంకటరమణ కొన్నిరోజుల పాటు అపస్మారక స్థితిలో ఉండి ఇటీవల కోలుకున్నారు. ఈ క్రమంలో ఆ ప్రాంతంలోని ఒకచోట యాక్సిడెంట్ చేసిన కారును నాలుగురోజుల పాటు నిలిపి ఉంచడంతో స్థానికులకు అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో వెంకటరమణను కడతేర్చబోయింది అతడి కొడుకేనని తేలింది. ఓ కంపెనీ నుంచి తండ్రి పేరిట రూ.13లక్షల రుణం తీసుకున్న హర్షవర్ధన్, అందుకు తగ్గట్టు బీమా చేయించి ప్రీమియం చెల్లించాడు. ఈ క్రమంలో తండ్రి వెంటరమణను చంపేస్తే ఇన్సూరెన్సు సొమ్ము వస్తుందన్న దురాశతో ఈవిధంగా పథక రచన చేసినట్టు అతడు చెప్పడంతో పోలీసులు విస్తుపోయారు. నిందితుడు విప్పర్తి హర్షవర్ధన్‌ను శనివారం అరెస్టుచేసి కోర్టులో హాజరు పరిచినట్టు అమలాపురం తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. ఈ ఘటన తర్వాత, గత సీఎం జగన్‌తోపాటు, అమలాపురంలోని వైసీపీ కీలక నాయకులతో సంబంధాలు కలిగి ఉన్న హర్షవర్ధన్ ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి.

దేవుడా.. 'శ్రీవాణి' నిధులివ్వవా!

» కొత్త ఆలయాల నిర్మాణాల్లో తీవ్రజాప్యం

» నిధుల విడుదలకు టీటీడీ కొర్రీలు

» పనులు ఆపేస్తున్న కాంట్రాక్టర్లు

» దేవదాయ శాఖకు తలనొప్పులు

» నీరుగారుతున్న శ్రీవాణి ట్రస్ట్ లక్ష్యం

» భక్తుల నుంచి తీవ్ర విమర్శలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆలయాల నిర్మాణాలకు అనుమతులిస్తారు. కానీ బిల్లులు ఎప్పుడొస్తాయో తెలియదు. తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ)తో పెట్టుకుంటే ఆలయ నిర్మాణాలు ఎప్పుడు పూర్తవుతాయో కూడా తెలియదు. కష్టమో.. నష్టమో.. సొంత డబ్బులతో ఆలయాల నిర్మించుకోవడమే మంచిది. శ్రీవాణి పేరుతో టీటీడీ ఇచ్చే నిధులపై భక్తుల అభిప్రాయం ఇది. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని వందల కొత్త ఆలయాల నిర్మాణాలతో పాటు మరి కొన్ని పాత ఆలయాల జీర్ణోద్ధరణకు శ్రీవాణి ట్రస్ట్ ద్వారా టీటీడీ ఆర్థిక సహకారం అందిస్తుంది. రాష్ట్రం లో హిందూధర్మ అభివృద్ధి కోసం, ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో ఆలయాలను నిర్మించి ఆయా వర్గాల్లో భక్తికి పెంపొందించేందుకు టీటీడీ ఈ పథకం తీసుకువచ్చింది. కొత్త ఆలయాల నిర్మాణంతో పాటు పాత ఆలయాల పునర్మిణానికి 20 శాతం నిధులు ఆయా ఆలయాల పాలక మండలి లేదా గ్రామస్థులు సమకూరిస్తే మిగిలిన మొత్తాన్ని శ్రీవాణి ట్రస్ట్ ద్వారా టీటీడీ అందిస్తుంది. ఈ మొత్తం నిధులతో ఆలయాల



నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉంటుంది.

అనుమతుల్లో వేగం.. నిధుల విడుదలలో నిర్లక్ష్యం

టీటీడీ లక్ష్యం ఇప్పుడు నీరుగారిపోతోంది. శ్రీవాణి ట్రస్ట్ నుంచి ఆలయాల నిర్మాణాలకు అనుమతులిచ్చే సమయంలో ఉన్నంత వేగం.. నిధుల విడుదలలో ఉండడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్రంలో చాలా ఆలయాల నిర్మాణాలు శ్రీవా ణి ట్రస్ట్ నిధులతో ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొన్ని ఆలయాల నిర్మాణాలు చేపడితే, గత ప్రభుత్వంలో మరికొన్ని ఆలయాల నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. ఇప్పుడు ఏ ఆలయానికి కూడా నిధులు విడుదల చేయడం లేదు. టీటీడీ ఎస్ఈ, ఈఈల కార్యాలయాల్లోనే ఏదో ఒక కొర్రీ వేసి బిల్లులు విడుదల చేయడం లేదు. వందల సంఖ్యలో ఆలయ నిర్మాణాలు మొదలై కొంతమేర పనులు పూర్తి అయిన తర్వాత శ్రీవాణి నుంచి నిధులు నిలిచిపోవడంతో కాంట్రాక్టర్లు పనులు మధ్యలోనే ఆపేస్తున్నారు. బిల్లులు రాకుండా పనులు ఎలా చేయాలని వారు ప్రశ్నిస్తున్నారు. దీంతో గ్రామాల నుంచి వందల సంఖ్యలో ప్రజలు దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. వారికి ఏం సమాధానం చెప్పాలో తెలియక దేవదాయ శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. టీటీడీ అధికారుల వ్యవహారంతో శ్రీవాణి నిధులంటేనే గ్రామస్థులు భయపడిపోయే పరిస్థితి ఏర్పడింది.

ప్రత్యేక దృష్టి పెడితేనే..

ఆలయాల నిర్మాణం కోసం దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి టీటీడీ బోర్డుకు ప్రతిపాదనలు పంపడం తరువాయి ఆగమేఘాలపై అనుమతులు వస్తాయి. ఆ తర్వాతే టీటీడీ అధికారుల వ్యవహారంతో కథ మారిపోతుంది. కూటమి ప్రభుత్వంలో విజిలెన్స్ విచారణ పేరుతో మరింత ఆలస్యం చేస్తున్నారు. దీంతో గ్రామస్థాయిలో శ్రీవాణి నిధులపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కేవలం రూ.11 కోట్లు నిధులు విడుదల కాకపోవడంతో ఇటీవల పలు ఆలయాల నిర్మాణాలు నిలిచిపోయాయి. ఈ విషయాన్ని దేవదాయ శాఖ కమిషనర్ అనేక సార్లు టీటీడీ దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం శూన్యం. టీటీడీ చైర్మన్, ఈవో నిధుల విడుదలకు ఆమోదం తెలిపినా కూడా కిందస్థాయి సిబ్బంది వ్యవహారశైలి కారణంగా మొత్తం వ్యవస్థ తీవ్ర విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోంది. శ్రీవాణి ట్రస్ట్ నిధుల విడుదలపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తే తప్ప ఆలయాల నిర్మాణాలు ముందుకు కదిలే పరిస్థితి కనిపించడం లేదు. దీనిపై టీటీడీ దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

నోటిఫైకాని స్టేషన్‌లో కేసు చెల్లదు

» అలా కేసు నమోదు చేయడం సరికాదు

» 2016-20 నాటి 15 కేసులు రద్దు చేస్తున్నాం

» అవినీతి నిరోధక శాఖ కేసులపై హైకోర్టు తీర్పు

అమరావతి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నోటిఫై కాని పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేయడం చెల్లదని హైకోర్టు స్పష్టం చేసింది. నోటిఫై కాని స్టేషన్‌లో అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ) నమోదు చేసిన 15 కేసులను రద్దు చేసింది. వీటికి సంబంధించిన ఎఫ్ఐఆర్‌లను కూడా రద్దు చేస్తున్నట్టు పేర్కొంది. ఆయా కేసులు నమోదు చేసేనాటికి విజయవాడలోని ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్(సీఐయూ) కార్యాలయాన్ని పోలీస్‌స్టేషన్‌గా నోటిఫై చేయలేదని, దీనిపై ప్రభుత్వం ఎలాంటి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయలేదని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో విజయవాడ ఏసీబీ సీఐయూలో నమోదైన ఎఫ్ఐఆర్‌లకు చట్టబద్ధత ఉండదని పేర్కొంది. సదరు ఎఫ్ఐఆర్‌లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ తీర్పు ఇచ్చారు. ఆదాయానికి మించిన ఆస్తులున్నాయనే ఆరోపణలతో రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖలకు చెందిన 15 మంది అధికారులు, ఉద్యోగులపై విజయవాడలోని ఏసీబీ సీఐయూ కార్యాలయం ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది. నోటిఫైకాని పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినందున వాటికి ఎలాంటి చట్టబద్ధత ఉండదని, వాటిని కొట్టివేయాలని కోరుతూ 15 మంది అధికారులు వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. సీఆర్పీసీ సెక్షన్-2(ఎస్) ప్రకారం పోలీస్ స్టేషన్‌గా గుర్తించేందుకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. విజయవాడలోని ఏసీబీ సీఐయూ కార్యాలయాన్ని పోలీస్‌స్టేషన్‌గా నోటిఫై చేస్తూ ప్రభుత్వం ఎలాంటి గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వలేదని తెలిపారు. ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ.. సాంకేతిక కారణాలు చూపి ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాలని కోరలేరని తెలిపారు. ఏసీబీ విభాగంలోని జాయింట్ డైరెక్టర్ల కార్యాలయాలను పోలీస్ స్టేషన్లుగా గుర్తిస్తూ 2003లో ప్రభుత్వం జీవో ఇచ్చిందన్నారు. పునర్విభజన చట్టంలోని సెక్షన్లు 101, 102 ప్రకారం రాష్ట్ర విభజన అనంతరం ఆ చట్టాలు అమల్లో ఉంటాయని తెలిపారు. విజయవాడలోని ఏసీబీ సీఐయూ కార్యాలయాన్ని పోలీస్‌స్టేషన్‌గా నోటిఫై చేస్తూ 2022లోనే నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ, కేసులు నమోదు చేసేందుకు వాటికి తాత్కాలికంగా అర్హత ఉంటుందన్నారు.

రాష్ట్ర ఆర్థికస్థితిపై జగన్‌వన్నీ వక్రీకరణలే!

» చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం గాడినపడుతోంది

» గత ఏడాది కన్నా జీఎస్టీ ఆదాయంలో 14%, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయంలో 46% వృద్ధి: నీలాయపాలెం

అమరావతి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అసత్యాలు, వక్రీకరణలతో జగన్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'జూన్ నెలకు సంబంధించి కాగ్ నివేదిక ఆధారంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని జగన్ చేసిన ఆరోపణలు సత్యదూరం. ఎస్‌జీఎస్టీ, ఐజీఎస్టీలను విడదీసి చూపుతూ ప్రజల్ని తప్పు దారి పట్టించే ప్రయత్నం చేశారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మెరుగవుతోంది. రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పథంలోకి వస్తోంది. దీనికి నిదర్శనం తాజాగా విడుదలైన జీఎస్టీ గణాంకాలే. ఆగస్టు 1న కేంద్రం విడుదల చేసిన జీఎస్టీ గణాంకాల ప్రకారం 2025 జూలైలో రాష్ట్ర జీఎస్టీ ఆదాయం రూ.3,803 కోట్లుకు చేరింది. ఇది గత ఏడాదితో పోలిస్తే 14% అధికం. ఈ ఏడాది జూలైతో పోలిస్తే 6% అధికం. ఈ పెరుగుదల వెనుక ప్రజల విశ్వాసం, ప్రభుత్వ విధానాల ప్రభావం దాగి ఉన్నాయి. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో మరో కీలక సూచికగా నిలిచే స్టాంపులు, రిజిస్ట్రేషన్ ఆదాయాల్లో 2024 తొలి త్రైమాసికంలో రూ.1,819 కోట్లు ఉండగా, 2025లో అదే మూడు నెలల్లో రూ.2,661 కోట్లకు పెరిగింది. ఇది ఏకంగా 46% వృద్ధి. తాజా గణాంకాల ప్రకారం 2025 ఏప్రిల్-జూలైలో కూటమి ప్రభుత్వం చేసిన అప్పులు రూ.42,693 కోట్లు మాత్రమే. అదే కాలంలో 2024లో వైసీపీ ప్రభుత్వం రూ.43,052 కోట్లు అప్పులు చేసింది. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం పెట్టిన రూ.25 వేల కోట్ల బకాయిలను సర్దుబాటు చేస్తూ... అభివృద్ధి, సంక్షేమాలను అమలు చేస్తూనే అప్పుల భారాన్ని తగ్గించుకుంటూ వస్తోంది' అని విజయకుమార్ వివరించారు.



సరోగసీ కేంద్రానికి నోటీసులు అంటిస్తున్న సిబ్బంది. చిత్రంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు

సరోగసీ ముసుగులో పైసా వసూల్?

» యూఎస్ ఉమెన్ కేర్ అండ్ ఫెర్టిలిటీ కేంద్రంపై ఫిర్యాదులు

» వైజాగ్‌లోని 'సృష్టి' కేంద్రానికి రిఫర్ చేశారని ఆరోపణ

» పూర్తిస్థాయి విచారణకు కమిటీ నియామకం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సరోగసీ ముసుగులో రూ.లక్షలు వసూలు చేసి, పిల్లలు లేని దంపతులను మోసగించిన 'సృష్టి' కేంద్రం వ్యవహారంలో మరో కోణం వెలుగులోకి వచ్చింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని యూఎస్ ఉమెన్ కేర్ అండ్ ఫెర్టిలిటీ కేంద్రం నిర్వాహకులు సరోగసీ పేరుతో తమవద్ద అక్రమంగా డబ్బులు వసూలు చేశారని బాధితులు పోలీసులను ఆశ్రయించారు. విశాఖలోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ అండ్ రీసెర్చ్ సెంటర్‌కు తమను రిఫర్ చేశారని ఆరోపించారు. దీనిపై స్పందించిన జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ఈ కేంద్రానికి శనివారం నోటీసు జారీ చేశారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం జిల్లా కలెక్టర్ ప్రశాంతి పూర్తిస్థాయి విచారణకు వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు అధికారులతో ఒక కమిటీని నియమించారు. సరోగసీ ప్రక్రియకు సంబంధించి నిబంధనల ఉల్లంఘన జరిగిందో, లేదో ఈ కమిటీ పరిశీలిస్తుంది. అధికారులు విచారణ నిమిత్తం వెళ్లిన సమయంలో సరోగసీ కేంద్రానికి తాళం వేసి ఉంది.

నల్సా సంవాద్‌తో ఆదివాసీల జీవితాల్లో వెలుగులు

న్యాయ సేవాధికార సంస్థ చరిత్రలో

గిరిజన న్యాయ జాగృతి కీలక ఘట్టం: జస్టిస్ రవినాథ్ తిల్హారి



డ్వాక్రా మహిళాలకు చెక్కులు అందజేస్తున్న జస్టిస్ రవినాథ్ తిల్హారి, కలెక్టర్ లక్ష్మీశ

ఎ.కొండూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ చరిత్రలో గిరిజన న్యాయ జాగృతి కీలకమైన ఘట్టమని, నల్సా సంవాద్ పథకం ద్వారా గిరిజన ఆదివాసీ, సంచార జాతుల అభ్యున్నతి కోసం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ కృషి చేస్తుందని హైకోర్టు న్యాయమూర్తి, స్టేట్ లీగల్ సర్వీసు అధారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ రవినాథ్ తిల్హారి అన్నారు. శనివారం ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం గోపాలపురంలో రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, జిల్లా పరిపాలనా యంత్రంగం సంయుక్తంగా నిర్వహిస్తున్న గిరిజన న్యాయ జాగృతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ రవినాథ్ తిల్హారి మాట్లాడుతూ రాజ్యాంగంలో ప్రజలకు కల్పించిన హక్కులను కాపాడేందుకు, గిరిజన, ఆదివాసీ, సంచార జాతుల వెనుకబాటును గుర్తించి, వారి జీవితాల్లో వెలుగులు నింపడం కోసం సంస్థ పనిచేస్తోందన్నారు. గిరిజనుల హక్కుల పరిరక్షణలో పారా లీగల్ వాలంటీర్లు, ప్యానెల్ న్యాయవాదులు కీలకపాత్ర పోషిస్తున్నట్టు తెలిపారు. ఎ.కొండూరు మండలంలో ఎక్కువగా కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్నారని, వారికి ప్రత్యేక వైద్య సేవలు, ఆరోగ్య శిబిరాలు, డయాలసిస్ కేంద్రాలు శ్వాశత సేవలు అందజేస్తున్నట్టు వెల్లడించారు. కృష్ణాజిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్, సెషన్స్ జడ్జి జి.గోపి మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థ అందజేస్తున్న సేవల్ని ప్రతి గిరిజనుడు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఎ.కొండూరు ప్రాంతంలో కిడ్నీ సమస్య పరిష్కారం కోసం సురక్షితమైన తాగు నీరు పైపులైన్ ద్వారా అందజేస్తున్నామని, త్వరలో పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరుగుతుందన్నారు. అంతకుముందు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన, వైద్య, విద్య, గిరిజన, ఎస్సీ సంక్షేమ శాఖ, వ్యవసాయ, పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను జస్టిస్ రవినాథ్ తిల్హారి పరిశీలించారు. మండలంలోని 32 డ్వాక్రా సంఘాలకు బ్యాంక్ లింకేజి రుణాలు రూ.4.70 కోట్లు, నవోదయ 2.0 ద్వారా 5 కుటుంబలకు రూ.10 లక్షల చెక్కులు అందజేశారు.

చిరస్మరణీయుడు పింగళి వెంకయ్య

» ప్రధాని మోదీ నివాళులు

న్యూఢిల్లీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): చిరస్మరణీయుడు పింగళి వెంకయ్య అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. శనివారం పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించారు. వెంకయ్య సేవలను మోదీ ఎక్స్ వేదికగా గుర్తు చేసుకున్నారు. మనకెంతో గర్వ కారణమైన త్రివర్ణ పతాకాన్ని అందించడంలో పింగళి వెంకయ్య పాత్ర మరువలేనిదని తెలిపారు.

ఒక సీటుకే వైసీపీ పరిమితం: మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

తిరుచానూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేసిన ప్రజలు వచ్చే ఎన్నికల్లో ఒక సీటుకే పరిమితం చేస్తారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. తిరుచానూరు పద్మావతీ దేవి ఆలయం ఆలయం వద్ద శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'జిల్లా పర్యటనలు చేస్తూ జగన్ విద్వేషాలు రెచ్చగొడుతున్నారు. సభ్య సమాజం తలదించుకునేలా ఒక మహిళా ఎమ్మెల్యేను అసభ్యకరంగా దూషించిన నేత ఇంటికి వెళ్లి పరామర్శించిన జగన్‌కు... కనీస సంస్కారం, విజ్ఞత కూడా లేదు. వైసీపీ ప్రతిపక్ష పాత్ర పోషించడం లేదు. ఇలాగే విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తే భవిష్యత్తులో జగన్‌ను జనమే రాళ్లతో కొట్టే రోజులు వస్తాయి. కార్మికులు, రైతుల పక్షాన ఏనాడు జగన్ నిలబడలేదు. పేదలకు సంక్షేమ పథకాలు అందకుండా కుట్రలు పన్నుతున్నారు' అని మంత్రి ఆరోపించారు.

రైతు సంక్షేమమే మోదీ ప్రభుత్వ ప్రాధాన్యం: మాధవ్

అమరావతి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద దేశ వ్యాప్తంగా 9.7 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి రూ.20 వేల కోట్లు వారాణసి నుంచి విడుదల చేయడాన్ని మాధవ్ స్వాగతించారు. గత వైసీపీ ప్రభుత్వం మూడేళ్ల పాటు రాష్ట్ర రైతులకు బీమా వాటా చెల్లించక పోయినా కేంద్రం సొమ్ము చెల్లించిందని గుర్తు చేశారు.

సూపర్ సిక్స్ అమలుతో వైసీపీ నేతల్లో అక్కసు: మాణిక్యాలరావు

'ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఏడాదిలోపే కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తోంది. దీన్ని ఓర్చుకోలేని వైసీపీ సైకో ముఠా ఆత్మహతి చేసుకునే స్థితికి దిగజారుతోంది' అని లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. 'సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారనే అక్కసుతో వైసీపీ నేతలు అబద్ధపు కారుకూతలు కూస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏ విధంగా ఉన్నా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు, చెప్పిన విధంగానే అన్ని హామీలు అమలు చేస్తున్నారు. విధ్వంసంతో జగన్ పాలన మొదలు పెడితే... కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించి పేదవాడికి పట్టెడన్నం పెట్టడంతో పాలన మొదలుపెట్టింది' అని మాణిక్యాలరావు అన్నారు.

కోడి గుడ్డు అమర్నాథ్‌కు పెట్టుబడులంటే తెలుసా?: మోకా ఆనంద్‌సాగర్

అమరావతి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్‌పై గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మోకా ఆనంద్ సాగర్ ఖండించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'లోకేశ్‌కి సవాల్ విసిరే స్థాయి అమర్నాథ్‌కి లేదు. కోడి గుడ్డు మంత్రిగా ప్రజలతో పిలిపించుకున్న అమర్నాథ్ కూడా పెట్టుబడుల గురించి మాట్లాడటం విచిత్రంగా ఉంది. అసలు ఆయనకు పెట్టుబడులు అంటే ఏమిటో తెలుసా? చింత చచ్చినా పులుపు చావనట్లు వైసీపీ 11 సీట్లకు పడిపోయినా, ప్రతిపక్ష హోదా రాకపోయినా ఇప్పటికీ సిగ్గులేని కబుర్లు చెప్పుకొంటూ తిరుగుతున్నారు. ఉర్సాకు ఎకరం 99 పైసలకే కేటాయించినట్లు చెబుతున్న అమర్నాథ్ దాన్ని నిరూపించగలరా?' అని మోకా ప్రశ్నించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'ఫిరాయింపు' చిక్కులు!



కొత్తపలుకు

▪ఆర్కే RK

సాధారణ ఎన్నికలకు మరో మూడేళ్లకు పైగా వ్యవధి ఉన్నప్పటికీ తెలంగాణ రాజకీయాలు ఇప్పటికే వేడెక్కాయి. జన నేతగా ప్రచారం చేయించుకుంటున్న కేటీఆర్ బీఆర్‌ఎస్‌లో అంతా తానై వ్యవహరిస్తున్నారు. రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గుర్తించడానికి కూడా ఆయన నిరాకరిస్తున్నట్టుగా ఉంది. ఒక నికృష్టుడు ముఖ్యమంత్రిగా ఉన్నాడు అంటూ తనలోని అక్కసును వెళ్లగక్కుతున్నారు. ఈ ఇరువురి మధ్య ఉండాల్సిన రాజకీయ వైరం వ్యక్తిగత వైరంగా మారుతోంది. రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీలో తిరుగుబాటు రాబోతోంది అన్నట్టుగా తన చేతిలోని మీడియా ద్వారా కేటీఆర్ ప్రచారం చేయిస్తున్నారు. రేవంత్‌రెడ్డి స్థానంలో కాంగ్రెస్ పార్టీ తరఫున మరొకరు ముఖ్యమంత్రి అయితే కేటీఆర్ శాంతించవచ్చు. తమ అంచనాలకు భిన్నంగా రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడాన్ని కేసీఆర్ కుటుంబం జీర్ణించుకోలేకపోతోంది. ఈ కారణంగానే పార్టీ ఫిరాయించిన వారిపై అనర్హత వేటు పడి ఉప ఎన్నికలు రావాలని ఆ కుటుంబం బలంగా కోరుకుంటోంది.

సుప్రీంకోర్టు తీర్పుతో పార్టీ ఫిరాయింపులకు అడ్డుకట్ట పడుతుందా? పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న పది మంది తెలంగాణ ఎమ్మెల్యేల విషయంలో మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలన్న సుప్రీం తీర్పును శాసనసభ స్పీకర్ ఔదాల్చుతారా? చట్ట సభల స్పీకర్లు ఇకపై సుప్రీంకోర్టు పరిధిలోకి వెళతారా? ఈ ప్రశ్నలకు సమాధానాలు లభించాలంటే ఏం చేయాలి? జ్యుడీషియరీ, లెజిస్లేచర్ వ్యవస్థలలో ఎవరిది పై చేయి? చట్ట సభల స్పీకర్ల వ్యవహారాలపై తరచూ వివాదాలు ఎందుకు వస్తున్నాయి? ఈ ప్రశ్నలకు సుప్రీంకోర్టు తాజా తీర్పు సమాధానం చెప్పిందా? అంటే అవుననిగానీ, కాదనిగానీ చెప్పలేని పరిస్థితి! పార్టీ ఫిరాయింపు చట్టం లోపభూయిష్టంగా ఉండటంతోపాటు నిర్ణయాలు తీసుకోవడంలో చట్టసభల స్పీకర్లకు నిర్దిష్ట కాలవ్యవధి లేకపోవడమే వివాదాలకు కారణం అవుతోంది. ఒకప్పుడు చట్ట సభల స్పీకర్లు పార్టీలకు అతీతంగా, న్యాయబద్ధంగా నిర్ణయాలు తీసుకొనేవారు. కాలక్రమంలో స్పీకర్లు చట్టసభల్లో తాము ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం మొదలుపెట్టారు. దీంతో వివాదాలు న్యాయస్థానాలకు చేరుతున్నాయి. అయితే స్పీకర్ల అధికారాల్లో జోక్యం చేసుకొనే విషయంలో సర్వోన్నత న్యాయస్థానానికి సైతం పరిమితులు ఉన్నందున వివాదాలు వివాదాలుగానే మిగిలిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే భారత రాష్ట్ర సమితికి చెందిన ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు అనర్హత వేటు వేస్తుందని బీఆర్‌ఎస్ ఆశించింది. అప్పటికే పార్టీ ఫిరాయించిన వారిపై సుప్రీంకోర్టు చర్యలు తీసుకుంటుందని బలంగా చెప్పడం ద్వారా మరికొందరు పార్టీ ఫిరాయించకుండా బీఆర్‌ఎస్ అడ్డుకోగలిగింది. అయితే సుప్రీంకోర్టు తీర్పు ఆ పార్టీకి ఆశాభంగం కలిగించిందని చెప్పవచ్చు. 'ఆపరేషన్ సక్సెస్–పేషెంట్ డెడ్' అన్నట్టుగా తమ తీర్పు ఉండకూడదని భావించిన సుప్రీంకోర్టు... ఫిరాయింపుల విషయంలో నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్‌కు మూడు నెలల గడువు విధించింది. ఈ గడువుకు లోబడి స్పీకర్ నిర్ణయం తీసుకోని పక్షంలో పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుంది. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఉండాలన్నా, చట్టసభలు–న్యాయ వ్యవస్థ మధ్య ఘర్షణ తలెత్తరాదన్నా నిర్ణయాలు తీసుకోవడంలో స్పీకర్‌కు పార్లమెంటు గడువు విధించాలని సుప్రీంకోర్టు తన తాజా తీర్పులో పేర్కొంది. స్పీకర్ వద్ద వివాదాలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. ఫలితంగా ఫిరాయింపుల నిరోధక చట్టం అపహాస్యం పాలవుతోంది. ఆ చట్టాన్ని మరింత పకడ్బందీగా సవరించడంతోపాటు స్పీకర్లకు కాలవ్యవధి నిర్ణయిస్తూ పార్లమెంటు చర్యలు తీసుకున్నప్పుడే ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. అప్పటివరకు జ్యుడీషియరీ, లెజిస్లేచర్‌లలో ఎవరిది పైచేయి అన్న అకడమిక్ చర్చలు సాగుతూనే ఉంటాయి.

అధికారంలో ఒకలా.. విపక్షంలో మరోలా!

అధికార పార్టీ ప్రయోజనాలు కాపాడటానికే ఆయా చట్ట సభల స్పీకర్లు అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున సకాలంలో నిర్ణయాలు వెలువడటం లేదు. పార్టీ ఫిరాయింపుల విషయమే తీసుకుందాం. అధికారంలో ఉన్నప్పుడు ఫిరాయింపులను ప్రోత్సహించని పార్టీ లేదంటే అతిశయోక్తి కాదు. ప్రతిపక్షంలోకి వెళ్లాక అవే పార్టీలు అన్యాయం అంటూ ఆక్రోశిస్తుంటాయి. తెలుగు రాష్ట్రాలే ఇందుకు నిదర్శనం. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్ర సమితికి చెందిన కొంత మంది ఎమ్మెల్యేలను నాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. ఇలా చేయడం అనైతికం, అక్రమం అని టీఆర్‌ఎస్ అధినేతగా ఉన్న కేసీఆర్ ఆక్రోశించారు. ఒక పార్టీ తరఫున గెలిచిన వారిని మరో పార్టీలో ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించారు? సీన్ కట్ చేస్తే... తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. తాను ఒకప్పుడు తప్పుపట్టిన పనినే ఆయన అధికారంలోకి వచ్చాక దర్జాగా చేశారు. కాంగ్రెస్–తెలుగుదేశం–కమ్యూనిస్టు పార్టీలకు చెందిన సభ్యులను తమ పార్టీలో కలుపుకొన్నారు. అప్పట్లో శాసనసభలో కేసీఆర్‌కు బొటాబొటి మెజారిటీ మాత్రమే ఉన్నందున ఈ చర్యను ప్రజలు కూడా పెద్దగా ఆక్షేపించలేదు. ఆయన రెండోసారి ముఖ్యమంత్రి అయినప్పుడు సభలో సొంతంగా కావల్సినంత మెజారిటీ ఉండింది. అయినా కాంగ్రెస్, తెలుగుదేశం సభ్యులను చేర్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా లభించకుండా చేశారు. ఇందులోని నైతికతను పక్కనపెడితే కేసీఆర్ చర్యను ప్రజలు కూడా ఆక్షేపించారు. ప్రభుత్వ మనుగడకు ముప్పు లేకపోయినా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమైంది. అప్పట్లో తన చర్యను సమర్థించుకునేందుకు... బంగారు తెలంగాణ సాధనకోసం వారంతా తనతో చేతులు కలిపారని కేసీఆర్ చెప్పుకొన్నారు. 2023లో భారత రాష్ట్ర సమితి అధికారం కోల్పోయింది. గతంలో కేసీఆర్ చేసిన విధంగానే తన ప్రభుత్వ సుస్థిరత కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఫిరాయింపులను ప్రోత్సహించారు. బీఆర్‌ఎస్ తరఫున గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌తో జట్టుకట్టారు. దీంతో బాధితుడిగా మిగిలిన కేసీఆర్, తమ పార్టీ తరఫున గెలిచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన వారిపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేయించారు. స్పీకర్ ఎంతకీ నిర్ణయం తీసుకోకపోవడంతో ముందు హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు పార్టీ ఫిరాయింపులపై అప్పటి స్పీకర్లు కూడా నిర్ణయాలను పెండింగ్‌లోనే ఉంచారు.

రాజీనామాలూ 'పెండింగ్'లోనే...

ఫిరాయింపుల విషయంలోనే కాదు, సభ్యుల రాజీనామాల విషయంలో కూడా స్పీకర్లు నిర్ణయాలు తీసుకోకుండా పెండింగ్‌లో పెడుతున్నారు. రాష్ట్ర విభజనకు ముందు ఉమ్మడి రాష్ట్రంలో స్పీకర్‌గా ఉన్న నాదెండ్ల మనోహర్ సభ్యుల రాజీనామాలను ఆమోదించకుండా కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీ తరఫున కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ముఖ్యమంత్రి పదవి తనకు కట్టబెట్టడానికి కాంగ్రెస్ అధిష్ఠానం నిరాకరించడంతో జగన్మోహన్‌రెడ్డి సొంత పార్టీ పెట్టుకున్నారు. కాంగ్రెస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఆయనతో చేతులు కలిపారు. వారితో రాజీనామాలు చేయించి ఉప ఎన్నికలు తీసుకురావడం ద్వారా తన బలం ప్రదర్శించుకోవాలని జగన్‌రెడ్డి తలపోశారు. ఉప ఎన్నికలు వస్తే గెలుపు జగన్‌దే అని తేలిపోవడంతో సదరు రాజీనామాలు ఆమోదం పొందకుండా ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి నాటి స్పీకర్ మనోహర్‌పై ఒత్తిడి తీసుకువచ్చారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో కూడా ఇలాంటి పరిస్థితి పునరావృతం అవుతోంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ తరఫున శాసనమండలికి ఎన్నికైన కొందరు రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో తమ సభ్యత్వాలకు రాజీనామా చేశారు. సదరు రాజీనామాలు ఆమోదం పొందితే వారి స్థానాలు కూటమికి దక్కుతాయి. కూటమికి శాసనసభలో తిరుగులేని మెజారిటీ ఉన్నప్పటికీ శాసనమండలిలో వైసీపీకే మెజారిటీ ఉంది. చైర్మన్‌గా కూడా ఆ పార్టీకే చెందిన మోషేన్ రాజు ఉన్నారు. దీంతో ఆయన సదరు రాజీనామాలను ఆమోదించకుండా పెండింగ్‌లో పెట్టారు. చట్టసభల ప్రిసైడింగ్ అధికారులు ఈ విధంగా తమ అధికారాలను దుర్వినియోగం చేస్తున్నారు. 2019లో జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పుడు శాసనమండలిలో తెలుగుదేశం పార్టీకి మెజారిటీ ఉండేది. అప్పుడు బిల్లులు ఆమోదం పొందడంలో జగన్‌రెడ్డి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో శాసనమండలిని రద్దు చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారు. ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితి ఎదురుకావడంతో శాసనమండలిని రద్దు చేయించారు. 1983లో ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చినప్పుడు శాసనమండలిలో కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ ఉండేది. దివంగత రోశయ్య వంటి హేమాహేమీలు కాంగ్రెస్‌లో ఉండేవారు. వారిని ఎదుర్కోవడం ఎన్టీఆర్‌కు సమస్యగా మారింది. ఆ దశలో 'పెద్దల గలభా' పేరిట ఈనాడు పత్రిక పెట్టిన ఒక శీర్షిక సభా హక్కులను ఉల్లంఘించేదిగా ఉందని కాంగ్రెస్ పార్టీ హక్కుల తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదం పొందింది. 'పెద్ద'లు అని పెట్టిన శీర్షిక తమను అవమానించేదిగా ఉందనేది అభియోగం. హక్కుల తీర్మానానికి ఆమోదం లభించడంతో ఈనాడు పత్రికకు అప్పుడు చీఫ్ ఎడిటర్‌గా ఉన్న రామోజీరావు శాసనమండలికి రావాలని మండలి చైర్మన్ తాఖీదు ఇచ్చారు. దీనిపై రామోజీరావు సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. తమ ఆదేశాలపై స్టే ఇచ్చే అధికారం కోర్టుకు లేదని భావించిన శాసనమండలి రామోజీరావును అరెస్టు చేసి తీసుకురావాలని అప్పటి పోలీస్ కమిషనర్ విజయరామారావును ఆదేశించింది. దీనిపై కూడా కోర్టు స్టే ఇచ్చినందున... స్టే ఇచ్చిన న్యాయమూర్తిని కూడా సభకు రప్పించి మందలించాలని శాసనమండలి భావించింది. రాజ్యాంగపరంగా ఇదొక చిక్కుముడిగా మారింది. అటు కోర్టు ఆదేశాలను పాటించాలా? ఇటు శాసనమండలి ఆదేశాలను పాటించాలా? అన్న సందిగ్ధంలో పోలీసు కమిషనర్ విజయరామారావు చిక్కుకున్నారు. దీంతో చిర్రెత్తుకొచ్చిన ఎన్టీఆర్ శాసనమండలి రద్దుకు శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారు. తెలుగునాట శాసనమండలి రద్దు వెనుక జరిగిన కథ ఇది. ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు శాసనమండలిని పునరుద్ధరించింది. చట్టసభలు–న్యాయ వ్యవస్థలలో ఎవరిది పైచేయి? అన్న వివాదం ఏర్పడినప్పుడు ఇలాంటి రాజ్యాంగపరమైన సంక్షోభాలు తలెత్తుతాయి. ఆయా వ్యవస్థలు తమ పరిధికి లోబడి చట్టాలు అపహాస్యం కాకుండా నిర్ణయాలు తీసుకుంటే ఇలాంటి వివాదాలు తలెత్తవు. గతంలో చట్టసభల స్పీకర్లు, చైర్మన్లుగా ఎన్నికైనవారు అప్పటివరకు తాము ప్రాతినిధ్యం వహించిన రాజకీయ పార్టీకి రాజీనామా చేసేవారు. వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతిగా ఎన్నికైనప్పుడు భారతీయ జనతా పార్టీకి రాజీనామా చేశారు. చట్టంలో లేకపోయినా ఇలాంటి ఉన్నత సంప్రదాయాలను పాటించినవారు ఎందరో ఉన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదు. చట్టసభల అధిపతులు పార్టీ సభ్యుల్లా వ్యవహరిస్తున్నారు.

> 'నా సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నాను' అని ఒక సభ్యుడు మొత్తుకుంటున్నా సదరు రాజీనామాను ఆమోదించకపోవడం ఏమిటి? అదే రాజకీయంగా అవసరం అయినప్పుడు గంటలు, రోజుల వ్యవధిలోనే ఆమోదించడం ఏమిటి? ఇలాంటి చర్యల వల్ల చట్టసభలపైన, స్పీకర్లపైన ప్రజల్లో గౌరవం సన్నగిల్లదా?

రాజకీయ వ్యూహాలు...

ఇప్పుడు మళ్లీ పార్టీ ఫిరాయింపుల విషయానికి వద్దాం. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత తీవ్రంగా ఉందని, ఈ పరిస్థితుల్లో ఉప ఎన్నికలు వస్తే గెలుపు తమదే అన్న ధీమాతో ఉన్న భారత రాష్ట్ర సమితి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి సహజంగానే ఉప ఎన్నికలు రావడం ఇష్టం ఉండదు. ఈ కారణంగానే ప్రస్తుత వివాదం. పార్టీ ఫిరాయిస్తే అనర్హత వేటు పడుతుందన్న భయం లేకపోతే భారత రాష్ట్ర సమితికి చెందిన మరో పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీతో జట్టు కట్టేవారు. ఈ నేపథ్యంలో ఎన్నికైన సభ్యులు చేజారిపోకుండా కాపాడుకోవడంతో పాటు, పార్టీకి ఉజ్వల భవిష్యత్తు ఉందని పార్టీ శ్రేణులలో భరోసా కల్పించేందుకు బీఆర్‌ఎస్ ఉప ఎన్నికలు కోరుకుంటోంది. ఈ కారణంగానే మూడు నెలల తర్వాత ఉప ఎన్నికలు రావడం ఖాయమని ఆ పార్టీ ప్రచారం చేసుకుంటోంది. రెండు మూడు నెలల క్రితం బీఆర్‌ఎస్ విజయావకాశాలు మెరుగుపడిన విషయం వాస్తవం. అయితే, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇటీవలి కాలంలో తీసుకున్న నిర్ణయాల వల్ల క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ పరిస్థితి మెరుగుపడింది. రైతుబంధు నిధులు విడుదల చేయడం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు రేషన్ కార్డుపై సన్న బియ్యం సరఫరా చేయడం వంటి నిర్ణయాలు కాంగ్రెస్ పట్ల ప్రజల ధోరణి మారడానికి దోహదపడ్డాయి. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడి ఉప ఎన్నికలు వస్తాయో రావో అప్పుడే చెప్పలేంగానీ మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి మాత్రం త్వరలో ఉప ఎన్నిక జరుగుతుంది. ఈ ఎన్నిక ఫలితంతో తెలంగాణ రాజకీయాలపై కొంత స్పష్టత వస్తుంది. ఈ స్థానాన్ని నిలబెట్టుకోవడం ద్వారా హైదరాబాద్ మహానగరంపై తమ పట్టు సడలలేదని నిరూపించుకోవడానికి భారత రాష్ట్ర సమితి ప్రయత్నాలు మొదలెట్టగా... బీఆర్‌ఎస్ స్థానాన్ని హస్తగతం చేసుకోవడం ద్వారా నగరంలో కూడా తమ బలం పెరిగిందని రుజువు చేసుకోవడానికి కాంగ్రెస్ సర్వశక్తులూ ఒడ్డనుంది. సాధారణ ఎన్నికలకు మరో మూడేళ్లకు పైగా వ్యవధి ఉన్నప్పటికీ తెలంగాణ రాజకీయాలు ఇప్పటికే వేడెక్కాయి. జన నేతగా ప్రచారం చేయించుకుంటున్న కేటీఆర్ బీఆర్‌ఎస్‌లో అంతా తానై వ్యవహరిస్తున్నారు. ఆయనకు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మధ్య ఉప్పు–నిప్పు అన్నట్టుగా ఉంది. రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గుర్తించడానికి కూడా కేటీఆర్ నిరాకరిస్తున్నట్టుగా ఉంది. హౌలాగాడు, లొట్టపీసుగాడు అని కేటీఆర్ ముఖ్యమంత్రిని సంబోధిస్తున్నారు. ఒక నికృష్టుడు ముఖ్యమంత్రిగా ఉన్నాడు అంటూ తనలోని అక్కసును వెళ్లగక్కుతున్నారు. ఈ ఇరువురి మధ్య ఉండాల్సిన రాజకీయ వైరం వ్యక్తిగత వైరంగా మారుతోంది. రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీలో తిరుగుబాటు రాబోతోంది అన్నట్టుగా తన చేతిలోని మీడియా ద్వారా కేటీఆర్ ప్రచారం చేయిస్తున్నారు. రేవంత్‌రెడ్డి స్థానంలో కాంగ్రెస్ పార్టీ తరఫున మరొకరు ముఖ్యమంత్రి అయితే కేటీఆర్ శాంతించవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు– జగన్ మధ్య నెలకొన్న పరిస్థితి తెలంగాణలో రేవంత్‌రెడ్డి– కేటీఆర్ మధ్య నెలకొంది. తమ అంచనాలకు భిన్నంగా రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడాన్ని కేసీఆర్ కుటుంబం జీర్ణించుకోలేకపోతోంది. ఈ కారణంగానే పార్టీ ఫిరాయించిన వారిపై అనర్హత వేటు పడి ఉప ఎన్నికలు రావాలని ఆ కుటుంబం బలంగా కోరుకుంటోంది. ఉప ఎన్నికల్లో విజయం సాధిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కుప్పకూలిపోయే అవకాశం ఉందని బీఆర్‌ఎస్ నాయకులు అంచనా వేస్తున్నారు. ఏ కారణం వల్లనైనా రేవంత్‌రెడ్డి నాయకత్వం మారితే ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం పరిస్థితి దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్నట్టుగా ఉంటుంది. ఇలాంటి అంచనాలతోనే ఉప ఎన్నికలకోసం భారత రాష్ట్ర సమితి ఉబలాటపడుతోంది. అయితే సుప్రీంకోర్టు ఆదేశించిన విధంగా శాసనసభ స్పీకర్ మూడు నెలల్లోగా అనర్హత పిటిషన్‌పై నిర్ణయం తీసుకుంటారా? ఒకవేళ తీసుకుంటే ఎటువంటి నిర్ణయం తీసుకుంటారు? అనర్హత వేటు వేయని పక్షంలో పరిస్థితి ఏమిటి? వంటి శేష ప్రశ్నలు మిగిలే ఉన్నాయి. సుప్రీంకోర్టు కంటే పార్లమెంటే సుప్రీం అని ఇటీవలే ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగదీప్ ధన్‌ఖడ్ మాటలను స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఉటంకించడం గమనార్హం. రాష్ట్రాలు ఆమోదించిన బిల్లుల విషయంలో రాష్ట్రపతికి గడువు విధిస్తూ సుప్రీంకోర్టు జారీచేసిన ఆదేశాలను ప్రస్తావిస్తూ జగదీప్ ఆ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రపతి విషయంలో గడువు విధించే అధికారం సుప్రీంకోర్టుకు లేని పక్షంలో స్పీకర్‌కు కూడా గడువు విధించే అధికారం సుప్రీంకోర్టుకు ఉండదన్నది స్పీకర్ ప్రసాద్‌కుమార్ అభిప్రాయం కావొచ్చు. దీంతో అధికార పరిధి విషయంలో మళ్లీ పేచీ తలెత్తుతుంది. ఒకటి మాత్రం నిజం. పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని అన్ని పార్టీలూ అపహాస్యం చేస్తున్నాయి. 2018 తర్వాత కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ భారత రాష్ట్ర సమితిలో విలీనమయిందని ప్రకటించారు. ఆ తర్వాత కూడా భట్టి విక్రమార్క నాయకత్వంలో పది మంది వరకు కాంగ్రెస్‌లోనే కొనసాగారు. వారిని కాంగ్రెస్ సభ్యులుగానే పరిగణించారు. అయినా కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ బీఆర్‌ఎస్‌లో విలీనమయిందని ప్రకటించుకున్నారు. ఇంతకంటే హాస్యాస్పదం మరొకటి ఉంటుందా? ఈ నేపథ్యంలో ఫిరాయింపులను తప్పుపట్టే నైతికత బీఆర్‌ఎస్‌కు లేదని చెప్పవచ్చు. రాజకీయ పార్టీలు నైతిక విలువలకు తిలోదకాలు ఇచ్చినప్పుడు రాజ్యాంగపరమైన మౌలిక ప్రశ్నలు తలెత్తుతాయి. ఫిరాయింపులు, రాజీనామాల విషయంలో స్పీకర్లు ఏళ్ల తరబడి నిర్ణయాలు తీసుకోకుండా కాలయాపన చేస్తే న్యాయస్థానాలు జోక్యం చేసుకోకూడదా? అన్న ప్రశ్నకు ఎవరు సమాధానం చెప్పాలి? ఒక పార్టీ తరఫున ఎన్నికైన వ్యక్తి మరొక పార్టీలోకి మారడం అనైతికం అవుతుంది. అన్ని రాజకీయ పార్టీలూ ఈ అనైతిక చర్యలను ప్రోత్సహిస్తున్నాయి.

> సుప్రీంకోర్టు ఆదేశించిన విధంగా శాసనసభ స్పీకర్ మూడు నెలల్లోగా అనర్హత పిటిషన్‌పై నిర్ణయం తీసుకుంటారా? ఒకవేళ తీసుకుంటే ఎటువంటి నిర్ణయం తీసుకుంటారు? అనర్హత వేటు వేయని పక్షంలో పరిస్థితి ఏమిటి? సుప్రీంకోర్టు కంటే పార్లమెంటే సుప్రీం అని ఇటీవలే ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగదీప్ ధన్‌ఖడ్ మాటలను స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఉటంకించడం గమనార్హం. రాష్ట్రాలు ఆమోదించిన బిల్లుల విషయంలో రాష్ట్రపతికి గడువు విధిస్తూ సుప్రీంకోర్టు జారీచేసిన ఆదేశాలను ప్రస్తావిస్తూ జగదీప్ ఆ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రపతి విషయంలో గడువు విధించే అధికారం సుప్రీంకోర్టుకు లేని పక్షంలో స్పీకర్‌కు కూడా గడువు విధించే అధికారం సుప్రీంకోర్టుకు ఉండదన్నది స్పీకర్ ప్రసాద్‌కుమార్ అభిప్రాయం కావొచ్చు. దీంతో అధికార పరిధి విషయంలో మళ్లీ పేచీ తలెత్తుతుంది. ఒకటి మాత్రం నిజం. పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని అన్ని పార్టీలూ అపహాస్యం చేస్తున్నాయి. 2018 తర్వాత కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ భారత రాష్ట్ర సమితిలో విలీనమయిందని ప్రకటించారు. ఆ తర్వాత కూడా భట్టి విక్రమార్క నాయకత్వంలో పది మంది వరకు కాంగ్రెస్‌లోనే కొనసాగారు. వారిని కాంగ్రెస్ సభ్యులుగానే పరిగణించారు. అయినా కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ బీఆర్‌ఎస్‌లో విలీనమయిందని ప్రకటించుకున్నారు. ఇంతకంటే హాస్యాస్పదం మరొకటి ఉంటుందా? ఈ నేపథ్యంలో ఫిరాయింపులను తప్పుపట్టే నైతికత బీఆర్‌ఎస్‌కు లేదని చెప్పవచ్చు.

పరిష్కారం ఏది?


సుప్రీంకోర్టు తాజా తీర్పుతో చిక్కు ముడులు అన్నీ విడిపోతాయని చెప్పలేం. మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని నాకు గడువు ఎలా విధిస్తారు? అని స్పీకర్ ఎదురు తిరగవచ్చు. లేదా అలా ఆదేశించడం సమంజసం కాదని మళ్లీ సుప్రీంకోర్టునే ఆశ్రయించవచ్చు. అదే జరిగితే వివాదం కొనసాగుతూనే ఉంటుంది. ఒకవేళ స్పీకర్ సదరు ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటిస్తే వారు కోర్టులను ఆశ్రయించవచ్చు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై స్పీకర్ చర్య తీసుకోని పక్షంలో బీఆర్‌ఎస్ కూడా మళ్లీ అన్యాయం జరిగిందని తిరిగి సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చు. ఇలాంటి సందేహాలు ఎన్నో ఉన్నాయి. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని బెంచ్ ఇచ్చిన తాజా తీర్పులో చేసిన సూచనలను అమలు చేయడమే ఈ చిక్కుముడులకు ఏకైక పరిష్కారం. ముందుగా పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని పకడ్బందీగా సవరించాలి. ఫిరాయింపులకు పాల్పడే వారికి దొడ్డిదారులు లభించకుండా చట్టాలను సవరించాలి. ప్రస్తుత చట్టంలో ఉన్న లొసుగులను సవరించాలి. ఈ చట్టం అమలులోకి వచ్చాక అది ఎంతగా దుర్వినియోగం అయిందో అందరికీ తెలిసిందే. అందుచేత లోపాలను గుర్తించి సరిచేయడం పెద్ద సమస్య కాదు. కాకపోతే రాజకీయ పార్టీలకు చిత్తశుద్ధి ఉండాలి. ఇక స్పీకర్లు రాజ్యాంగం తమకు కల్పించిన వెసులుబాట్లు, విచక్షణాధికారాలను దుర్వినియోగం చేయకుండా ఉండాలంటే సుప్రీంకోర్టు సూచించిన విధంగా నిర్ణయాలు తీసుకోవడంలో స్పీకర్లకు పార్లమెంటు ద్వారానే గడువు విధించాలి. ఈ సూచన చేయడం ద్వారా స్పీకర్లకు తాము గడువు విధించలేమని సుప్రీంకోర్టు పరోక్షంగా అంగీకరించినట్టు అయింది. 'నా సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నాను' అని ఒక సభ్యుడు మొత్తుకుంటున్నా సదరు రాజీనామాను ఆమోదించకపోవడం ఏమిటి? అదే రాజకీయంగా అవసరం అయినప్పుడు గంటలు, రోజుల వ్యవధిలోనే ఆమోదించడం ఏమిటి? ఇలాంటి చర్యల వల్ల చట్టసభలపైన, స్పీకర్లపైన ప్రజల్లో గౌరవం సన్నగిల్లదా? గౌరవ సభ అని పిలుచుకొనే సభలు తమ గౌరవాన్ని నిలుపుకొనే విధంగా వ్యవహరించాలి కదా? కార్యనిర్వాహక వ్యవస్థపై ప్రజలు ఇప్పటికే విశ్వాసం కోల్పోయారు. న్యాయ వ్యవస్థ, చట్టసభలపై కూడా నమ్మకం సన్నగిల్లుతున్నప్పటికీ వాటికి రాజ్యాంగం కల్పించిన రక్షణల వల్ల ప్రజలు బహిరంగంగా విమర్శలు చేయలేని పరిస్థితి. చట్టాలు చేస్తున్న చట్టసభలే సదరు చట్టాలను సక్రమంగా అమలు చేయకపోవడాన్ని ఏమనాలి? ఫిరాయింపుల బెడదకు శాశ్వత పరిష్కారం లభించని పక్షంలో ప్రభుత్వాలు కూడా సుస్థిరంగా ఉండలేవు. సభ్యుల ఒత్తిళ్లకు ప్రభుత్వాలు లొంగిపోవాల్సిన పరిస్థితి ఇప్పుడుంది. ఈ నేపథ్యంలో అధికార పరిధుల గురించి కాకుండా రాజకీయ పార్టీలన్నీ ఆత్మపరిశీలన చేసుకోవాలి!



విశ్వనాథ మెచ్చిన తెలుగు ఆత్మీయుడు

మొదటి ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణకుగాను ఆహ్వాన సంఘ కార్యాలయం ఏర్పడిన తొలి రోజులు (1974 అక్టోబర్) అవి. ఈ సంఘానికి అధ్యక్షులు అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు; కార్యనిర్వాహక అధ్యక్షులు, విద్యా సాంస్కృతిక శాఖామాత్యులు మండలి వెంకటకృష్ణారావు. ప్రముఖ విద్యావేత్త, పాలనాదక్షులు డా. పి.యస్.ఆర్ అప్పారావు ప్రధాన కార్యదర్శి. రవీంద్రభారతి మొదటి అంతస్తులో నెలకొల్పిన ఈ సంఘ కార్యాలయం సిబ్బందిలో ఒకడిగా నేను ఉద్యోగంలో చేరాను.

మండలి వెంకటకృష్ణారావుని చూడడం అదే ప్రథమం. వారు విద్యామంత్రిగా ఎంత తలమునకలైనా, పని భారంలో ఉన్నా రోజుకు రెండుసార్లు క్రమం తప్పకుండా రవీంద్రభారతిలోని ఈ కార్యాలయానికి వచ్చేవారు. యాభై సంవత్సరాల నిండు వయస్సులో ఉండి, మోచేతులు దాటని పాలనురుగులాంటి తెల్లని ఖద్దరు చొక్కాలో, పంచె చెరగును ఎడమ చేత్తో పైకిలాగి పట్టుకొని, కారు ఆగీ ఆగకముందే, తలుపు తెరుచుకొని చెంగున దూకి ఒక్క ఉదుటన రవీంద్రభారతి మెట్లు ఎక్కే వారి మహోన్నతమైన మూర్తి ఇప్పటికీ నాకు కళ్లకు కట్టినట్లు గోచరిస్తుంది. వారు వస్తే అదొక ప్రభంజనం. వారొచ్చిన ఒక నిమిషం తరువాత వారి వెంట వస్తున్నవారు రొప్పుతూ మెట్లెక్కి వచ్చేవారు. వారి ఎదలోను, వదనంలోనూ ఉత్సాహం పరవళ్లు తొక్కేది. వారి వెనకే వచ్చిన ఉప్పులూరి మల్లికార్జునశర్మ "చేయెత్తి జైకొట్టు తెలుగోడా" అంటూ గళమెత్తి ఒళ్లు పులకరించిపోయే రీతిలో పాట అందుకునేవారు. చేస్తున్న పనిని ఆపుచేయించి, అందరినీ ఆ పాటను శ్రద్ధగా వినమని కోరేవారు మండలివారు. అక్కడ పనిచేస్తున్న మా అందరికీ 'మేం జీతం కోసం పనిచేయడం లేదు. ఒక మహోన్నత లక్ష్యసాధనకు గాను మా వంతు పాత్ర నిర్వహిస్తున్నాం' అన్న స్ఫూర్తి కలిగించడమే వారి ఉద్దేశ్యం.



1977 నవంబర్ 19న కోస్తాంధ్రను పెను తుఫాను, ఉప్పెన ముంచివేసింది. ఈ ఉప్పెన ప్రభావం కృష్ణా జిల్లా దివిసీమపై ఎక్కువగా పడింది. ఆ సమయంలో మండలి వెంకటకృష్ణారావు అవనిగడ్డలోనే ఉన్నారు. తుఫాను, ఉప్పెన ప్రభావాన్ని ప్రత్యక్షంగా చూశారు. గాంధీక్షేత్రం సేవాశ్రమంలో అనాథ బాలురు తుఫాను ధాటికి భయపడి బయటకు వచ్చి గంటకు రెండు వందల కిలోమీటర్ల వేగంతో వీస్తున్న గాలి ఉధృతికి తట్టుకోలేక కొట్టుకుపోతుంటే ఆయన తన ప్రాణాలకు తెగించి వారిని పొదివి పట్టుకుని సురక్షిత ప్రాంతానికి తరలించారు. తుఫాను ఆ రోజంతా కొనసాగింది. మర్నాడు తెల్లవారుఝాముకు తుఫాను ఉధృతి తగ్గగా, టార్చ్‌లైట్ సాయంతో కృష్ణారావు బయటకు వచ్చి చూడగా, అంతా భీభత్సంగా కనిపించింది.

తెల్లవారిన తరువాత కొందరు వ్యక్తులు ఆయన స్వగ్రామమైన భావదేవరాపల్లి నుంచి వచ్చి ఉప్పెన గురించి ఆయనకు తెలియజేశారు. కృష్ణారావు హుటాహుటిన ఉప్పెన తాకిన ప్రదేశాలకు కాలినడకన బయలుదేరారు. దారిపొడవునా చెట్లు విరిగిపడి ఉన్నాయి. రోడ్లన్నీ చిన్నాభిన్నమైపోయాయి. నెమ్మదిగా దారి చేసుకుంటూ కొంత దూరం వెళ్లగా రోడ్లన్నీ కొట్టుకుపోయి గుంతలు పడ్డాయి. ఆ గుంతలలో నడుము లోతు నీటిలో కాళ్లకు ముళ్ళు గుచ్చుకుంటున్నా లెక్కచేయక ఆయన భావదేవరాపల్లి చేరారు. అక్కడి దృశ్యం చూసి ఆయన గుండె తరుక్కుపోయింది. మొత్తం ఊరు ఊరంతా శవాల దిబ్బగా మారింది. దివిసీమ మొత్తం మీద పదివేల మంది అశువులు బాశారు. లక్షలాది పశువులు ప్రాణాలు కోల్పోయాయి. కోట్లాది రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. కృష్ణారావులో నిరాశా నిస్పృహలు ఆవహించాయి. తన మంత్రి పదవికి రాజీనామా ప్రకటించి, శవసేనను ఏర్పాటు చేశారు. ఉన్న మనుషులతో శవాలను తగలబెట్టే కార్యక్రమం ప్రారంభించారు. ఆయన ఆ విధంగా దివిసీమ ఉప్పెన, తుఫాను బాధితులకు చేసిన సేవ చిరస్మరణీయంగా చరిత్రలో నిలిచిపోయింది.

కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ తమ రామాయణ కల్పవృక్ష కావ్య అవతారికలో తమకు అత్యంత ఆత్మీయులైన కొందరు స్నేహితులను కావ్యశ్రోతలుగా ఎంచుకొన్నారు. వారిలో మండలివారు ఒకరు. వీరి గురించి ప్రస్తావిస్తూ

"ఆయన జూచిన నేనే
యాయన యనిపించె హృదయమందు నదేలో!
ఆయన ప్రకృతియు నా యది
మాయురే యొకజాతి ద్రవ్యమా యనిపించున్"

అని చెప్పుకొన్నారు. వీరిని కావ్య శ్రోతలుగా ఎంచుకొన్న కారణం వివరిస్తూ, "సుస్థిరమగు కావ్యమందు కవిచే నిలుపంబడువాని పేరు, సుస్థిరముగ నేల సౌఖ్యము భజించడు వేల్పుల వీడు నందునన్" అని చెప్పారు.

▪ డా. గంధం సుబ్బారావు

(రేపు అవనిగడ్డలో మండలి వెంకటకృష్ణారావు శతజయంత్యుత్సవాలు ఆరంభం. సాయంత్రం 6 గం.లకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్యఅతిథిగా ప్రారంభోత్సవ సభ)

జనం గుండెల్లో నిలిచిన మండలి!


దివిసీమకి చెందిన రాజకీయ తేజం
తెలుగు భాషా సంస్కృతుల వికాసం
దశ దిశల వెదజల్లిన కాంతి పుంజం
దివంగత మండలి వెంకట కృష్ణారావు

గాంధేయ సిద్ధాంతాలను గాఢంగా నమ్మి
ఖద్దరు దుస్తులను ఖ్యాతిగా ధరియించే
జాతీయ కాంగ్రెస్ పార్టీతో జతకట్టినాక
అవనిలో ఎదిగినాడు ఆంధ్రుల నేతగా...!

ఎంపీ, ఎమ్మెల్యే, విద్యామంత్రి అయ్యాడు
తెలుగు వారందరికీ ప్రేమ ముడి వేశాడు
ధ్వంస సీమను పునర్నిర్మించే.. సంస్థలతో
దివిసీమ గాంధీలా నిలిచాడు కూడలిలో..!

మండలి ఆశయాలే నేటి యువతకు స్ఫూర్తి
శత జయంతి ఉత్సవాలే.. ప్రగతి ప్రజానేతకి
మనం గౌరవంగా ఇచ్చే ఘన నివాళులు..!

– జి.సూర్యనారాయణ



పంట మార్పిడి చేస్తే మంచిది

- పెట్టుబడి వ్యయంలో రూ.20 వేలు పంపిణీ
- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



రైతులకు నగదు చెక్కులు పంపిణీ చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే రామాంజనేయులు

లాంఫాం(తాడికొండ): రైతులు సాగులో పంట మార్పిడి విధానాన్ని పాటిస్తే మంచిదని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 20వ విడత పంపిణీ కార్యక్రమం లాం ఫాంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులుతో కలిసి పెమ్మసాని చంద్రశేఖర్ లబ్ధిదారులకు నగదు చెక్కులు పంపిణీ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి నుంచి పీఎం కిసాన్ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించగా ఆ ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం జరిగిన సమావేశంలో పెమ్మసాని మాట్లాడుతూ.. ధర ఎక్కువ ఉందని ఒకే పంటను వరుసగా రెండేళ్లు పండించడం వల్ల రేటు పడిపోయి రైతులు నష్టపోతారన్నారు. సాగు పెట్టుబడి వ్యయం ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకు రైతులపై పడుతుందన్నారు. ఇందులో రూ.20 వేలను రైతులకు ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్ అందిస్తున్నారన్నారు. పలు రాష్ట్రాల్లో కేవీకేలను రైతులు చక్కగా ఉపయోగించుకుంటున్నారని, ఏపీలో వాటి పనితీరు మెరుగుపడాలన్నారు. వ్యవసాయంలో ఉపయోగించే బయోపెస్టిసైడ్స్ కల్తీల కారణంగా క్యాన్సర్ కారకాలు ఎక్కువగా పెరుగుతున్నాయన్నారు. అధికారికంగా ధృవీకరించిన విత్తనాలను రైతులు ఉపయోగిస్తే దిగుబడులు పెరిగే అవకాశం ఉందన్నారు. సాంకేతిక విధానంతో వ్యవసాయాన్ని, ఉత్పత్తిని పొందించుకునే దిశగా రైతులు ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, కేవీకే డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్.మీరా, అడిషనల్ జనరల్ మేనేజర్ అజిత్‌వర్మ, వీసీలు డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మి, డాక్టర్ జె.వి.రమణ, కేవీకే అధినేత కె.యుగంధర్, శాస్త్రవేత్తలు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.



వినుకొండ: మార్కెట్ యార్డులో చెక్కును పంపిణీ చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి రవికుమార్, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, కలెక్టర్ అరుణ్‌బాబు

అన్నదాత.. సుఖీభవ



రేపల్లె: మార్కెట్‌యార్డులో అన్నదాత సుఖీభవ చెక్కులను రైతులకు అందిస్తున్న మంత్రి అనగాని, పార్థసారథి, ఎంపీ కృష్ణప్రసాద్, కలెక్టర్ వెంకటమురళి

జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఉన్నా కాల్వల్లో సాగునీరు పరవళ్లు తొక్కుతుండగా.. వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమై ఉన్నారు. ఈ సమయంలో ప్రభుత్వం శనివారం 'అన్నదాత.. సుఖీభవ' అంటూ రైతుల ఖాతాల్లో నగదు జమ చేసింది. పెట్టుబడి కోసం ఎదురు చూస్తున్న తరుణంలో రూ.7 వేలు నగదు అందడంతో అన్నదాతల్లో ఆనందోత్సాహాల్లో తేలియాడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు హామీ ఇచ్చినట్లుగా సూపర్ సిక్స్‌లో పథకాలను ఒక్కొక్కటి అమలు చేస్తోంది. ఈ క్రమంలో అన్నదాత సుఖీభవ పథకం అమలు ఎప్పుడెప్పుడా అని రైతులు చూస్తున్న తరుణంలో బ్యాంకు ఖాతాలకు నగదు జమ కావడంతో కర్షకుల కళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది. జిల్లాలో అన్నదాత సుఖీభవ.. పీఎం కిసాన్ పథకాన్ని శనివారం పండుగ వాతావరణంలో ప్రజాప్రతినిధులు, అధికారులు లాంఛనంగా ప్రారంభించారు.



కూటమి నేతలు, కార్యకర్తలు, రైతులు ఎక్కడికక్కడ ఈ కార్యక్రమాన్ని ఓ వేడుకలా జరుపుకున్నారు. పలు ప్రాంతాల్లో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు రైతులు పాలాభిషేకం చేసి వారికి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం కంటే రూ.6,500 అదనంగా కూటమి ప్రభుత్వం అందస్తుండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు.

ఆర్థిక సాయంతో ఆనందోత్సాహాలు

- రైతుల బ్యాంకు ఖాతాలకు రూ.7 వేలు జమ
- జిల్లాలో వేడుకలా సుఖీభవ పథకం ప్రారంభం
- 1,00,909 రైతులకు వేర్వేరుగా రూ.70.63 కోట్లు పంపిణీ

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)


గత కొన్ని రోజులుగా అన్నదాత సుఖీభవ పథకం అమలుకు సంబంధించి అధికారులు పెద్దఎత్తున కసరత్తు చేశారు. జిల్లాలోని ఏ రైతూ నష్టపోకుండా అర్హులందరికీ పథకం వర్తించేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో తొలుత ప్రభుత్వం గత నెలలో జాబితాలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచి అనర్హులు మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చింది. జిల్లాలో 2,39,959 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులుగా గుర్తించారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకాన్ని శనివారం ప్రారంభిస్తున్నట్లు ప్రకటించగానే రాష్ట్ర ప్రభుత్వం కూడా అన్నదాత సుఖీభవ నిధుల విడుదలకు ఏర్పాట్లు చేసింది. దీంతో జిల్లాలో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకానికి సంబంధించి లక్ష 909 మందికి నగదు జమ చేసే ప్రక్రియ ప్రారంభమైందని అధికారవర్గాలు తెలిపాయి. పీఎం కిసాన్ రూ.2000, సుఖీభవ రూ.5000 వేర్వేరుగా రూ.70.63 కోట్లు ప్రభుత్వం జమ చేసింది. తొలుత రూ.2,000 జమైనట్లుగా, ఆ తర్వాత రూ.5000 ఖాతాల్లో నగదు పడినట్లు వచ్చిన సందేశాలతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ క్రాప్ నమోదు చేసుకున్న కౌలు రైతులకు మాత్రమే సుఖీభవ అందుతుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

- జిల్లా స్థాయిలో బాపట్లలో అన్నదాత సుఖీభవ పథక ప్రారంభోత్సవం రేపల్లె మార్కెట్‌యార్డు వేదికగా అట్టహాసంగా జరిగింది. ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, కలెక్టర్ వెంకటమురళి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించి రైతులకు చెక్కులను అందజేశారు.
- పల్నాడు జిల్లాకు సంబంధించి వినుకొండలో మార్కెట్ యార్డులో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, కలెక్టర్ అరుణ్‌బాబు, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, వ్యవసాయ శాఖ జేడీ జగ్గారావు కార్యక్రమాన్ని ప్రారంభించారు.



శాశ్వతం.. స్నేహితం!

- కొత్త మార్గాల్లో స్నేహ హస్తాలు..
- తగ్గిన స్నేహితుల సంఖ్య..
- నేడు స్నేహితుల దినోత్సవం..



త్వరలో జీజీహెచ్‌లో కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలు!

- రూ.30 లక్షల విలువైన సర్జరీలు ఉచితంగా..
- సూపరింటెండెంట్ రమణ యశస్వి

8

గ్రామీణ విలేకరులకు శిక్షణ అవసరం

- ప్రెస్ అకాడమీ చైర్మన్ సురేష్ కుమార్

రాజధానిలో బసవతారకం క్యాన్సర్ హాస్పటల్

- నిర్మాణానికి 13న శంకుస్థాపన
- స్థలాన్ని పరిశీలించిన బాలకృష్ణ

తెనాలి కళాకారుడికి 'బళ్లారి రాఘవ' రాష్ట్రస్థాయి అవార్డు



6

ఆనంద సాగర్

- లాంచీ స్టేషన్ ఆదాయం రూ. లక్ష



- విద్యార్థుల ఆనందోత్సాహం
- గవర్నర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న డాక్టర్ లావు రత్తయ్య వీసీ నాగభూషణ్ తదితరులు

- క్వాంటం టెక్నాలజీకి దిక్సూచిగా ఆంధ్రప్రదేశ్
- విజ్ఞాన్స్ వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్‌నజీర్
- ముగ్గురికి గౌరవ డాక్టరేట్లు.. 2122 డిగ్రీలు.. 60 బంగారు పతకాల పంపిణీ

8


సాంకేతిక నగరంగా అమరావతి

రెండు జాతీయ రహదారులకు.. రూ.4605 కోట్లు

గుంటూరు- వినుకొండ, నిజాంపట్నం రోడ్ల విస్తరణకు నిధులు

- సీఎం చంద్రబాబు విజ్ఞప్తి మేరకు కేంద్ర మంత్రి గడ్కరి మంజూరు

గుంటూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ జిల్లా పర్యటన సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లాకు రెండు భారీ ప్రాజెక్టులను ప్రకటించారు. శనివారం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన సమీక్షలో సీఎం చంద్రబాబు విజ్ఞప్తి మేరకు అప్పటికప్పుడు రహదారుల అభివృద్ధికి



నిధులను మంజూరు చేశారు. వినుకొండ - గుంటూరు జాతీయ రహదారిని నాలుగు లేన్లగా విస్తరణకు రూ.2,605 కోట్లు, గుంటూరు - నిజాంపట్నం జాతీయ రహదారిని రూ.2 వేల కోట్లతో నాలుగు వరసలుగా అభివృద్ధికి కేంద్రమంత్రి సమ్మతించారు. దీంతో కేంద్ర మంత్రి పర్యటనతో జిల్లాకు దాదాపుగా రూ.4605 కోట్ల మేరకు లబ్ధి చేకూరింది. ఈ రెండు జాతీయ రహదారుల నిర్మాణం జరిగితే అటు బాపట్ల, ఇటు పల్నాడు జిల్లాల నుంచి గుంటూరుకు కనెక్టివిటీ పెరుగుతుంది. అలానే ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఆయా ప్రాంతాలు వాణిజ్యపరంగా అభివృద్ధి చెందడానికి అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. సరుకు రవాణా కూడా మెరుగుపడుతుంది.

మహాకవి బళ్ళారి రాఘవ

- నివాళులర్పించిన ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహితీ పీఠాన్ని అలంకరించిన మహాకవి బళ్ళారి రాఘవ అని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. బళ్ళారి రాఘవ జయంతి సందర్భంగా శనివారం పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఎస్పీ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తెలుగు నాటక రంగానికి కొత్త ఒరవడిని తీసుకువచ్చిన సాహితీ వేత్త, నాటకకారుడు, కవి బళ్లారి రాఘవ అన్నారు. ఆయన రచించిన రఘునందన, హరిశ్చంద్ర, ద్రౌపది వంటి నాటకాలు నాట్యరంగంలో చరిత్ర సృష్టించాయన్నారు. తెలుగు నాటక రంగానికి నూతన శైలిని పరిచయం చేసిన రాఘవ, నాటక ప్రదర్శనల్లోని పాత్రలలో జీవం పోసే మేటి నటుడిగా కూడా పేరు గడించారన్నారు. సామాజిక బాధ్యత కలిగిన రచయితగా, ఆయన సాహిత్యం శ్రేయోభిలాషులందరికీ మార్గదర్శిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో అద్దంకి వేంకటేశ్వర రావు, సుపరింటెండెంట్లు శంకరరావు, సుభాషిణి, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.



బళ్ళారి రాఘవ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

20లోగా టిడ్కో ఇళ్లలో చేరాలి

రిజిస్ట్రేషన్ చేసుకుని నివాసం లేకుంటే రద్దు

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని టిడ్కో గృహ సముదాయాల్లో అనేకమంది లబ్ధిదారులు నివాసం ఉండటంలేదు. రిజిస్ట్రేషన్లు పూర్తి అయిన వారు కూడా ఆయా ప్లాట్లలో నివాసం ఉండేందుకు ముందుకు రావడంలేదు. దీంతో నగర పాలక సంస్థ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకున్న వారు నివాసం ఉండాలని, లేకుంటే కేటాయింపు రద్దు చేస్తామని కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అడవితక్కెళ్లపాడు, వెంగళాయపాలెంలోని 7472 టిడ్కో ప్లాట్లకు 5052 ప్లాట్లు రిజిస్ట్రేషన్ జరిగింది. అయితే వాటిలో కేవలం 1565 మంది లబ్ధిదారులు మాత్రమే తమకు కేటాయించిన ప్లాట్లలో నివాసం ఉంటున్నారు. మిగిలిన వారు ప్లాట్లను ఖాళీగా ఉంచడమో, ఇతరులకు అద్దెకు ఇవ్వడమో జరిగింది. ఇలాంటి ప్లాట్లలో అసాంఘిక కార్యక్రమాలతో చుట్టుపక్కల నివాసితులు ఇబ్బందులు పడుతున్నట్లు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ క్రమంలో అలాంటి ప్లాట్ల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు నగర పాలక సంస్థ అధికారులు చర్యలకు సిద్ధమయ్యారు. అయితే టిడ్కో ప్రాంగణాల్లో కనీస సౌకర్యాలైన తాగునీరు, పారిశుధ్యం తదితర సమస్యలు ఉన్నాయని అందువల్లే నివాసాలకు ముందుకు రాలేకపోతున్నామని పలువురు లబ్ధిదారులు చెప్తున్నారు.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నాలో ఫ్యాప్టో నాయకుల డిమాండ్

గుంటూరు(విద్య), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలు సత్వరం పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) నాయకులు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఫ్యాప్టో చైర్మన్ నరసింహారావు మాట్లాడుతూ బకాయిలు చెల్లించాలన్నారు. బోధనేతర కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కల్పించాలన్నారు. విద్యార్థులకు పాఠశాలల్లో స్వేచ్ఛగా పాఠాలు చెప్పేందుకు ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని కోరారు. నూతనంగా అప్‌గ్రేడ్ అయిన స్థానాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులకు తక్షణమే పొజిషన్ ఐడీలు తయారు చేసి జీతాలు చెల్లించాలని తెలిపారు. ధర్నా అనంతరం 18 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్వో ఖాజావలికి ఫ్యాప్టో నాయకులు అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో కార్యదర్శి కె.వీరాంజనేయులు కో చైర్మన్ బి.సత్యం, డిప్యూటీ సెక్రటరి జనరల్స్ యు.రాజశేఖర్‌రావు, డి.కె.సుబ్బారెడ్డి ఎండీ ఖలీద్, కార్యవర్గసభ్యులు తిరుమలేష్, పెదబాబు, కె. బసవలింగరావు, జి.వేళాంగిణి రాజు తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న ఫ్యాప్టో జిల్లా చైర్మన్ కె నరసింహారావు

ప్రకాశం బ్యారేజికి కొనసాగుతున్న వరద

- దిగువకు 1 లక్ష 89వేల 625 క్యూసెక్కులు విడుదల



తాడేపల్లి టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతో పాటు ప్రధాన వాగుల నుంచి 2 లక్షల 1350 క్యూసెక్కుల వరదనీరు శనివారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్లు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా 5 గేట్లను 5 అడుగుల, 65 గేట్లను 4 అడుగుల మేర ఎత్తి దిగువకు 1 లక్షల 89 వేల 625 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాల్వలకు 17 వేల 979 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు జేఈ తెలిపారు.





ట్రాఫిక్ పరిష్కారానికి సమగ్ర ప్రణాళిక

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని


డీఆర్ఎం సుధేష్ణ సేన్‌తో రైల్వే ప్రాజెక్టులపై చర్చిస్తున్న మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారానికి సమగ్ర ప్రణాళికలు రచించామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా గుంటూరుకు 7 ఆర్‌ఓబీలు మంజూరు చేయించడం జరిగిందన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో గుంటూరు డీఆర్ఎం సుధేష్ణ సేన్, ఇతర రైల్వే అధికారులతో ఆర్‌వోబీల పురోగతిపై పెమ్మసాని సమీక్షించారు. నెహ్రూ నగర్ ఆర్‌ఓబీ, శ్యామలానగర్, సంజీవయ్య నగర్ బ్రిడ్జిలకు సంబంధించిన భూ సేకరణ, టెక్నికల్ అంశాలపై చర్చించారు. రెండేళ్లలో గుంటూరును ట్రాఫిక్ ఇబ్బందులు లేని నగరంగా మలచాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. ఇది సాధ్యపడాలంటే అధికారుల టీం వర్క్ తప్పనిసరి అని పేర్కొన్నారు. సమస్యలపై డీఆర్ఎం సుధేష్ణ సేన్ స్పందనకు పెమ్మసాని ధన్యవాదాలు తెలిపారు. సంజీవయ్య నగర్ ఆర్‌వోబీకి రెండో వైపున మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా డిజైన్లలో మార్పులు చేర్పులు చేయాలని అధికారులకు సూచించారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నెహ్రూ నగర్ ఆర్‌ఓబీ సమస్యలను వివరించారు. రైల్వే గేట్ డబ్లింగ్ అవసరమని అధికారులకు సూచించారు. అందుకు సానుకూలంగా స్పందించి త్వరగా పనులు పూర్తి చేస్తామని రైల్వే అధికారులు హామీ ఇచ్చారు. అలాగే మొండిగేట్ వద్ద విస్తరణ జరగాలన్న అభ్యర్థనకు స్పందనగా, రైల్వే అధికారులు దాదాపు రూ. 7 కోట్లతో పనులు చేపట్టేందుకు ముందుకొచ్చారు. డీఆర్ఎం సుధేష్ణ సేన్ మాట్లాడుతూ గుంటూరు ప్రాంతంలో ఆర్‌వోబీ, ఆర్‌యూబీ లాంటి ప్రధాన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమస్యలపై సమీక్ష జరగడం చాలా సంతోషకరమన్నారు. ఈ అంశాలన్నిటినీ డివిజన్ మాస్టర్ ప్లాన్‌లో చేర్చుకుంటామన్నారు. రైల్వే ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయిస్తున్నందుకు కేంద్ర మంత్రి పెమ్మసానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

పొన్నూరుటౌన్, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): ధాన్యం బకాయిలు చెల్లించాలని అడిగిన వ్యక్తిపై కుల దూషణతో పాటు దాడి చేసిన ఘటనపై పొన్నూరు అర్బన్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం మునిపల్లె గ్రామానికి చెందిన గొడ్డేటి శ్యామ్ కుమార్.. గ్రామంలోని శ్రీ సీతారామ రైస్ మిల్‌కు రూ. 45 లక్షల ధాన్యం సరఫరా చేశారు. ధాన్యం బకాయి చెల్లించకపోవడంతో.. శ్యామ్ కుమార్ ఎస్సీకి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో వట్టికూటి సత్య సాయిబాబు, వెంకట రామానాయుడు, గుత్తికొండ రాజేష్ అనే వ్యక్తులు తనపై దాడి చేసి, కులం పేరుతో దూషించారని శ్యామ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

2029లోనూ అధికారం కూటమిదే

● ఎమ్మెల్సీ సోము వీర్రాజు


అన్నదాత సుఖీభవ నగదు చెక్కును అందజేస్తున్న సోము వీర్రాజు, వర్ల రామయ్య

దుగ్గిరాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రానున్న 2029 సార్వత్రిక ఎన్నికల్లోనూ కూటమి అధికారంలో వస్తుందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం మొదటి విడత నగదు జమ కార్యక్రమాన్ని స్థానిక పసుపు మార్కెట్ యార్డులో శనివారం నిర్వహించారు. దర్శిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొన్న అన్నదాత సుఖీభవ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఎమ్మెల్సీ వీర్రాజు మాట్లాడుతూ, మామిడి, మిర్చి రైతుల వద్దకు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి వెళ్లినప్పుడు ఏ విధమైన అపశృతులు చోటుచేసుకున్నాయో ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. తీరు మార్చుకోకుంటే వచ్చే ఎన్నికల్లో 11 సీట్లు కూడా వైసీపీకి దక్కవన్నారు. రాష్ట్రరాజధానిగా అమరావతిని దేశంలోనే ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కూటమి సర్కారు పనిచేస్తోందన్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపేందుకు కలిసి నడుస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, సీనియర్ నేత వర్ల రామయ్య మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా జరుగుతున్న కూటమి సుపరిపాలనతో కొంతమంది గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. అభివృద్ధి కావాలో...అరాచకం కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. సొంత నియోజకవర్గం మంగళగిరిని మంత్రి నారా లోకేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత మాట్లాడుతూ రైతుల అభివృద్ధే నిజమైన అభివృద్ధిగా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నదాతలను ఆదుకుంటున్నారని చెప్పారు. మంగళగిరి నియోజకవర్గంలోని 13,483 మంది రైతులకు రూ.9.85 కోట్ల వేల నగదు చెక్కును అందించారు. టీటీడీ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, పల్లపోతు శ్రీనివాసరావు, యార్డుచైర్మన్‌లు ఉన్నం ఝాన్సీరాణి, జవ్వాది కిరణ్‌చంద్, ఎంపీపీ షేక్ జబీన్, దుగ్గిరాల, తాడేపల్లిరూరల్, మంగళగిరి తె.దే.పా అధ్యక్షులు కేసంనేని శ్రీఅనిత, దాసరి కృష్ణ, పల్లపోతుల శ్రీనివాసరావు, పరిశీలకుడు ఎం. సత్యనారాయణ, కొంగర జోగేంద్రప్రసాద్, గూడూరు వెంకట్రావు, పసుపులేటి గణేశ్, ఎంపీ ఎంఐఎస్ డీసీ చైర్మన్ చల్లపల్లి శ్రీనివాసరావు, ఏడీఏ టీ. శ్రీనివాసరావు, ఏఓలు విజయబాబు, శిరీష, శైలజ, యార్డు స్పెషల్‌గ్రేడ్ సెక్రటరీ జేవీ సుబ్బారావు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

60 మంది పిల్లలకు.. క్యాన్సర్ నిరోధక వ్యాక్సిన్

● మహేష్‌బాబు ఫౌండేషన్ సహకారంతో బుర్రిపాలెంలో వైద్యశిబిరం



గుండె ఆపరేషన్ చేయించుకున్న పిల్లలతో వైద్యులు

విజయవాడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మహేష్‌బాబు ఫౌండేషన్ సౌజన్యంతో బుర్రిపాలెంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించి 60 మంది పిల్లలకు క్యాన్సర్ నిరోధక హ్యూమన్ పాపిల్లోమా వైరస్ వాక్సిన్ (సర్వైకల్ కేన్సర్ రాకుండా) రెండో డోసు వేసినట్టు ఆంధ్ర ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పి.వి.రావు తెలిపారు. విజయవాడలోని ఆంధ్రా హార్ట్ అండ్ బ్రెయిన్ ఇనిస్టిట్యూట్ ఆసుపత్రిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నటుడు మహేష్‌బాబు కుమార్తె సితార పుట్టినరోజు సందర్భంగా మహేష్‌బాబు దత్తత బుర్రిపాలెంలో శనివారం ఆంధ్రా ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించామన్నారు. సీజనల్ వ్యాధులు వైరల్ ఫీవర్, మలేరియా, టైఫాయిడ్ గురించి అవగాహన కల్పించామన్నారు. బుర్రిపాలెంలోని ఘట్టమనేని నాగరత్తమ్మ పాఠశాల నుంచి వచ్చిన 148 మంది పిల్లలకు వైద్యపరీక్షలు జరిపి మందులు అందజేశామన్నారు. ఇప్పటి వరకు బుర్రిపాలెంలో 44 వైద్య శిబిరాలు నిర్వహించినట్టు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు 35 గుండె వైద్యశిబిరాలు నిర్వహించామన్నారు. యూకేకు చెందిన హీలింగ్ లిటిల్‌హార్ట్ చారిటీ కూడా ఆంధ్రా ఆసుపత్రి ఆధ్వర్యంలో క్యాంపులు నిర్వహించిందన్నారు. 2015 నుంచి ఆంధ్రా ఆసుపత్రిలో గుండెకు సంబంధించిన సర్జరీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన ఒక్కొక్క శిబిరంలో 25 నుంచి 30 ఆపరేషన్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సయోద్ ముదసిర్, డాక్టర్ భూగణేష్, మహేష్‌బాబు ఫౌండేషన్ ద్వారా గుండె సర్జరీలు చేయించుకున్న చిన్నారులు తల్లులతో కలిసి పాల్గొన్నారు.

ఆనంద సాగర్


సెల్ఫీలు దిగుతున్న పర్యాటకులు

విజయపురిసౌత్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 18 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తుండడంతో పర్యాటకుల తాకిడి శనివారం భారీగా పెరిగింది. తెలుగు రాష్ట్రాల నుంచి కుటుంబాలతో వచ్చి.. సాగర్ నూతన, పాత బ్రిడ్జి, లాంచీ స్టేషన్ ప్రాంతాల్లో సందడి చేశారు. లాంచీలలో నాగార్జున కొండకు తరలి వెళ్లారు. కొండలోని మ్యూజియం సందర్శించారు. పచ్చని కొండల మధ్య ఉన్న అనుపు, యాంపీ స్టేడియం, అశ్వమేధ యజ్ఞశాల, శ్రీరంగనాథ స్వామి దేవాలయం, ఎత్తిపోతల జలపాతం అందాలను వీక్షించారు. శనివారం లాంచీల ద్వారా రూ.1,00,450 ఆదాయం సమకూరినట్లు యూనిట్ అధికారులు తెలిపారు.

జగన్ హత్యకు ప్లాన్ అంటూ కట్టు కథనం..

● కేసు నమోదుతో హైకోర్టుకు విలేకరి

గుంటూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హత్యకు అమెరికాలో శిక్షణ పొందిన 200 మంది షార్పు షూటర్స్ రంగంలోకి దిగారని ఓ చానల్‌లో కట్టు కథనం అల్లిన పత్రి వాసుదేవన్ అనే విలేకరి హైకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదైన కేసును కొట్టేయాలని క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. జగన్‌కు ప్రభుత్వం సరైన భద్రత కల్పించడం లేదని గత నెల 20న ప్రసారమైన కథనంపై.. స్వర్ణ భారతినగర్ 41వ డివిజన్ జనసేన ఉపాధ్యక్షుడు యర్రంశెట్టి హరినాథ్ నల్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు హైదరాబాద్‌లో ఆఫీసుకు వెళ్లి నోటీసులు ఇచ్చేందుకు చూడగా.. అప్పటికే ఆ విలేకరి పరారయ్యాడు. అనంతరం చానల్ చీఫ్ ఎడిటర్ భావనారాయణ నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు వచ్చి.. ఆ విలేకరితో తమకెలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. విలేకరి అందుబాటులో లేడని.. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని నల్లపాడు సీఐ వంశీధర్ తెలిపారు.

సమాజ నిర్మాణంలో యువ ఇంజనీర్లు భాగస్వాములు కావాలి

● జేఎన్‌టీయూ(కే) రెక్టార్ ఆచార్య వీవీ సుబ్బారావు

● ఘనంగా కళ్ళం ఇంజనీరింగ్ కళాశాల స్నాతకోత్సవం



విద్యార్థినికి అందజేస్తున్న జేఎన్‌టీయూ(కె) రెక్టార్ ఆచార్య వీవీ సుబ్బారావు, కళ్ళం మోహనరెడ్డి

గుంటూరు(విద్య), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): యువ ఇంజనీర్లు నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, దేశాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని జేఎన్‌టీయూ(కే) రెక్టార్ ఆచార్య వీవీ సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. చౌడవరంలోని కళ్ళం హరనాథరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకరరెడ్డి అధ్యక్షత వహించారు. ఆచార్య వీవీ సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవడంతో పాటు ఉద్యోగాల కల్పనకు కృషి చేయాలన్నారు. అప్పుడే దేశ ప్రగతికి బాటలు పడతాయన్నారు. కళాశాల చైర్మన్ కళ్ళం మోహనరెడ్డి మాట్లాడుతూ కళాశాల స్థాపించిన 11 సంవత్సరాల్లోనే ఎన్‌బీఏ, నాక్-ఏ గ్రేడు, స్వయం ప్రతిపత్తి(ఆటానమస్)హోదా సాధించి.. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలతో విద్యను అందిస్తున్నామని చెప్పారు. . ఈ కార్యక్రమంలో పిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, అకాడమిక్ డీన్ డాక్టర్ షణ్ముఖ రావు, స్నాతకోత్సవ డాక్టర్ సన్నీ డియోల్, కళాశాల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కళ్ళం నవ్య, ఉపాధి కల్పన అధికారి డాక్టర్ పీఎల్ మాధవరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు.

తెనాలి కళాకారుడికి 'బళ్లారి రాఘవ' రాష్ట్రస్థాయి అవార్డు

● అనంతపురంలో ప్రదానం


అవార్డు అందుకుంటున్న మేరిగె రామలింగేశ్వరరావు

గుంటూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సమాజంలో మార్పు కోసం బళ్లారి రాఘవ పరితపించారని డీఆర్వో మలోల అన్నారు. దీనికోసం ఆయన రంగస్థలాన్ని వేదికగా చేసుకున్నారని పేర్కొన్నారు. అనేక పౌరాణిక, సాంఘిక నాటకాలలో ఆయన జీవించారని కొనియాడారు. బళ్ళారి రాఘవ 145వ జయంతిని పురస్కరించుకుని అనంతపురం జిల్లా కేంద్రంలోని లలిత కళా పరిషత్ ఆవరణలో శనివారం సాయంత్రం 'బళ్లారి రాఘవ' అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది గాజుల పద్మజ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. డీఆర్వో, టౌన్ ప్లానింగ్ ఏడీ సువర్ణ తదితరులు హాజరై బళ్లారి రాఘవ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం 2025 సంవత్సరానికి మేరిగె రామలింగేశ్వరరావు(తెనాలి), భూపతి ధర్మారావు(రేపల్లె)కు రాష్ట్రస్థాయి బళ్లారి రాఘవ అవార్డును అందజేసి సత్కరించారు. అనంతరం 'గోవు మా లచ్చిమి' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. కళాకారులు వెంకటరామిరెడ్డి, అరుణ్‌బాబు, ఎస్‌యం బాషా, జ్యోతిరాణి తమదైన శైలిలో నటించి మెప్పించారు. కార్యక్రమంలో లలితకళా పరిషత్ ఉపాధ్యక్షుడు రామగోవింద్ సాగర్, వడ్డెర సంఘం నాయకుడు రాజేష్, నారాయణస్వామి, వెంకట సుబ్బయ్య, భగవాన్, రంగప్ప, రఘు, అస్లాంబాషా, లోకేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ విలేకరులకు శిక్షణ అవసరం

● ప్రెస్ అకాడమీ చైర్మన్ సురేష్ కుమార్



సభలో ప్రసంగిస్తున్న ఆలపాటి సురేష్

తెనాలి అర్బన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : శాసన సభ, కార్య నిర్వాహణ శాఖ, న్యాయ వ్యవస్థ, జర్నలిజం ఈ నాలుగు సమాజానికి మూల స్తంభాలని ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం గుంటూరు జిల్లా తెనాలిలో గ్రామీణ విలేకరులకు రెండు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సురేష్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిజం పల్చబడటంతో సమాజంలో వారి పట్ల కొంత గౌరవం తగ్గిందన్నారు. నైతిక నిష్ట తగ్గడం, మరికొన్ని కారణాలు జర్నలిజం వృత్తికి గౌరవం తగ్గిస్తున్నాయని చెప్పారు. వృత్తిలో అను నిత్య విద్యార్థిగా ఉన్నప్పుడే నిజమైన జర్నలిస్టు అవుతారని చెప్పారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే విలేకరులకు శిక్షణ అవసరమన్నారు. ఏపీడబ్ల్యుజె అధ్యక్షులు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య నిజమైన వారధిలా జర్నలిస్టులు పాత్ర పోషించాలన్నారు. నాగార్జున యూనివర్శిటీ జర్నలిజం విభాగం మాజీ హెచ్‌వోడి అనిత జర్నలిజంలో నైతిక నిష్ట అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మీరా, ప్రవాస భారతీయుడు డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి, తెనాలి డబుల్ హార్స్ సంస్థ ఎండీ మునగాల మోహనశ్యాంప్రసాద్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఏచూరి శివ, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

13న 'బసవతారకం' హాస్పిటల్ నిర్మాణానికి శంకుస్థాపన

● స్థలాన్ని పరిశీలించిన బాలకృష్ణ


స్థల పరిశీలనలో హాస్పిటల్ సీఈఓ బాలకృష్ణ

తుళ్లూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వం తుళ్లూరు రెవెన్యూలో 21 ఎకరాలను కేటాయించింది. అందులో హైటెన్షన్ లైన్ వెళ్తుండడంతో.. ఇటీవలే మార్చారు. శనివారం హాస్పిటల్ సీఈవో హిందుపురం ఎమ్మెల్యే బాలకృష్ణ భూమి చదును పనులు పరిశీలించారు. ఈ నెల 13న ఉదయం 10 గంటలకు శాస్త్రోక్తంగా శంకుస్థాపన చేయనున్నట్టు బాలకృష్ణ తెలిపారు. నిర్మాణ మ్యాప్‌ను ఆయన పరిశీలించారు. బాలకృష్ణ అభిమాన సంఘం సభ్యులు ఆయనను కలిశారు. సీఆర్డీఏ అధికారులు ఉన్నారు. సీఎం చంద్రబాబు శంకుస్థాపనకు వస్తున్నట్టు చెప్పారు. మూడు దశల్లో హాస్పిటల్ నిర్మాణం జరుగుతుందని బాలకృష్ణ వెల్లడించారు. మంచి సందేశాత్మక చిత్రాలలో నిటిస్తానని ఈ సందర్భంగా బాలకృష్ణ ముచ్చటించారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



ఎమ్మెల్యే నసీర్‌ను సన్మానిస్తున్న అంజుమన్, మైనార్టీ నేతలు

ప్రజాసేవకు పునరంకితమైతే పదవులొస్తాయి

● ఎమ్మెల్యే నసీర్‌ను సత్కరించిన మైనార్టీ నేతలు

గుంటూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రజాసేవకు పునరంకితమైతే పదవులు వెతుక్కుంటూ వస్తాయని చెప్పడానికి గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అంజుమన్-ఏ-ఇస్లామియా కమిటీ అధ్యక్షుడు నసీర్ నిదర్శనమని పలువురు నేతలు అన్నారు. అసెంబ్లీ మైనార్టీ కమిటీ చైర్మన్‌గా నసీర్ నియమితులైన సందర్భంగా శనివారం అంజుమన్ పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. అంజుమన్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ అంజుమన్ పాఠశాల అభివృద్ధికి ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. ఈ పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు ఒక గొప్ప చరిత్ర అన్నారు. కేవలం మధ్యాహ్న భోజనమే కాకుండా విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి అందించడంతోపాటు మౌలిక వసతులు కల్పిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల పట్ల అంకితభావం కలిగిన నాయకులకు పదవులు వస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నసీర్ ద్వారానే మైనారిటీల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. నసీర్ ఎమ్మెల్యే మాట్లాడుతూ తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. కార్యక్రమంలో సైదా, జహీద్, రఫీ, షౌకత్, బషీ, మహబూబ్, షరీఫ్, డాక్టర్ అన్సార్, మౌలానా రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

విధ్వంసం నుంచి వికాసం వైపు పయనం: ఎమ్మెల్యే నసీర్

గత ఐదేళ్ల కాలంలో విధ్వంసంగా మారిన రాష్ట్రం అభివృద్ధి వికాసం వైపు పయనిస్తోందని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన నగరంలోని 12వ డివిజన్‌లో పర్యటించారు. తాము ఎన్నికల సమయంలో ఈ ప్రాంతంలో పర్యటించామని, అప్పుడు కనీసం రోడ్డు కూడా లేని పరిస్థితి ఉండేదని చెప్పారు. సందర్భంగా ఓ మహిళ ఎమ్మెల్యే వద్దకు వచ్చి తమ ఇల్లు కూలిపోయే పరిస్థితిలో ఉందని, తమ ఇద్దరు బిడ్డలను చదివించుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్యే నసీర్ వెంటనే స్పందించి ఇల్లు నిర్మాణానికి సహకరిస్తానని, ఆమె పిల్లల చదువులకు అండగా నిలబడతానని భరోసా ఇచ్చారు.



జిల్లా జైలు అధికారులతో మాట్లాడుతున్న నగర మేయర్ రవీంద్ర

జిల్లా జైలులో మౌలిక వసతులు కల్పిస్తాం

● మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా జైలులో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. నగర పాలక సంస్థ ఛాంబర్‌లో జిల్లా జైలు సూపరింటెండెంట్ ఏ.వి రాంతరాజు శనివారం మేయర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి జిల్లా జైలులో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతిపత్రం సమర్పించారు. సందర్భంగా జైలు సూపరింటెండెంట్ మాట్లాడుతూ సదరు జైలును 1920లో అప్పటి అవసరాలకు తగ్గట్టుగా నిర్మించారన్నారు. ప్రస్తుతం సదరు సబ్ జైలులో అనేక సమస్యలు ఉన్నాయని, ముఖ్యంగా డ్రైనేజీ, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. వర్షాకాలంలో ఈ సమస్య మరీ తీవ్రంగా ఉంటుందని, దాని వలన జైలు సిబ్బంది అనారోగ్యం పాలవుతున్నారన్నారు. సదరు జైలులో అదనపు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, అలాగే మెరుగైన తాగునీటి సరఫరా చేయాలన్నారు. స్పందించిన మేయర్ రవీంద్ర మాట్లాడుతూ, జిల్లా జైలులో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, సదరు పనుల నిర్వహణ కోసం అధికారులను కేటాయించి, పనులు త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రసవించిన గంటలోనే బిడ్డలకు పాలు పట్టాలి

● గైనకాలజిస్ట్ శనక్కాయల రాజకుమారి వెల్లడి

గుంటూరు మెడికల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తల్లి ప్రసవించిన తర్వాత మొదటి గంటలోనే బిడ్డకు పాలు పట్టాలని గైనకాలజిస్ట్ డాక్టర్ శనక్కాయల రాజకుమారి తెలిపారు. కొత్తపేటలోని అహల్య హాస్పిటల్‌లో శనివారం జరిగిన తల్లిపాల ప్రోత్సాహక వారోత్సవాల్లో గర్భిణులు, బాలింతలను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. ప్రసవానంతరం తల్లికి ప్రసవించే పాలను ముర్రుపాలు అంటారని, ఈ పాలలో బిడ్డకు అవసరమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయని ఆమె వివరించారు. బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని కూడా ఇవి పెంపొందిస్తాయన్నారు. పిల్లల మెదడు మెరుగుపడటంలో తల్లి పాలు సహాయపడతాయని ఆమె వివరించారు. ఆరు నెలలు తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆహారమన్నారు. ఆరు నెలలు దాటిన తర్వాత తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం కూడా ఇవ్వాలని డాక్టర్ రాజకుమారి తెలిపారు. తల్లి పాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలతో పాటు వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నట్లు గైనకాలజిస్ట్ డాక్టర్ రాజకుమారి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీష, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ కరీమా, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



తల్లిపాల అవగాహన కార్యక్రమంలో డాక్టర్ రాజకుమారి

స్విగ్గీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): స్విగ్గీ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవాధ్యక్షుడు బి.ముత్యాలరావు డిమాండ్ చేశారు. స్థానిక లాడ్జి సెంటర్లో శనివారం జరిగిన స్విగ్గీ కార్మికుల నిరసనల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పదేళ్లుగా పని చేస్తున్న కార్మికులకు సంస్థ కొత్త విధానాన్ని తీసుకువచ్చి, పే-ఔట్, ఇన్సెంటివ్‌లు రద్దు చేయడం అన్యాయమని అన్నారు. రెండు రోజుల సెలవుపెట్టినా వారి ఐడిలను బ్లాక్ చేస్తున్నారని అన్నారు. సంస్థ యాజమాన్య ప్రతినిధులు సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. దీంతో మూడు రోజుల నుంచి స్విగ్గీ కార్మికులు సమ్మె చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు అంజిరెడ్డి, షేక్ జబీర్, బి హిమ శ్యామ్‌సింగ్, వి సందీప్, కె.మోక్షకుమార్, ఎ.రంగనాథ్, కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



లాడ్జీ సెంటర్లో జరిగిన నిరసనల్లో పాల్గొన్న సీఐటీయూ నాయకులు, స్విగ్గీ కార్మికులు

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

● కమిషనర్ పులి శ్రీనివాసులు



తుఫాన్ నగర్‌లో పర్యటిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో పార్కింగ్ లేకుండా ట్రాఫిక్‌కి అంతరాయం కలిగించే హోటల్స్ రెస్టారెంట్లు, టీ, టిఫిన్ స్టాల్స్‌పై చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శ్రీకృష్ణదేవరాయ నగర్, భాగ్యనగర్, తుఫాన్ నగర్, పెద్ద పలకలూరు తదితర ప్రాంతాల్లో శనివారం ఆయన పర్యటించి పారిశుధ్యం, ఖాళీ స్థలాల్లో బోర్డులు, ఇంటి పన్నులు అంశాలపై అధికారులకు తీసుకోవాల్సిన చర్యలపై తగు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో శంకర్ విలాస్ వంతెన నిర్మాణ పనుల వలన ట్రాఫిక్ సమస్య రాకుండా ఇప్పటికే రోడ్ల విస్తరణ, ఆక్రమణల తొలగింపు చేపట్టామన్నారు. గుజ్జనగుండ్ల సెంటర్‌లోని రవి క్రేజీ ఫుడ్స్ నిర్వాహకులకు గతంలోనే పలుమార్లు ట్రాఫిక్ సమస్య లేకుండా హోటల్‌కి వచ్చే వారి వాహనాలు పెట్టుకోవడానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించామని, అయినప్పటికీ పట్టించుకోలేదన్నారు. ట్రాఫిక్ సమస్యల వలన ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కల్గించే సదరు హోటల్‌ని తక్షణం సీజ్ చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించగా వారు సీజ్ చేశారు. అనంతరం స్తంభాలగరువు, భాగ్యనగర్, తుఫాన్ నగర్‌లలో పర్యటించి, ఆయా ప్రాంతాల్లో ఇళ్ల యజమానులు ఆస్తి, నీటి పన్ను చెల్లించడం లేదని గుర్తించి, జీఎంసీ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించే లక్ష్యంతో కృషి చేస్తున్నందున పన్నులు సకాలంలో చెల్లించాలని, లేకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పెదపలకలూరులో ప్రజల ఫిర్యాదు మేరకు ఆయా ఖాళీ స్థల యజమానులకు శుభ్రం చేసుకోవాలని నోటీసులు ఇవ్వాలని, స్పందించని వారి స్థలాల్లో జీఎంసీ బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఏసీపీ రెహ్మాన్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

హోమ్ బేకింగ్‌లో శిక్షణ

గుంటూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఛాంబర్స్, ఐటీసీ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళ సాధికారత కోసం హోమ్ బేకింగ్ శిక్షణా కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు రెండు సంస్థలు శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపాయి. హెల్తీ హోమ్ బేకింగ్ ట్రైనింగ్ పేరిట నిర్వహించబోతున్న ఈ కార్యక్రమం ద్వారా మహిళలు సర్టిఫైడ్ బేకింగ్ నైపుణ్యాలను అభ్యసించి ఆర్థికంగా బలపడటానికి దోహదపడుతోందని పేర్కొన్నాయి. ఇందులో భాగంగా గుంటూరులో శిక్షణా కార్యక్రమం జరగనుంది. ఆగస్టు 4, 5, 6 తేదీల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 3 గంటల వరకు శిక్షణ సాగనుంది. అరండల్‌పేట 3/3వ లైనులోని యోగీ భవన్‌లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశాయి. ఈ శిక్షణా కార్యక్రమం ప్రారంభోత్సవానికి ఐటీసీ ఏఐ ఉపాధ్యక్షుడు పీ.వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అలానే పొట్లూరి భాస్కరరావు (ఏపీ ఛాంబర్స్ అధ్యక్షుడు), బీ.రాజశేఖర్ (జనరల్ సెక్రటరీ), మహిళా వ్యాపారవేత్తల గుంటూరు వింగ్ చైర్‌పర్సన్ సక్కు మాధవి, ఉపాధ్యక్షురాలు డాక్టర్ మమత రాయపాటి తదితరులు అతిథులుగా హాజరు కానున్నారు. ఈ కార్యక్రమం ద్వారా కొత్త బేకింగ్, వ్యాపార నైపుణ్యాలు, ఆర్థిక ప్రణాళిక పాఠాలు, మార్కెట్ అవకాశాలు, ప్రభుత్వ సబ్సిడీలు, గ్యారంటీలు, రుణాలు, మార్కెటింగ్ లింకేజీలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరుకానున్న ఔత్సాహికులు కనీసం ఎనిమిదో తరగతి పాసై 16 సంవత్సరాల వయస్సు కలిగివుండాలని తెలిపాయి.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై జరుగుతున్న సంగీత నృత్య కార్యక్రమాలు అలరిస్తున్నాయి. తొలుత ఆలయ పాలకమండలి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, విశ్రాంత ప్రిన్సిపల్ హిందూ కళాశాల డాక్టర్ దీవి నరసింహ దీక్షితుల వారిచే నారాయణ తీర్థులు ప్రబోధించిన నమ సంప్రయోగ వైభవంపై ప్రసంగించారు. అనంతరం తిరుపతికి చెందిన కళారత్న డాక్టర్ ద్వారం లక్ష్మి సంగీత కచేరి రసభరితంగా సాగి శ్రోతలను అలరించింది. వారికి వయోలిన్‌పై పెరవలి నందకుమార్, మృదంగంపై కె.సద్గురుచరణ్, ఘటంపై శ్రీహరిబాబు వాయిద్య సహకారం అందించారు.



కీర్తనలను ఆలపిస్తున్న ద్వారం లక్ష్మి

5న పాలిసెట్ విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు(విద్య), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడులోని ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 5న పాలిసెట్ విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ తాళ్ళూరి శేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పది మార్కుల జాబితా, టీసీ, 4 నుంచి పది వరకు స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రాలతో 5న ఉదయం 10 గంటలకు కళాశాలలో హాజరుకావాలని సూచించారు.

టెక్స్‌టైల్ పాలిటెక్నిక్ కళాశాలలో....

నల్లపాడులోని ప్రభుత్వ టెక్స్‌టైల్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 5వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సిహెచ్ శైలజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో స్పిన్నింగ్, వీవింగ్, గార్మెంట్, ఫ్యాషన్, మెడికల్ టెక్నాలజీ, ఎరోస్పేస్ టెక్స్‌టైల్ టెక్నాలజీ తదితర కోర్సుల్లో ప్రవేశం కోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాలిసెట్ రాసిన వారు పది పాస్ అయిన వారు స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావచ్చునని తెలిపారు. ఇతర వివరాల కోసం 9912342063, 9441989349లో సంప్రదించాలని సూచించారు.

శ్రీ అభయ వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

తెనాలి రూరల్, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరు కోనేటి పురంలో కొలువుదీరి ఉన్న శ్రీ అభయ వీరాంజనేయస్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామి వారి ఉత్సవమూర్తులను మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

ప్రభుత్వ ఉత్తర్వులు....ప్రజాస్వామ్య విరుద్ధం

● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ

గుంటూరు(తూర్పు), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థలలో విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు..ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ అన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక కొత్తపేట, భగత్‌సింగ్ విగ్రహం వద్ద జరిగిన నిరసనల్లో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, హక్కుల కోసం, విద్యా రంగంలో ఉన్న అన్యాయాలపై పోరాటాలు చేస్తున్న విదార్థి సంఘాలను అణగదొక్కేందుకే ఈ ఉత్తర్వులను జారీ చేసిందన్నారు. ఈ నిర్ణయం ప్రభుత్వ నియంతృత్వ ధోరణిని ప్రతిబింబిస్తోందని అన్నారు. విద్యార్థుల అభివృద్ధికి పూర్తిగా విరుద్ధమని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం సీజ్

గుంటూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : చుట్టుగుంట శాంతినగర్ రెండో లైనులో అక్రమ రేషన్ బియ్యాన్ని సంబంధిత అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాత్రి 10 గంటలకు జిల్లా డీఎస్ఓ స్వామి ఆధ్వర్యంలో డిపో నెంబర్ 174 చౌక ధరల దుకాణ కేంద్రంలో పేద ప్రజలకు అందాల్సిన బియ్యాన్ని వాళ్లకు ఇవ్వకుండా.. ప్రైవేట్ మార్కెట్ కు అమ్ముకోవడానికి ప్రయత్నం చేస్తుండగా సివిల్ సప్లైస్ అధికారులు చౌక ధరల దుకాణ కేంద్రంలో తనిఖీ చేసి 400 బస్తాలు పైగా పట్టుకున్నారు.

ఏటీ అగ్రహారంలో బావిలో పడి వ్యక్తి మృతి



బావిలో రాజా సాహెబ్ మృతదేహం

గుంటూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏటీ అగ్రహారం 2/2లోని బోరింగ్ పంపు సెంటర్ సమీపంలోని విజేత స్కూల్ వద్ద ఓ బావిలో పడి అదే ప్రాంతానికి షేక్ రాజా సాహెబ్ (60) అనే వ్యక్తి మృతి చెందాడు. శనివారం తెల్లవారు జామున సుమారు 4 గంటల సమయంలో రాజా సాహెబ్ బావిలో పడ్డాడు. ఈ మేరకు శనివారం పగలు బావిలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి జీజీహెచ్ మార్చురీకి తరలించారు. రాజా సాహెబ్ గతంలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన మార్చురీలో పని చేశాడు. ఆయన కొంత కాలంగా టీబీ వ్యాధితో బాధ పడుతున్నాడు. ఇందుకుగాను ఆయన కొద్ది రోజులు జ్వరాల ఆసుపత్రిలో చికిత్స తీసుకుని నాలుగు రోజుల క్రితమే ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యాడు. ఇంతలో బావిలో పడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అయితే రాజా సాహెబ్ బావి అరుగు మీద కూర్చుని జారిపడి ఉంటాడని ఆయన భార్య ఆదంబి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లాటరీ టిక్కెట్లు విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

గుంటూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పట్నంబజార్, తమిళనాడు బ్యాంకు ఎదురు సందులో లాటరీ టికెట్లు అమ్ముతున్న కూరపాటి రంగారావు, మునావత్ గునియా అనే ఇద్దరు వ్యక్తులను లాలాపేట పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. వారి వద్ద నుంచి రూ.9630 నగదు, లాటరీ స్లిప్స్ బుక్‌ను తదుపరి దర్యాప్తు నిమిత్తం స్వాధీనపరుచుకున్నట్లు పోలీసులు తెలిపారు.

అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు గడువు పెంపు

● డిసెంబరు 31 వరకు పొడిగింపు

● 50 శాతం రాయితీతో చెల్లించుకునే సదవకాశం

● గుంటూరు సర్కిల్ ఎస్‌ఏవో రామిరెడ్డి

గుంటూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గృహ విద్యుత్ వినియోగదారులకు అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు విద్యుత్ శాఖ మరోసారి అవకాశం కల్పించింది. గతంలో నాలుగు నెలల పాటు అదనపు లోడు క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించిన యంత్రాంగం మరోసారి డిసెంబరు 31 వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కేవలం ఈ అవకాశం స్వచ్ఛందంగా అదనపు లోడ్ చెల్లించే గృహ విద్యుత్ వినియోగదారులకు మాత్రమేనని గుంటూరు సర్కిల్ ఎస్‌ఏవో పాశం రామిరెడ్డి స్పష్టం చేశారు. కిలో వాట్‌కు 50 శాతం చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. వాస్తవానికి విద్యుత్ కనెక్షన్ తీసుకొన్న తొలి నాళ్ళలో కిలో వాట్, అంత కన్నా తక్కువ సామర్థ్యం కలిగిన కనెక్షన్‌లను తీసుకున్నారు. ప్రస్తుతం విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. గృహాల్లో ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు పెద్ద ఎత్తున పెరుగుతున్నాయి. గృహాల్లో టీవీలు, ఫ్యాన్‌లతో పాటు ఏసీలు, వాటర్ మోటార్‌లు, గీజర్‌లు, వాషింగ్‌మెషీన్‌లు సర్వ సాధారణమై పోయాయి. ఇలా ఒక్కో ఇంట్లో ఒక్కో రకంగా వినియోగం గణనీయంగా పెరగటంతో నాలుగు నుంచి ఐదు కిలోవాట్స్ వినియోగం జరుగుతున్నట్లు అధికారులు తనిఖీల్లో తేలుతుంది. ఇందు కోసం కిలో వాట్ లోడ్‌కు గతంలో రూ.2250 చెల్లించాల్సి ఉండేది. ప్రస్తుతం 50 శాతం రాయితీతో రూ.1250 చెల్లించుకోవచ్చని తెలిపారు. కిలో వాట్ ధర రూ.1000 కాగా సెక్యూరిటీ డిపాజిట్ కింద కిలో వాట్‌కు రూ.200, అప్లికేషన్ ఫీజు మరో రూ.50 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

అదనపు లోడ్	- పాత ధర	- రాయితీ ధర
1 కిలో వాట్	రూ.2250	రూ.1250
2 కిలో వాట్	రూ.4450	రూ.2450
3 కిలో వాట్	రూ.6650	రూ.3650
4 కిలో వాట్	రూ.8850	రూ.4850
5 కిలో వాట్	రూ.11050	రూ.6050

అవగాహన కల్పించటంలో విఫలమవుతోన్న యంత్రాంగం

అయితే అదనపు లోడ్‌కు రాయితీ ధరపై వినియోగదారుల్లో అవగాహన కల్పించటంలో విఫలమవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇటీవల విద్యుత్ ఆపరేషన్, విజిలెన్స్ బృందాలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తోన్న సందర్భాల్లో అనేక ప్రాంతాల్లో అదనపు లోడ్ వినియోగంపై కేసులు నమోదవుతున్నాయి. ఇటీవల తనిఖీల్లో కూడా కనెక్షన్ తీసుకున్న లోడ్ కంటే అదనపు లోడ్ వినియోగంపై 300లకు పైగా కేసులు నమోదు చేశారు. పైగా తనిఖీల్లో కేసులు నమోదైతే రాయితీ ధర కూడా వర్తించదని, పూర్తి స్థాయిలో ధర చెల్లించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. రాయితీ ధరపై సామాజిక మాధ్యమాలతో పాటు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాల్సిందిగా ఇటీవల పర్యటనకు వచ్చిన సీఎండీ పుల్లారెడ్డి, టెక్నికల్ డైరక్టర్ ఆవుల మురళీకృష్ణయాదవ్‌లు అధికారులను ఆదేశించారు. గతంలో మార్చి 1 నుంచి జూన్ 30 వరకు రాయితీ గడువు ఇచ్చిన విద్యుత్ యంత్రాంగం వినియోగదారుల్లో ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవటంతో ఆ గడువు కాస్త పొడిగించింది. ఆగస్టు 1 నుంచి డిసెంబరు 31 వరకు అదనపు లోడు క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మాధవి, పక్కన మేయర్, అధికారులు

అభివృద్ధి పథంలో ముందుకు వెళుతున్న పశ్చిమ నియోజకవర్గం

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

● ప్రతిష్టాత్మక వీఐపీ రోడ్డు అభివృద్ధికి శంకుస్థాపన

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తున్నదని, అభివృద్ధిలో భాగంగా శనివారం వీఐపీ రోడ్డు అభివృద్ధికి రూ.3 కోట్లతో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించామని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ గడిచిన 5 సంవత్సరాలుగా వైసీపీ నేతలు ఈ రోడ్డు అభివృద్ధిని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. 21, 25 రెండు డివిజన్లలో ఇప్పుడు అభివృద్ధి స్పష్టంగా కనపడేలా మారుతుందని, ఇది ప్రజల సహకారంతోనే సాధ్యమైందన్నారు. అభివృద్ధిలో భాగంగా దాదాపు రూ.2.91 కోట్లతో మూడు కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణాన్ని హైవే దాకా బిటి రోడ్డుగా విస్తరించటం, అదేవిధంగా ఒక కాల్వ నిర్మాణం, దీని కోసం అదనంగా రూ.50 లక్షలతో పనులు చేపట్టామన్నారు. గతంలో టెండర్ అనంతరం కొన్ని టెక్నికల్ ఇబ్బందుల వల్ల కాలువ పనులు నిలిచిపోయాయని, ఇప్పుడు కొత్త టెండర్ ద్వారా అన్ని పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. గతంలో హైవే నుంచి హెవీ వెహికల్స్ ఇక్కడికి రావడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ రహదారిని డైవర్షన్ చేసి, వీటిని నియంత్రించేందుకు కృషి చేస్తామన్నారు. అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్న మేయర్ రవీంద్ర, అధికారులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ధన్యవాదాలు తెలిపారు.

విలువలు లేని పార్టీకి ప్రజల్లో స్థానం ఉండదు

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): విలువలూ, విశ్వసనీయత లేని వైసీపీకి ప్రజల్లో స్థానం ఉండదని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. గుంటూరు పశ్చిమ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళల గురించి అసభ్యంగా మాట్లాడిన నేతలను పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి స్వయంగా హెలికాప్టర్‌లో వచ్చి, వారిని ప్రోత్సహించిన తీరు మహిళలను తీవ్రంగా బాధించిందని అన్నారు. నెల్లూరులో జరిగిన జగన్‌రెడ్డి పర్యటన సందర్భంగా ప్రజలు ముఖం చాటేశారని, ఖాళీ కుర్చీలతో కార్యక్రమాలు జరగ్గా, ఇతర ప్రాంతాల గ్రాఫిక్స్‌ని చూపించాల్సిన దుస్థితికి వైసీపీ దిగజారిందని ఆమె ఎద్దేవా చేశారు. ప్రజలు వైసీపీపై విశ్వాసం కోల్పోయారన్న స్పష్టమైన సంకేతం కనిపించిందన్నారు. మహిళల్ని గౌరవించని పార్టీకి ప్రజలు దూరం అవుతారు. అత్యంత దుర్మార్గంగా మాట్లాడిన ప్రసన్నకుమార్‌రెడ్డిని జగన్ రెడ్డి పరామర్శించడాన్ని ప్రజలు క్షమించరన్నారు. ఒక వైపు తమ పార్టీ కార్యకర్తలు తేడాగా మాట్లాడినా కేసులు పెట్టించి జైలుకు పంపించిన తత్వాన్ని పాటించామని, మరి మహిళలను అవమానించిన వాళ్ల విషయంలో జగన్ ఎందుకు మద్ధతు పలుకుతున్నారని నిలదీశారు. సొంత తల్లి, చెల్లిని గౌరవించని జగన్, రాష్ట్రంలోని మిగతా మహిళలను ఎలా గౌరవిస్తారు? అందుకే రాష్ట్ర ప్రజలు ఓటుతోనే సమాధానం చెబుతున్నారన్నారు. వైసీపీకి ఇక ప్రజల్లో స్థానం లేదన్నారు. విలువలతో కూడిన నాయకత్వం, మహిళల గౌరవం, రైతుల న్యాయం కోరుకునే ప్రజలు ఇకపైన మీ మాటలు వినే స్థితిలో లేరని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తేల్చి చెప్పారు.

రైతు పక్షపాతి సీఎం చంద్రబాబు

● రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజా మాస్టారు

గుంటూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతు పక్షపాతి అని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దాసరి రాజామాస్టారు అన్నారు. 'అన్నదాత సుఖీభవ' పథకం ప్రారంభోత్సవం సందర్భంగా టీడీపీ నేతలు పార్టీ జిల్లా కార్యాలయంలో సీఎం చిత్రపటానికి ధాన్యంతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాజా మాస్టారు మాట్లాడుతూ 2024 ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీని అమలు చేసి సూపర్ సిక్స్‌లో మరో పథకాన్ని ప్రజలకు అందించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించిందని, వారి పాలనలో రైతు ఆత్మహత్యల్లో రాష్ట్రం దేశంలో మూడోస్థానం, కౌలు రైతుల ఆత్మహత్యల్లో 2వ స్థానంలో ఉండేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కంచర్ల శివరామయ్య, గోళ్ల ప్రభాకర్, మహాలక్ష్మి, మన్నవ వంశీకృష్ణ, బొబ్బిలి రామారావు, సోమశేఖర్, బలరాం, సతీశ్‌గౌడ్, ఆనంద్, బెల్లంకొండ సురేశ్, ధర్మతేజ, తదితరులు పాల్గొన్నారు.



ధాన్యంతో అభిషేకం చేస్తున్న టీడీపీ నేతలు

విద్యార్థినికి ల్యాప్‌టాప్ బహూకరణ

గుంటూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మెరిట్ సాధించిన బీటెక్ విద్యార్థినికి టీడీపీ నాయకుడు తాళ్ల వెంకటేశ్ యాదవ్ శనివారం ల్యాప్‌టాప్ బహూకరించారు. అశోక్‌నగర్లోని తన కార్యాలయంలో విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేశారు. కార్యక్రమంలో కన్నెబోయిన బాబూరావు, గుర్రం రవి, తాడిబోయిన హరి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న తాళ్ల వెంకటేశ్ యాదవ్ తదితరులు

వందన, ప్రీతి మేరీలపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సిస్టర్ వందన ఫ్రాన్సిస్, సిస్టర్ ప్రీతి మేరీలపై భజరంగ్ దళ్ కార్యకర్తలు బనాయించిన అక్రమ కేసులు ఎత్తివేయాలని వీసీకే పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కె.జయసుధ డిమాండ్ చేశారు. అరండల్‌పేట, అమరావతి బుక్ హౌస్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నారాయణపూర్ రైల్వేస్టేషన్‌లో భజరంగ్‌దళ్ కార్యకర్తల తప్పుడు ఫిర్యాదుతో పోలీసులు ఇద్దరు సిస్టర్‌లను అక్రమంగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని ముస్లింలు, క్రైస్తవులపై దాడులు అరికట్టేందుకు రక్షణ చట్టం తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో నాగలక్ష్మి, వాసు, నరసింహారావు, బి.విల్సన్ తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్ అబ్దుల్‌నజీర్ నుంచి గౌరవ డాక్టరేట్స్ అందుకుంటున్న ఐల్యాబ్స్ గ్రూప్ ఫౌండర్ చింతలపాటి శ్రీనివాసరాజు, జెన్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ అట్లూరి, మ్యూజిక్ గురు, ఇండియన్ ప్లేబాక్ సింగర్ కంపోజర్ డాక్టర్ కొమండూరి రామాచారి తదితరులు

సాంకేతిక నగరంగా అమరావతి

● క్వాంటం టెక్నాలజీకి దిక్సూచిగా ఆంధ్రప్రదేశ్ ● విజ్ఞాన్స్ వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్‌నజీర్

గుంటూరు(విద్య), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి పరిపాలనా నగరంగానే కాకుండా, సాంకేతిక నగరంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని గవర్నర్ అబ్దుల్‌నజీర్ తెలిపారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో శనివారం 13వ స్నాతకోత్సవం జరిగింది. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగిస్తూ స్మార్ట్ శ్రేణి మౌలిక వసతులు, సుస్థిరత, డిజిటల్ పాలనా కేంద్రంగా అమరావతి మారుతోందన్నారు. క్వాంటం వ్యాలీ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రపంచ క్వాంటం టెక్నాలజీ కేంద్రంగా మారాలన్న దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. సిలికాన్ వ్యాలీ తరహాలో అమరావతిని అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. అత్యాధునికంగా అమరావతి నిర్మాణానికి విద్యార్థులు, యువతే మూలస్తంభాలన్నారు. ఇంజనీరింగ్ వల్ల వ్యవసాయ రంగానికి డ్రోన్లు, సెన్సార్లు, డేటా ఆధారిత ఫార్మింగ్ సాధ్యమైందన్నారు. ఆరోగ్యరంగంలో డయగ్నొస్టిక్స్, డ్రగ్ డెలివరీలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. పాలసీ, విద్య, మానసిక శాస్త్రంలో డేటా ఆధారిత నిర్ణయాల ద్వారా స్థిరమైన పరిష్కారాలు సాధ్యమవుతున్నాయన్నారు. హైదరాబాద్‌లోని ఐల్యాబ్స్ గ్రూప్ ఫౌండర్ చింతలపాటి శ్రీనివాసరాజు మాట్లాడుతూ విద్యార్థులందరూ ఏఐ టూల్స్‌పై పట్టు సాధించాలన్నారు. విద్య, ఉద్యోగం, ఆట, పాటల్లో టాపర్లగా నిలవాలన్నా మంచి అలవాట్లు, చక్కని ప్రణాళిక ఎంతో కీలకమన్నారు. జెన్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ అట్లూరి ప్రసంగిస్తూ సాంకేతిక పురోగతి నుంచి సామాజిక అసమానత వంటి అనేక గణనీయమైన సవాళ్లను ప్రపంచం ఎదుర్కొంటోందని, దీనిని పరిష్కరించడం యువకుల బాధ్యత అన్నారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ ప్రపంచంలో ప్రస్తుతం సయోధ్యకంటే సంఘర్షణ, సామరస్యత కన్నా విభేదాలు, శాంతి కన్నా కలహాలు కనిపిస్తున్నాయన్నారు. పరిస్థితుల మధ్య మళ్లీ ఒక గాంధీ, ఒక బుద్ధుడు పుడితే ఎంత మంచిదో అనిపిస్తోందన్నారు. మానవత్వాన్ని గుర్తు చేస్తూ, శాంతిని వ్యాప్తిచేస్తూ, మానవాళిని మళ్లీ సద్గతికి నడిపించగల నేతలు కావాలన్నారు. వేదాలు కూడా ఓం శాంతిః శాంతిః శాంతిః అంటూ ప్రారంభమవుతాయని, శాంతే మన అభివృద్ధికి మూలస్తంభమన్నారు. విజ్ఞాన్స్ వైస్ చైర్మన్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ మేకిన్ ఇండియా మాత్రమే కాదు ఇన్వెంట్ ఇన్ ఇండియా, డిజైన్ ఇన్ ఇండియా, లీడ్ ఫ్రమ్ ఇండియా కూడా కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీసీ ఆచార్య పీ నాగభూషన్, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, సీఈవో డాక్టర్ కూరపాటి మేఘన, బోర్డుఆఫ్ మేనేజింగ్ సభ్యులు, విభాగాల డీన్లు పాల్గొన్నారు.

అంబరాన్ని అంటిన సంబరం

డిగ్రీలు అందుకున్న విద్యార్థుల ఆనందోత్సాహాలతో స్నాతకోత్సవ సంబరం అంటరాన్ని అంటింది. విద్యార్థుల కేరింతలతో వర్సిటీ ప్రాంగణం హోరెత్తింది. విద్యార్థులంతా తలపాగా, కండువాలతో అచ్చతెలుగు సంప్రదాయ దుస్తులతో వేడుకలో పాల్గొనడం ఆహుతులను ఆకట్టుకుంది. ఐల్యాబ్స్ గ్రూప్ ఫౌండర్ చింతలపాటి శ్రీనివాసరాజు, జెన్ టెక్నాలజీస్ ఎండీ అశోక్ అట్లూరి, మ్యూజిక్ గురు డాక్టర్ కొమండూరి రామాచారిలకు గవర్నర్ గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశారు. 2122 మంది డిగ్రీలు, 60 మంది విద్యార్థులు బంగారు పతకాలు అందుకున్నారు.



శాశ్వతం.. స్నేహితం

స్నేహం....రెండక్షరాల ఓ చిన్న పదం.. కానీ, ప్రభావం మాత్రం అనంతం. మానవ జీవన గమనంలో ప్రతి దశలోనూ తోడుండి నడిపించే ఇంధనం. మతం, భాష, ప్రాంతీయ భేదాలు లేని మనిషి మూలధనం. తల్లిదండ్రుల తర్వాత వ్యక్తి జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే గొప్ప బంధం. ఓ వ్యక్తి జీవితం సరైన దిశలో సాగినా లేదా అస్తవ్యస్తంగా మారినా దాని వెనక తప్పని సరిగా ఓ స్నేహితుడు ఉంటాడు. మంచైనా చెడైనా మన భవిష్యత్తును ప్రభావితం చేసేది మాత్రం ఈ స్నేహ బంధమే. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా మారుతున్న స్నేహాలపై ప్రత్యేక కథనం..

నేడు స్నేహితుల దినోత్సవం

❖ కొత్త మార్గాల్లో స్నేహ హస్తాలు..

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

దశాబ్దం క్రితం వరకు ఒక్కొక్కరి స్నేహితుల జాబితా చాలా పెద్దదిగానే ఉండేది. ప్రస్తుతం స్నేహితులెంతమంది ఉన్నారనే ప్రశ్నకు నేటి యువత ఇస్తున్న సమాధానం ఇద్దరి, ముగ్గురి లోపే. అది కూడా ఎక్కువగా కళాశాల స్నేహాలే ఉంటున్నాయి. స్నేహతత్వం మారకపోయినా మనుషుల ఆలోచనల్లో మాత్రం కొంత మార్పు కనబడుతోంది.

బాల్య స్నేహితులేరి..

వృద్ధాప్యంలో బాల్య స్నేహితులను కలిసి నప్పుడు కలిగే మానసిక ఉల్లాసమే వేరు. గడచిన రెండు తరాలుగా ఇలాంటి స్నేహా లు కనిపించడం లేదు. కళాశాల రోజులకు వచ్చేసరికి స్కూల్ ఫ్రెండ్స్ దూరమవు తున్నారు. ఉద్యోగ జీవితంలోకి అడుగుపె ట్టేసరికి కళాశాల స్నేహితులు కనిపించడం లేదు. తీరా సంసార జీవితంలోకి అడుగు పెట్టేసరికి అసలు స్నేహితులే లేకుండా పోతున్నారు.



ఓదార్చే చేయి లేక.. 50 శాతం ఆత్మహత్యలు

ఇటీవల చిన్నచిన్న విషయాలకే కుంగుబాటుకు గురై బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. వీరిలో అధిక శాతం యువతే ఉండడం మరింత కలవరపరుస్తోంది. ఓ సంస్థ జరిపిన అధ్యయనంలో ఆత్మహత్య ఆలోచన వచ్చినప్పుడు సరైన స్నేహితుడు పక్కన ఉంటే దాని నుంచి బయట పడడం తేలిక అని తేల్చింది. బలవంతంగా ఉసురు తీసుకుంటున్న వారిలో 50 శాతం మరణాలు సాధకబాధకాలు చెప్పుకునే స్నేహబంధం లేకపోవడం వల్లేనని సర్వేలో తేలింది.

స్నేహం..ప్రేమై.. మళ్లీ స్నేహితులుగా..

యువతీయువకుల మధ్య స్నేహబంధాలు ప్రేమగా కూడా చిగురించడం సాధా రణమే. పలు కారణాల వల్ల బంధం విచ్ఛిన్నమైతే.. మంచి స్నేహితులుగా అడుగులేసే ఆరోగ్యకర పరిణామం ఇటీవల కాలంలో కనబడుతోంది. ఇది మైత్రీ బంధం విలువను మరింత పెంచుతోంది.

❖ తగ్గిన స్నేహితుల సంఖ్య

ఆన్‌లైన్ స్నేహాలు..

ఆన్‌లైన్ స్నేహాలూ ఈ దశాబ్దంలో కొత్తగా పురుడుపోసుకున్నవే. నిజానికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ స్నేహం ఏదైనా కావొచ్చు దాని విలువ మాత్రం ఎప్పటికీ ప్రత్యేకమే. కానీ, ముక్కూ మొఖం తెలియని వ్యక్తులకు స్నేహం ఎరవేసి తర్వాత ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న ఉదంతాలు ఇటీవల కోకొల్ల లుగా వెలుగుచూ స్తున్నాయి. ఇవన్నీ కూడా స్నేహ బంధానికి బీటలు వారేలాగా చేస్తున్నాయి.

యాప్ స్నేహితులు..

స్నేహితులను యాప్‌లలోనే వెతుక్కోవాల్సిన పరిస్థితి ప్రస్తుతం ఏర్పడింది. యువత సమయం సగం సెల్ ఫోన్‌కే సరిపోతోంది. ఇలాంటి వారే టార్గెట్‌గా మిత్రులను సంపాదించుకోండనే ప్రకటనలు.. వస్తున్నాయి. స్నేహం వ్యాపార వస్తువుగా చూసే పయత్నాలు జరుగుతున్నాయి.

ఎమోషనల్‌గా, మోరల్‌గా..

మేం ఇద్దరం బీటెక్ ఫస్ట్ ఇయర్‌లోనే స్నేహితులయ్యాం. ఫైనల్ ఇయర్‌కు వచ్చేసరికి మా మధ్య ఎమోషనల్ బాండింగ్ ఏర్పడింది. ఏ విషయమైనా చర్చించుకుంటాం. భవిష్యత్తులో ఏవైనా హర్డిల్స్ ఎదురైనా ఈ బంధం దన్నుగా ఉంటుందనే నమ్మకం మాకుంది. పెద్దగా స్నేహం నిర్వచనాల గురించి మాకు తెలియదు. ఏదయినా విషయంలో బాధ కలిగినప్పుడు తనతో చెప్పుకుంటే కాస్త రిలీఫ్‌గా ఉంటుంది. మళ్లీ నార్మల్ అవుతాం.

-ఎన్. హిమబిందు, డేటా సైన్స్ ఫైనల్ ఇయర్, బాపట్ల
-కె.లక్ష్మీ చేతన, బీటెక్ ఫైనల్ ఇయర్



మాటిచ్చాం.. అమలు చేశాం

అన్నదాత సుఖీభవ ప్రారంభోత్సవంలో మంత్రి గొట్టిపాటి

వినుకొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాలు అలంకారప్రాయం కాకూడదని, రైతులకు అధికారులు ఎప్పటిక ప్పుడు సమాచారం ఇస్తూ సేవలు అందించాలని విద్యుత్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. స్థాని క మార్కెట్ యార్డు ఆవరణలో శనివారం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాన్ని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుతో కలిసి ఆయన ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ప్రధాని నరేంద్రమోదీ, ప్రకాశం జిల్లా దర్శిలో అన్నదాత సుఖీ భవ కార్యక్రమం ప్రారంభ ఉపన్యాసాన్ని రైతులకు వినిపించారు. అనంతరం మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ 46,87,530 మంది రైతుల ఖాతాల్లో రూ.32వేల కోట్లను ప్రభుత్వం జమ చేసినట్లు తెలిపారు. రైతుకు ఇచ్చిన మాట ప్రకా రం అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకా రంతో విద్యుత్ తయారు చేసుకునే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో 20 లక్షల కనెక్షన్లను సోలార్ సిస్టం ద్వారా ఏర్పాటు చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి తెలిపారు. సోలార్ యూనిట్ ఏర్పాటుకు బ్యాంకు రుణాలు అందజేస్తున్నా యని, ప్రతి నియోజకవర్గంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసి సబ్ స్టేషన్‌లకు విద్యుత్ అందించడం ద్వారా 9 గంటల యూనిట్‌ను అందజేస్తామన్నారు.



రైతులకు డ్రోన్ పరికరాలను అందజేస్తున్న కూటమి నాయకులు మంత్రి గొట్టిపాటి రవి, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తదితరులు

ప్రజల సొమ్ము దోచుకున్న వారికి శిక్ష తప్పదు

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 23 మంది ఎమ్మెల్యేలు ఉన్నా.. అసెంబ్లీకి వెళ్లి.. ప్రజల తరపున వారి సమస్యలను వినిపించామని మంత్రి గొట్టిపాటి చెప్పారు. నేడు జగన్ మోహన్‌రెడ్డి అరాచకాలను ప్రజలు గుర్తించి 11 సీట్లకు పరిమితం చేశా రన్నారు. ప్రజా సమస్య లను దేవాలయం లాంటి అసెంబ్లీలో ఎందుకు ప్రశ్నించడం లేదని ఆయన మండిపడ్డారు. ప్రజల సొమ్మును దోచుకున్నవారికి శిక్ష తప్పదని, ఆధారలతో వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

సీసీఆర్ ఉంటే.. రెండవ విడత జమ

సీసీఆర్ కార్డు ఉంటే 2వ విడత కూడా రైతులకు నగదు జమ అవుతుందని, ఎవరూ అపోహ చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. సాగర్ నీరు వచ్చిందని, రైతులు సాగుకు సిద్ధంగా ఉండాలని రైతులకు సూచించారు. ఖరీఫ్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఆర్‌ఎస్‌కేల్లో ఉంచినట్లు చెప్పారు. పొగాకు పంటలను సాగు చేయొద్దని సూచించారు.

రైతులకు మద్దతుగా నిలిచాం..

సీఎం చంద్రబాబునాయుడు రూ.270 కోట్లతో పొగాకు కొనుగోలు చేశారని, కోకో, మ్యాంగో పంటలకు కూడా ప్రత్యేక నిధిని కేటాయించి వారికి మద్దతుగా నిలిచామని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. ఈ నెల 11న వినుకొండలో హార్టికల్చర్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజవరపు అచ్చెన్నాయుడు, మంత్రి గొట్టిపాటి రవి హాజరవుతారని చెప్పారు. జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, డీఈవో జగ్గారావు, ఏడీఏ హనుమంతరావు, ఏవో కోటయ్య, ఏడీఏ రవికుమార్, ఏవో వరలక్ష్మి, డీహెచ్‌వో ఐ.వెంకట్రావు, వినుకొండ హెచ్‌వో రసూల్‌తో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం కోరే.. కూటమి ప్రభుత్వం

● 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ● మంత్రులు కొలుసు, అనగాని

రేపల్లె, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అన్నదాతతోనే దేశ ప్రగతి సాధ్యమని నమ్మిన పార్టీ టీడీపీ అని, అందుకే ఆ పార్టీ జెండాలోనే నాగలి గుర్తు ఉంటుందని జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. శనివారం రేపల్లె మార్కెట్ యార్డులో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకాన్ని మంత్రులు అనగాని, కొలుసు పార్థసారథి, బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్, జిల్లా కలెక్టర్ వెంకటమురళి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 46,85,838 మంది రైతులకు లబ్ధి చేకూరనుందని, ఇప్పటికే ఈ పథకం కోసం 2342 కోట్లు విడుదల చేశామని తెలిపారు. ఎవరికైన సందేహం ఉంటే 155251 కాల్ సెంటర్ నంబరుకు ఫోన్‌చేసి పరిష్కరించుకోవచ్చన్నారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్, అలాగే యంత్ర పరికరాలు, రైతురథాలను రాయితీపై ఇచ్చామని చెప్పారు. గతప్రభుత్వం వీటన్నింటిని రద్దుచేసిందని రైతులను నట్టేటముంచిందని మంత్రి మండిపడ్డారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ రైతులకు పెట్టుబడిసహాయం కింద రూ.12,500లు ఇస్తామని చెప్పిన గత ప్రభుత్వం కేవలం రూ.7,500లు మాత్రమే ఇచ్చిందన్నారు. జగన్ ప్రభుత్వంలో ధాన్యం డబ్బుల కోసం రైతులు రోడ్డెక్కి ఉద్యమాలు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కూటమిప్రభుత్వం 48 గంటల్లోనే ధాన్యం డబ్బులు చెల్లించి రైతులకు అండగా నిలిచిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.1,674కోట్లను ప్రస్తుత ప్రభుత్వం చెల్లించిందన్నారు. రాష్ట్ర చరిత్రలోనే 18 ఏళ్ల తర్వాత మొదటిసారి ప్రాజెక్టులన్నీ జూలై నాటికే నిండిపోయాయని తెలిపారు. కౌలురైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ రూ.3,826 కోట్లను మంజూరుచేశామన్నారు. రేపల్లె నియోజకవర్గంలో 28 వేల మంది రైతులకు రూ.15 కోట్లు అన్నదాత సుఖీభవ పథకం కింద అందిస్తున్నామన్నారు. బాపట్ల ఎంపి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులను నట్టేట ముంచారని, కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ వెంకటమురళి మాట్లాడుతూ రైతులకు అండగా నిలిచేందుకు అన్నదాత సుఖీభవ-పీఎంకిసాన్ పథకం సద్వినియోగపడుతుందన్నారు. అనంతరం రైతులకు అన్నదాతసుఖీభవ-పీఎంకిసాన్ పథకం చెక్కును మంత్రులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, ఆర్డీఓ రామలక్ష్మీ, కృష్ణాపశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ చైరన్ పంతాని మురళీధరరావు, రాష్టకార్యదర్శి గూడపాటిశ్రీనివాస రావు, మార్కెట్‌యార్డు చైర్మన్‌లు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

పల్నాడులో పెరుగుతున్న రైతుల ఆత్మహత్యలు

హెచ్‌ఆర్‌ఎఫ్, ఆర్‌ఎస్‌వీ నిజనిర్ధారణ

నరసరావుపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో దశాబ్ద కాలంలో 400 మందికి పైగా రైతులు అత్మహత్యలు చేసుకున్నారని మానవ హక్కుల వేదిక, రైతు స్వరాజ్య వేదిక వెల్లడించింది. జిల్లాలో రైతులు ఆత్మహత్యలపై సదరు సంస్థలు నిజనిర్ధారణ చేశాయి. బాధిత రైతు కుటుంబాలను కలసి అత్మహత్యలకు కారణాలను తెలుసుకున్నాయి. ప్రభుత్వం ఇప్పటి కైనా నిద్రలేచి జీఓ నంబరు 43ని అమలు పరచి, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవాలని హెచ్‌ఆర్ఎఫ్.. ఆర్‌ఎస్‌వీ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశాయి. పాల కుల నిర్లక్ష్యం, ప్రకృతి చిన్న చూపు వల్ల కౌలు రైతులకు జరుగు తున్న తీవ్ర అన్యాయం కారణంగానే పల్నాడు జిల్లాలో గతంలో ఎన్నడూ లేనంతగా రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయని తమ నిజనిర్ధారణలో నిరూపణ అయ్యిందని పేర్కొన్నాయి. చనిపోయిన రైతు కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందడం లేదని పేర్కొన్నాయి. జూలై 29, 30 తేదీల్లో పల్నాడు జిల్లా గురజాల డివిజన్‌లోని వెల్దుర్తి, దుర్గి, గురజాల మండలాల్లోని 8 గ్రామాలలో ఆత్మహత్య చేసుకున్న 9 మంది రైతు కుటుంబాలను, గ్రామస్థులను కలిసి రైతుల ఆత్మహత్యలకు గల కారణాలు, ప్రభుత్వ స్పందన గురించి విషయ సేకరణ చేశామని సభ్యులు తెలిపారు. పల్నాడు ప్రాంతంలో మిగిలిన డెల్టా ప్రాంతాల కంటే కౌలు రైతులు తక్కువగా ఉండేవారు కానీ, గత కొన్ని సంవత్సరాలుగా పల్నాడులో కౌలు రైతుల సంఖ్య పెరిగిందని తెలిపారు. కౌలు రేట్లు విపరీతంగా పెరిగిపోయాయని, దాదాపు రూ.25 వేల కౌలు చెల్లించి పత్తి, మిరప, వరి, కందులు సాగు చేసిన రైతులు కొన్ని సార్లు అధిక వర్షాలు, కొన్ని సార్లు అనావృష్టి, చీడ పీడల కారణాలతో తీవ్ర నష్టాలతో అప్పుల వారి వత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నారని చెప్పారు. వెల్దుర్తి మండలంలో వెయ్యి అడుగులు దాటితే గాని బోరు నీళ్ల పడడం లేదని, బోర్ల కోసం కొంతమంది రైతులు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తూ అప్పుల పాలవుతున్నప్పటికీ.. విఫలం అవుతున్నారని చెప్పారు.



ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబంతో మాట్లాడుతున్న హెచ్‌ఆర్‌ఎఫ్.. ఆర్‌ఎస్‌వీ నిజనిర్ధారణ కమిటీ

ఆత్మహత్యలను దాచి పెడుతున్నారు

సమాచార హక్కు చట్టం ద్వారా, నేర పరిశోధన విభాగం వారి లెక్కల ప్రకారం పల్నాడు జిల్లాలో ఈ దశాబ్ద కాలంలో 400 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారంటే వారు ఎంత సంక్షోభంలో ఉన్నారో అర్థమవుతోందని నిజనిర్ధారణ వేదికలు తేల్చాయి. ఈ నేపథ్యంలో ఆ కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ఎప్పటికి రావచ్చని అధికారులను తమ బృందం ప్రశ్నిస్తే వారి దగ్గర కూడా ఎటువంటి సమాధానం లేదని వెల్లడించాయి. వాస్తవానికి రాష్ట్రమంతటా ఇదే పరిస్థితి కనబడుతోందని చెప్పాయి. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత 300 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు రైతు సంఘాలు, పోలీసుల లెక్కలు చెప్తుంటే ప్రభుత్వం కేవలం 39 మంది రైతులు మాత్రమే ఆత్మహత్య చేసుకున్నట్లు అసెంబ్లీలో చెప్పడం రైతు ఆత్మహత్యలను ఎంత దాచి పెడుతున్నారో అర్థం అవుతుందని ఆశ్చర్యం వ్యక్తం చేశాయి.

గడపతొక్కని త్రిసభ్య కమిటీలు..

ఇక ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవడం కోసం తెచ్చిన జీవో 43 అమలు తీరు దారుణంగా ఉందన్నారు. సందర్శించిన 9 బాధిత కుటుంబాల్లో ఒక్క కుటుంబానికి మాత్రమే ఆ జీవో కింద రూ.7లక్షల ఎక్స్ గ్రేసియా అందిందని చెప్పారు. కొన్ని చోట్ల బాధిత కుటుంబాలకు సంవత్సరం దాటినా.. ఎక్స్ గ్రేషియా అందలేదని తెలిపారు. ఏ ఒక్క కుటుంబం దగ్గరికి కూడా డివిజన్ స్థాయి త్రిసభ్య కమిటీ (ఆర్డీవో, డీఎస్పీ, ఏడీఏ) స్వయంగా వెళ్ల లేదని వెల్లడించారు. కనీసం ప్రాథమిక నివేదిక సమర్పించవలసిన మండల స్థాయి త్రిసభ్య కమిటీ (తహసీల్దార్, వ్యవసాయ అధికారి, సబ్ ఇన్‌స్పెక్టర్) కూడా కుటుంబాల దగ్గరికి రాలేదని నిర్ఘాంతపోయే విషయాలను చెప్పారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారి లాంటి అధికారులు కనీసం కుటుంబ సభ్యులను కూడా కలవకుండా తూతూ మంత్రంగా విచారణ చేసి నివేదికలు పంపారని వివరించారు. ఆత్మహత్య జరిగిన రైతు కుటుంబాలలోని మహిళల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఏ ఒక్క కుటుంబంలో మహిళకు వితంతు పెన్షన్ రావడం లేదన్నారు.

సమగ్ర అధ్యయనం చేయాలి..

ప్రభుత్వం ఇప్పటికైనా నిద్రలేచి చితికిపోయిన రైతు కుటుంబాలను ఆదుకోవాలని వేదికలు డిమాండ్ చేశాయి. బాధిత కుటుంబాలను డివిజనల్ స్థాయి త్రిసభ్య ధ్రువీకరణ కమిటీ ఆలస్యం చేయకుండా సందర్శించి, విచారణ పూర్తి చేసి సత్వరమే పూర్తి స్థాయిలో కుటుంబాలకు ఆర్థిక సహాయం, పునరావాసం కల్పించాలని కోరాయి. అత్యధిక ఆత్మహత్యలు జరుగుతున్న రాయలసీమ, పల్నాడు, ప్రకాశం జిల్లాలలో సమగ్ర అధ్యయనం చేసి.. సమస్యలు ఉన్న రైతుల కోసం ప్రభుత్వం ఒక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. మందాడి, రచ్చమల్లపాడు, శ్రీరాంపురం తండా, ముట్లుకూరు, మాడుగుల, పులిపాడు, తేలకుట్ల గ్రామాల్లో పర్యటించిన వారిలో ఆర్ఎస్వీ రాష్ట్ర కన్వీనర్ టీ బాలు, రాష్ట్ర కమిటీ సభ్యుడు బీ కొండలు, మానవహక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వై రాజేష్, కార్యవర్గ సభ్యులు కే అనురాధ, మానవ హక్కుల వేదిక సమన్వయకర్త వీఎస్‌కృష్ణ ఉన్నారు.

త్వరలో జీజీహెచ్‌లో కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలు

● రూ.30 లక్షల విలువైన సర్జరీలు ఉచితంగా.. ● సూపరింటెండెంట్ రమణ యశస్వి

గుంటూరు మెడికల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో త్వరలో కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలను ప్రారంభిస్తున్నట్లు సూపరింటెండెంట్, శరీర అవయవ దాతల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. జాతీయ అవయవ దాన దినోత్సవం పురస్కరిం చుకొని శనివారం వైద్య కళాశాల అనాటమీ విభాగంలో ఎంబీబీఎస్ విద్యార్థులకు అవయవ దానంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి అధ్యక్షత వహించారు. ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో కాలేయ మార్పిడి శస్త్రచికిత్సల నిర్వహ ణకు ఇప్పటికే ఏపీ జీవన్ దాన్ ట్రస్ట్ నుంచి అనుమతులు లభించినట్లు డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. తొలి విడతలో కేవలం కేడావర్ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలు మాత్రమే జరు గుతా యని ఆయన వివరించారు. బ్రెయిన్ డెడ్ అయిన రోగుల నుంచి సేకరించిన కాలేయాన్ని మా త్రమే ప్రస్తుతం రోగులకు మార్పిడి చేస్తామని ఆయన తెలిపారు. అనంతరం జీవించి ఉన్న వ్యక్తుల నుంచి సేకరించిన కాలేయ మార్పిడి ఆపరేషన్లు కూడా నిర్వహిస్తామన్నారు. సుమారు రూ.30 లక్షల విలువైన కాలేయ మార్పిడి ఆపరేషన్లు గుంటూరు జీజీహెచ్‌లో ఉచితంగా నిర్వహిస్తామని, రోగులపై ఒక్క రూపాయి భారం కూడా ఉండ దని డాక్టర్ రమణ యశస్వి వెల్లడించారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ లివర్ స్టడీస్, గ్లెనాగికల్ హాస్పిటల్ (చెన్నై)కు చెందిన లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జన్ డాక్టర్ రజనీకాంత్ పచ్చ మాట్లాడుతూ గుంటూరు జీజీహెచ్‌లో కాలేయ మార్పిడి ఆపరేషన్ల నిర్వహణకు తాము ఒప్పందం కుదుర్చు కున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆపరేషన్ థియేటర్ల నిర్మాణం, వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోఆర్డినేటర్లకు కూడా ఏర్పాటు చేసినట్లు తెలి పారు. కాలేయ మార్పిడి అవసరమైన రోగులు తమ పేర్లను జీజీహెచ్‌లో నమోదు చేసుకుం టున్నట్లు డాక్టర్ రజనీకాంత్ తెలిపారు. మరో రెండు నెలల్లో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలను గుంటూరులో ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో గ్యాస్ట్రోఎంటిరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎ.కవిత, అనాటమీ విభాగాధిపతి డాక్టర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సుందరాచారి, వేదికపై రమణ, రజనీకాంత్



● విన్నర్



వీఎఫ్ఎక్స్‌తో దర్శకులకు స్వేచ్ఛ వచ్చింది

'హనుమాన్' గుర్తుందా? ఆ సినిమాలో హనుమంతుడి విగ్రహం... ఆ చుట్టుపక్కల కొండలు.. చిన్న గ్రామం గుర్తున్నాయా? అవన్నీ కంప్యూటర్ ద్వారా తయారుచేసి దృశ్యాలని అని చాలామందికి తెలియదు. వీఎఫ్ఎక్స్ అని అందరూ సాంకేతిక పరిభాషలో పిలుచుకొనే ఈ దృశ్యాలను తెరకు ఎక్కించింది... హైదరాబాద్‌కు చెందిన 'హేలోహ్యూస్' అనే కంపెనీ. 'హనుమాన్' చిత్రంలో స్పెషల్ ఎఫెక్ట్స్‌కు తాజాగా జాతీయ అవార్డు లభించింది. ఈ నేపథ్యంలో 'హేలోహ్యూస్' చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ పవన్ వీరమనేని... 'నవ్య'తో మాట్లాడారు.

కంప్యూటర్ జనరేటెడ్ ఇమేజ్ (సీజీఐ)... విజువల్ ఎఫెక్ట్స్... గ్రాఫిక్స్ ఇలా రకరకాలుగా అంటారు కదా!

అన్నీ ఒకటే. కంప్యూటర్ ద్వారా తయారుచేసే దృశ్యాలే వీఎఫ్ఎక్స్. దర్శకుడి ఊహకు వాస్తవ రూపం కల్పించేది, ఇవి నిజమని భ్రమించేలా చేసేదీ వీఎఫ్ఎక్స్.

వీటిని మన తెలుగు సినిమాల్లో చాలా కాలంగా వాడుతున్నారు కదా..!

పూర్వకాలం అనేక సినిమాల్లో ఈ తరహా సన్నివేశాలు ఉండేవి. 'మాయాబజార్, కీలుగుర్రం'... విఠలాచార్యగారు తీసిన అనేక సినిమాల్లో వీటిని మనం చూడవచ్చు. మిగిలిన భాషలతో పోలిస్తే మన దగ్గరే ఇలాంటి సన్నివేశాలు ఎక్కువ. ఆ సమయంలో కంప్యూటర్లు లేవు కాబట్టి సెట్లు వేసి కెమెరా ట్రిక్స్‌తో మనకు ఆ భావన కలిగించేవారు. ఆ తర్వాతి కాలంలో సాంఘిక సినిమాలు రావటం మొదలుపెట్టాక వీటిని వాడటం మానేశారు. దర్శకుడు రాజమౌళి తీసిన 'మగధీర' నుంచి ఈ ట్రెండ్ మళ్లీ మొదలయింది. 'మగధీర'లో కనిపించే కోటలన్నీ వీఎఫ్ఎక్స్‌లో రూపొందించినవే! వాటిని 'మకుటా' అనే కంపెనీలో రూపొందించాం. నేను కూడా మొదట ఆ కంపెనీలోనే పనిచేసేవాడిని. ఆ తర్వాత కాలంలో 'బాహుబలి, బాహుబలి2'కు సంబంధించిన వీఎఫ్ఎక్స్‌లు కూడా అక్కడే చేశాం. ఆ తర్వాత నేను విదేశాలకు వెళ్లిపోయాను. హాలివుడ్‌లో పనిచేశాను. మళ్లీ హనుమాన్ సమయానికి తిరిగి వచ్చాను.

దేశంలోనే తొలి కంపెనీ...

డిజిటల్ డబుల్ టెక్నాలజీ... మా దగ్గర, షారూక్‌ఖాన్‌కు చెందిన 'రెడ్ చిల్లీస్' సంస్థ దగ్గర మాత్రమే ఉంది. మన దగ్గర ఫొటో జామెట్రీ అనే కొత్త టెక్నాలజీ కూడా ఉంది. దీనిలో వంద కెమెరాలు ఉంటాయి. ఒక వ్యక్తిని మధ్యలో కూర్చోబెడితే- అతని మొహంలోని అణువణువూ నమోదు అవుతుంది. ఈ విజువల్స్ ఆధారంగా ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్‌తో ఒక మెష్‌ను క్రియేట్ చేస్తాం. దీనిని ఆ తర్వాత మనకు ఎలా కావాల్సి వస్తే అలా వాడుకోవచ్చు. ఇదే విధంగా మన దగ్గర బాడీ మోషన్ కేప్చర్ టెక్నాలజీ కూడా అందుబాటులో ఉంది. చాలా కంపెనీల దగ్గర హార్డ్‌వేర్ ఉంటుంది. కానీ సాఫ్ట్‌వేర్ ప్రాసెసింగ్ కోసం ఇతర కంపెనీల మీద ఆధారపడాలి. మన దగ్గర సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ రెండూ ఉన్నాయి. ఈ తరహా కంపెనీ దేశంలో మరొకటి లేదు.

'విశ్వంభర' అద్భుతం...

'విశ్వంభర' చిత్రంలో 80 శాతం వీఎఫ్ఎక్స్ ఉంటాయి. 'క్లాష్ ఆఫ్ టైటాన్స్' వంటి హాలీవుడ్ సినిమాల స్థాయిలో దృశ్యాలు ఉంటాయి. ఇప్పటిదాకా మన దేశంలో ఇలాంటి వీఎఫ్ఎక్స్ షాట్స్ ఏ సినిమాల్లోనూ రాలేదు. ఈ సినిమా టీజర్ అవుట్‌పుట్ సరిగ్గా రాలేదు. దానికి సమయాభావమే కారణం. ఆ తర్వాత అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నాం. ఈ సినిమా వీఎఫ్ఎక్స్ షాట్స్ 'కల్కి, బాహుబలి' స్థాయిలో ఉంటాయి. వాటిని మించిపోతాయి కూడా!

అంటే వీఎఫ్ఎక్స్ ఒరవడిని ప్రవేశపెట్టింది రాజమౌళే అనవచ్చా?

'మగధీర' నుంచి వీఎఫ్ఎక్స్ వాడటం మళ్లీ మొదలయింది. ఈ సినిమా తర్వాత అందరూ తమ సినిమాలో ఏదో ఒకచోట వాడటం మొదలుపెట్టారు. దీనికి కొన్ని కారణాలున్నాయి. ఉదాహరణకు మన పార్లమెంట్ నేపథ్యంలో ఒక సీను తీయాలనుకుందాం. అక్కడ షూటింగ్‌కు అనుమతి దొరకటం కష్టం. అందువల్ల దానిని గ్రీన్‌మ్యాట్ లేదా బ్లూమ్యాట్‌లో షూట్ చేస్తారు. ఆ తర్వాత ఈ సీన్లకు వీఎఫ్ఎక్స్ ద్వారా పార్లమెంట్ దృశ్యాలు కలుపుతాం. ఇంకో ఉదాహరణ చెబుతాను. 'థగ్‌లైఫ్' సినిమాలో చూపించిన మంచుకొండలు వీఎఫ్ఎక్స్ ద్వారా రూపొందించినవే!

అతి పెద్ద ప్రశంస...

మేము రూపొందించిన వీఎఫ్ఎక్స్ షాట్స్‌ను ఒకాయనకు మా ఎండీ చూపించారు. ఆయన ఆ షాట్స్ చూసి- "ఈ ప్లేస్‌కు నేను వెళ్లాను. చాలా బాగుంటుంది" అన్నారట. మాకు అంతకన్నా పెద్ద ప్రశంస ఏముంటుంది?

హనుమాన్ సినిమాకు అవార్డు వచ్చింది కదా..! ఈ సినిమాలో వీఎఫ్ఎక్స్ ప్రత్యేకతలేమిటి?

ఆ సినిమా మా దగ్గరకు వచ్చే సమయానికి 70 శాతం షూటింగ్ పూర్తయిపోయింది. దర్శకుడు ప్రశాంత్ వర్మ తనకు కావాల్సిన అవుట్‌పుట్ గురించి స్పష్టంగా చెప్పాడు. అప్పుడు ఒక టీజర్ తయారుచేశాం. దానికి చాలా మంచి స్పందన వచ్చింది. ప్రేక్షకుల్లో ప్రాజెక్టు పట్ల కొత్త క్రేజ్ వచ్చింది. దాంతో మిగిలిన 30 శాతం షూటింగ్ పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. వీఎఫ్ఎక్స్‌కు అదనపు బడ్జెట్ కేటాయించారు. ఈ సినిమాలో వీఎఫ్ఎక్స్ షాట్స్ అన్నీ చాలా కొత్తగా ఉంటాయి. లొకేషన్స్ ఎవరూ ఎప్పుడూ చూడనివే! రంగులు కూడా ఆహ్లాదకరంగా ఉంటాయి. మంచి వీఎఫ్ఎక్స్ షాట్స్‌కు.. బాగాలేని వీఎఫ్ఎక్స్ షాట్స్‌కు తేడా అదే! మేము రూపొందించే షాట్స్ అన్నీ కాంతివంతంగా కనిపిస్తూ ఉంటాయి. వీటినే ప్రేక్షకులు ఇష్టపడతారు. ఉదాహరణకు 'ఆదిపురుష్'లో వీఎఫ్ఎక్స్ షాట్స్ తీసుకుందాం. చీకటిలో కప్పేసినట్లు ఉంటాయి.

వీఎఫ్ఎక్స్‌కు విపరీతంగా ఖర్చు అవుతుందా?

చేయాల్సిన పని ఆధారంగా ఉంటుంది. కేవలం బ్యాక్‌గ్రౌండ్‌ను మార్చాలంటే పెద్ద ఖర్చు కాకపోవచ్చు. మొత్తం బ్యాక్‌గ్రౌండ్ రూపొందించాలంటే సమయం పడుతుంది. దీనివల్ల ఖర్చు పెరుగుతుంది. చేయాల్సిన పని ఎంత సంక్లిష్టంగా ఉంటే ఖర్చు అంత పెరుగుతూ వెళ్తుంది. విజువల్స్ చేసిన తర్వాత ఫైనల్ అవుట్‌పుట్ రావాలంటే, వాటిలో ఉన్న లేయర్స్‌ను కలపాలి. దానిని రెండరింగ్ అంటారు. ఇది ఒక సన్నివేశానికి అరగంట పట్టవచ్చు. సన్నివేశం సంక్లిష్టంగా ఉంటే ఐదు గంటలు కూడా పట్టవచ్చు. దీనివల్ల ఖర్చు పెరుగుతుంది.

ఈ మధ్యకాలంలో 'బాడీ డబుల్స్' అనే మాట ఎక్కువగా వినిపిస్తోంది..?

ప్రతి సినిమాలో స్టోరీ టెల్లింగ్.. హీరో తీసుకొనే రిస్క్.. చాలా కీలకమైన అంశాలు. ఒక కథలో డబుల్ రోల్ ఉందనుకుందాం. ఒకరు 100 కేజీలు ఉండాలి. మరొకరు 50 కేజీలు ఉండాలి. అది సాధ్యం కాదు కాబట్టి ఒకప్పుడు అలాంటి కథలను ఎంపిక చేసుకొనేవారు కాదు. ఇప్పుడు మన దగ్గర ఉన్న అత్యాధునిక టెక్నాలజీతో మనిషిలాంటి మనిషిని తయారుచేయవచ్చు. ఇక రెండో విషయం... హీరో తీసుకొనే రిస్క్. ఒకప్పుడు హీరోలు తమ ఫైట్లు తామే చేసుకొనేవారు. డూపులు కూడా తక్కువే! కానీ సినిమా బడ్జెట్ పెరిగిపోయిన తర్వాత హీరోకి దెబ్బ తగిలితే చాలా నష్టం వస్తుంది. అందువల్ల ఎక్కువగా డూపుల చేతే ఫైట్లు చేయిస్తున్నారు. మనకు ప్రస్తుతం డిజిటల్ డబుల్ టెక్నాలజీ.. ఫొటో జామెట్రీ వంటివి అందుబాటులోకి వచ్చాయి కాబట్టి డూప్‌లు కూడా సహజంగా కనిపించేలా ఉండేలా మార్చేయవచ్చు. ఈ రెండింటివల్ల దర్శకులకు చాలా స్వేచ్ఛ వచ్చింది. సమయం, బడ్జెట్ ఉంటే వారి ఊహల్లో ఉన్న ఎలాంటి కథనైనా ఇప్పుడు సినిమాగా తీసేయవచ్చు.

వీఎఫ్ఎక్స్‌లలో ఏఐ వినియోగం ఎక్కడిదాకా వచ్చింది?

ఇంకా పూర్తి స్థాయిలో రాలేదు. కమర్షియల్ స్థాయిలో దీనిని వాడాలంటే మరో నాలుగైదేళ్లు పడుతుంది. అప్పటిదాకా చిన్న చిన్న అంశాలలో దీనిని వాడుకోవచ్చు.

● సీవీఎల్ఎన్ ప్రసాద్

● సంప్రదాయం

అదనపు హంగులద్దే చంపస్వరాలు!



మహిళల అందాన్ని ఇనుమడింపజేయడానికి అనేక ఆభరణాలు ఉన్నాయి. వీటిలో చెంపస్వరాలు ప్రధానమైనవి. ఒకప్పుడు వీటిని సంప్రదాయ నాట్య కళాకారిణులు ధరించేవారు. ఇవి సాధారణంగా చెవి దుద్దుల నుంచి జడను అనుసంధానం చేస్తూ ఉంటాయి. పూర్వం వీటిని చంపక పుష్పం ఆకారంలోనే రూపొందించేవారు. వీటికి ఉండే గొలుసులు కూడా సన్నంగా ఉండేవి. నృత్యం చేసే సమయంలో ఈ గొలుసుల కదలికలు అదనపు ఆకర్షణగా నిలిచేవి. ఆ తరువాతి కాలంలో చెంపస్వరాలు ఒక తరం నుంచి మరొక తరానికి వచ్చే వారసత్వంగా మారాయి. ఆధునిక జీవనంలో చీరలు ధరించటం తగ్గిన తర్వాత వీటిని ఉపయోగించేవారి సంఖ్య తగ్గింది. కేవలం పండుగల సమయంలో ధరించడానికే పరిమితం అయ్యాయి. కానీ ఈ మధ్యకాలంలో వీటికి ఆదరణ బాగా పెరిగింది. ముఖ్యంగా పెళ్లి సమయంలో చెంపస్వరాలు ధరించని వధువులు ఉండటం లేదు. వధువు అలంకరణలో ఇవి ఒక ముఖ్యమైన భాగంగా మారిపోయాయి. ఒకప్పుడు కేవలం బంగారంతో మాత్రమే తయారు చేసేవారు. ప్రస్తుతం ముత్యాలు, వజ్రాలు, కెంపులు లాంటి వాటితో కూడా వీటిని రూపొందిస్తున్నారు.





● ఖ్యాతి,
ఖ్యాతి డిజైనర్ స్టూడియో హైదరాబాద్, 6300386749

కర్టెన్లను అలాగే వదిలేస్తున్నారా?

ఇంటి కిటికీలకు, ప్రధాన ద్వారానికి వేసే కర్టెన్ల మీద ఎక్కువగా దుమ్ము చేరుతూ ఉంటుంది. వీటిని తరచూ శుభ్రం చేయాలనీ లేనిచో శ్వాసకోశ సమస్యలు తప్పవని నిపుణులు చెబుతున్నారు. కర్టెన్లను ఎలా శుభ్రం చేయాలో తెలుసుకుందాం...



- రోజూ కర్టెన్లను మెత్తని బ్రష్‌తో తుడుస్తూ దులపాలి. వ్యాక్యూమ్ చేస్తున్నట్లయితే క్లీనర్‌కు బ్రష్‌ను జత చేయాలి. నీళ్లలో ముంచి గట్టిగా పిండిన గుడ్డతో కర్టెన్లను తుడిచినా ప్రయోజనం ఉంటుంది.
- కర్టెన్లను ఎటువంటి ఫ్యాబ్రిక్‌తో తయారు చేశారో పరిశీలించాలి. ఫ్యాబ్రిక్ తీరును బట్టి వాషింగ్ మెషిన్‌లో వేయాలా? చేత్తో ఉతకాలా? అనేది నిర్ణయించుకోవాలి. వాషింగ్ మెషిన్‌లో వేసేటట్లయితే అందులోనే డ్రైయింగ్ చేయకూడదు. అలాచేస్తే కర్టెన్లు ముడతలు పడతాయి.
- వారానికి ఒకసారి కర్టెన్లను మామూలుగా ఉతికితే సరిపోతుంది. సర్ఫ్, షాంపూ, లిక్విడ్ డిటర్జెంట్‌లలో ఒకదాన్ని తీసుకుని తగుమాత్రం బకెట్ నీళ్లలో వేసి బాగా కలపాలి. అందులో కర్టెన్లను గంటసేపు నానబెట్టాలి. మురికి మరీ ఎక్కువగా ఉందనిపిస్తే నీళ్లలో కొద్దిగా బ్లీచింగ్ పౌడర్ కలపవచ్చు. తరవాత కర్టెన్లను మంచినీళ్లతో ఉతికి గాలి తగిలేలా నీడలో ఆరేయాలి.
- కర్టెన్ల మీద ఒక్కోసారి మరకలు ఏర్పడుతూ ఉంటాయి. అర కప్పు వేడి నీళ్లలో రెండు చెంచాల వెనిగర్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మరకల మీద వేసి బ్రష్‌తో మెల్లగా రుద్దాలి. తరవాత అనువైన పద్ధతిలో ఉతికేస్తే మరకలు, మురికి వదిలి కర్టెన్లు శుభ్రంగా ఉంటాయి.
- కర్టెన్లను ఉతికేటప్పుడు ఫ్యాబ్రిక్ సాఫ్ట్‌నర్‌ను ఉపయోగిస్తే అవి పెళుసుబారకుండా ఉంటాయి. వాటి మెరుపుదనం పోకుండా ఉంటుంది.





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీల్లో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
స్టోలెన్: హీస్ట్ ఆఫ్ ది సెంచురీ	వెబ్‌సిరీస్	ఆగస్టు 08
అమెజాన్ ప్రైమ్		
అరేబియా కడలి	తెలుగు సిరీస్	ఆగస్టు 08
జియో హాట్‌స్టార్		
లవ్‌హర్ట్స్	హాలీవుడ్ మూవీ	ఆగస్టు 07
మిక్కీ 17	హాలీవుడ్ మూవీ	ఆగస్టు 07
సలక్కార్	హిందీ సిరీస్	ఆగస్టు 08
జీ 5		
మోతెవరి లవ్‌స్టోరీ	తెలుగు సిరీస్	ఆగస్టు 08

● జూమ్

కుర్రకారు కలల్లో కొత్త రాణి



ఎలాంటి భావమైనా ముఖంలో ఇట్టే పలికేస్తుంది.
తెర మీద కనిపిస్తే హాలంతా ఆహ్లాదంగా మారిపోతుంది.
నటనలో వైవిధ్యం... ఆకర్షణీయమైన రూపం... భారమైన సన్నివేశమైనా పండించగల సామర్థ్యం...
అన్నీ కలిస్తే అనీత్ పడ్డా. రికార్డులు కొల్లగొట్టి... కనక వర్షం కురిపిస్తున్న 'సయారా' చిత్రంతో ఆమె ఒక్కసారిగా స్టార్ హీరోయిన్ అయిపోయింది.
బాలీవుడ్ సరికొత్త సంచలనం... కుర్రకారు హృదయ స్పందన... అనీత్ 'ఫ్లాష్‌బ్యాక్' ఇది.

అనీత్ పడ్డా ప్రస్తుతం 'సయారా' చిత్రం విజయోత్సవంలో మునిగితేలుతోంది. యాభై కోట్లకు పైబడని బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం బాక్సాఫీస్ ఇప్పటికే నాలుగు వందల కోట్లు దాటిందని అంచనా. ఇందులో తెరంగేట్రం చేసిన హీరో అహానా పాండేకు జతగా అనీత్ నటించింది. 2025లో ఇప్పటివరకు విడుదలైన హిందీ చిత్రాల్లో అత్యధిక వసూళ్లు రాబట్టిన రెండో చిత్రంగా నిలిచింది. మూడేళ్ల కిందట 'సలామ్ వెంకీ'లో చిన్న పాత్రతో వెండితెరకు పరిచయమైన అనీత్... గత ఏడాది వచ్చిన 'బిగ్ గర్ల్స్ డోంట్ క్రై' వెబ్‌సిరీస్‌లో లీడ్ రోల్ పోషించింది. నటనపరంగా అది ఆమెకు మంచి గుర్తింపు తెచ్చింది. ఈ సిరీస్ కోసం 'మాసూమ్' అనే పాట రాసి, బాణీ కట్టి, తనే ఆలపించింది. ఈ ఏడాది ఆరంభంలో 'యువ సప్నోం కా సఫర్ సిరీస్'లో నటించిన ఆమెకు స్టార్ డైరెక్టర్ మోహిత్ సూరి 'సయారా'లో అవకాశం లభించింది. ప్రముఖ సంస్థ 'యష్‌రాజ్ ఫిలిమ్స్' దీన్ని నిర్మించింది. విడుదలైన రోజు నుంచి అద్భుతమైన టాక్‌తో దూసుకుపోతోంది 'సయారా'. ఇందులో అనీత్ అందానికే కాదు... ఆమె నటనకు, స్క్రీన్ ప్రెజెన్స్‌కు ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో పుట్టిన అనీత్‌కు మొదటి నుంచీ నటనపై మక్కువ. అక్కడి 'స్ప్రింగ్ డేల్ సీనియర్ స్కూల్'లో చదివిన ఆమె... ఢిల్లీ 'జీసస్ అండ్ మేరీ కాలేజీ' నుంచి పొలిటికల్ సైన్స్‌లో డిగ్రీ పూర్తి చేసింది. ఒకవైపు చదువుతూనే గ్లామర్ ప్రపంచంలో అవకాశాల కోసం ప్రయత్నించింది. తరువాత ముంబయికి వెళ్లి మోడలింగ్ చేసింది. ప్రకటనల్లో నటించింది.

వీడియో చూసి భావోద్వేగం...



'సయారా'తో అనూహ్య విజయాన్ని అందుకున్న అనీత్ జర్నీనీ, చదువుకొనే రోజుల్లో జ్ఞాపకాలను కలిపి 'స్ప్రింగ్ డేల్ సీనియర్ స్కూల్' ఒక వీడియో విడుదల చేసింది. అందులో టీచర్లు, కలిసి చదువుకున్నవారు, ప్రస్తుత విద్యార్థులు, ప్రిన్సిపాల్, మార్గదర్శకులు... అనీత్‌తో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకొంటూ, అభినందనలతో ముంచెత్తారు. ఆ వీడియో చూసిన ఆమె భావోద్వేగానికి లోనైంది.

"నా భావాలను వ్యక్తీకరించడానికి మాటలు రావడం లేదు. ఈ వీడియో చూస్తూ అలా కూర్చొండిపోయాను. ముఖమంతా చిరునవ్వు పరుచుకుంది. ఒక్కసారిగా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. నేను పెరిగింది... పెద్దగా కలలు కనడం నేర్చుకున్నది అక్కడే. నా మీద నాకు నమ్మకం రావడానికి ముందే నాలో ప్రతిభ ఉందని చాలామంది నమ్మింది అక్కడే. నా టీచర్లు, మార్గదర్శులు, నాతో చదివినవారు... అందరూ కలిసి ఇచ్చిన ఈ అద్భుతమైన బహుమతిని చూస్తున్నంతసేపూ మధురానుభూతికి లోనయ్యాను. సెట్‌లోకి వెళ్లిన ప్రతిసారీ స్కూల్లో యూనిఫామ్ ధరించి, తరగతి గదిలో కూర్చొని కన్న పగటి కలలు గుర్తుకువస్తుంటాయి. ఆ కలలే ఇప్పుడు నిజమయ్యాయి. నా ప్రతి అడుగులో నన్ను ప్రోత్సహించి, ప్రేమించి, సరైన మార్గంలో నడిపించిన మీవల్లే నేను ఇవాళ ఈ స్థాయిలో ఉన్నాను. ఒక మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన నేను ఎదిగిన క్రమం మీ అందరినీ గర్వపడేలా చేసిందని ఆశిస్తున్నాను. చదువు ఒక్కటే కాకుండా జీవిత పాఠాలు ఎన్నో నేర్పించిన 'స్ప్రింగ్‌డేల్'ను ఎప్పటికీ మరిచిపోను. త్వరలోనే అందరినీ కలుస్తాను. నన్ను గుర్తు చేసుకున్నందుకు, నా విజయాన్ని పంచుకున్నందుకు కృతజ్ఞతలు" అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసిన ఆ వీడియోను ఉద్దేశించి వ్యాఖ్యానించింది అనీత్. సంగీతపరంగానూ సూపర్ హిట్ అయిన 'సయారా' తరువాత ఆమె చేపట్టబోయే ప్రాజెక్ట్ గురించి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

సెట్‌లోకి వెళ్లిన ప్రతిసారీ స్కూల్లో యూనిఫామ్ ధరించి, తరగతి గదిలో కూర్చొని కన్న పగటి కలలు గుర్తుకువస్తుంటాయి. ఆ కలలే ఇప్పుడు నిజమయ్యాయి. నా ప్రతి అడుగులో నన్ను ప్రోత్సహించి, ప్రేమించి, సరైన మార్గంలో నడిపించిన మీవల్లే నేను ఇవాళ ఈ స్థాయిలో ఉన్నాను.

బిజినెస్ ప్లస్

యూపీఐలో వచ్చిన మార్పులేమిటంటే..!

మీరు ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్ పే వంటి డిజిటల్ చెల్లింపుల యాప్‌లు వాడుతున్నారా..? ఈ యాప్‌ల ద్వారా యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవలను వినియోగించుకుంటున్నారా..? అయితే, ఈ వార్త మీ కోసమే. ఎందుకంటే ఈ నెల 1 నుంచే యూపీఐ సేవల్లో కొన్ని మార్పులు వచ్చాయి. అయితే, ఈ మార్పులతో రోజువారీ చెల్లింపులపై ఎలాంటి ప్రభావం ఉండనప్పటికీ, యూపీఐ సేవల వినియోగంపైన మాత్రం యూపీఐ అభివృద్ధి, నిర్వహణ సంస్థ నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కొన్ని పరిమితులను విధించింది. ఆ వివరాలు..

బ్యాంక్ బ్యాలెన్స్

ఇప్పటివరకు వినియోగదారులకు యూపీఐ ద్వారా అనుసంధానిత బ్యాంకు ఖాతాలో ఎంత నగదు ఉందని ఎన్నిసార్లైనా పరిశీలించే వెసులుబాటు ఉంది. తాజాగా ఈ సేవలపై ఎన్‌పీసీఐ పరిమితి విధించింది. ఈ నెల 1 నుంచి ఒక్కో యూపీఐ యాప్ నుంచి రోజులో 50 సార్లు మాత్రమే బ్యాంకు అకౌంట్‌లోని బ్యాలెన్స్‌ను చెక్ చేసుకునే వీలుంటుంది. అత్యధిక లావాదేవీలు చోటు చేసుకునే సమయాల్లో వ్యవస్థపై ఒత్తిడిని తగ్గించేందుకు ఎన్‌పీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, యూపీఐ యాప్ నుంచి జరిపే ప్రతి చెల్లింపు పూర్తయ్యాక మీ ఖాతాలో నిల్వ ఎంత మిగిలి ఉందనేది వెంటనే చూడగలుగుతారు.

ఆటో చెల్లింపులు

వర్తకులకు స్వయంచాలక (ఆటోమెటిక్) చెల్లింపులు లేదా నెలవారీ ఈఎంఐ, ఓటీటీల సబ్‌స్క్రిప్షన్ పునరుద్ధరణ, మ్యూచువల్ ఫండ్ పథకాల్లో క్రమానుగత పెట్టుబడులు (సిప్) వంటి పునరావృత చెల్లింపులను ఇకపై ఉదయం 10 గంటలకు ముందు లేదా రాత్రి 9.30 గంటల తర్వాతే ప్రాసెస్ చేయడం జరుగుతుందని ఎన్‌పీసీఐ తెలిపింది. వ్యవస్థపై లావాదేవీల ప్రాసెసింగ్ భారాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.

బ్యాంక్ అకౌంట్ వివరాలు

యూపీఐ వినియోగదారులు ఇకపై తమ మొబైల్ నంబరుతో అనుసంధానితమైన బ్యాంకు ఖాతాల వివరాలను రోజులో గరిష్ఠంగా 25 సార్లు మాత్రమే పొందగలుగుతారు.

పేమెంట్ స్టేటస్

యూపీఐ వినియోగదారులు పెండింగ్‌లో ఉన్న లావాదేవీ స్టేటస్ (స్థితిని) కేవలం మూడు సార్లే చెక్ చేసుకునే వీలుంటుంది. అది కూడా, ఒకసారి పరిశీలించాక కనీసం 90 సెకన్ల తర్వాతే మళ్లీ చెక్ చేసుకోగలుగుతారు.



ఆర్థిక పరిస్థితులు ఎప్పుడు ఒకేలా ఉండవు. ఉద్యోగం పోవడం, మెడికల్ ఎమర్జెన్సీ లేదా ఆకస్మికంగా ఆదాయం పడిపోవడం వంటి ఊహించని బాధలు ఇప్పుడు సాధారణమై పోయాయి. అందరి విషయంలో కాకపోయినా కొందరి విషయంలో ఇవి జరుగుతుంటాయి. మరి అలాంటి పరిస్థితుల్లో బ్యాంకులు లేదా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)ల నుంచి తీసుకున్న రుణాల నెలవారీ వాయిదా (ఈఎంఐ)లను ఎలా చెల్లించాలి? చెల్లింపుల నుంచి తాత్కాలిక విరామం (మారటోరియం) కోరాలా? లేక రుణ పునర్ వ్యవస్థీకరణ కోరాలా? అయితే ఈ స్టోరీ చదవండి.

రుణ చెల్లింపులకు విరామం ప్రకటిస్తున్నారా..!

తాత్కాలిక ఉపశమనమే

ఈఎంఐల చెల్లింపుల నుంచి వాయిదా తాత్కాలిక ఉపశమనమే తప్ప.. దీర్ఘకాలిక పరిష్కారం కాదు. పైగా ఈ తాత్కాలిక ఉపశమనం వల్ల దీర్ఘకాలంలో రుణాలపై వడ్డీల మీద వడ్డీ పెరిగిపోయి తడిసి మోపెడవుతుంది. పైగా రుణ చెల్లింపుల వాయిదాలపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఇప్పుడు అనేక ఆంక్షలు విధించింది. ఉద్యోగాలు పోవడం, తీవ్ర అనారోగ్యం, ప్రకృతి విపత్తుల వంటి ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే ఈ వాయిదాలు వర్తిస్తాయని స్పష్టం చేసింది. అయినా ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్‌ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ వంటి బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఆయా వ్యక్తుల ఆర్థిక స్థితిగతుల ఆధారంగా ఏదో ఒక పేరుతో రుణ చెల్లింపుల వాయిదాలను అనుమతిస్తున్నాయి లేదా రుణాలను పునర్ వ్యవస్థీకరిస్తున్నాయి.

షరతులు వర్తిస్తాయ్

కొన్ని షరతులకు లోబడి మాత్రమే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు రుణ చెల్లింపుల నుంచి తాత్కాలిక ఉపశమనానికి అనుమతిస్తాయి. అప్పటి వరకు చెల్లించాల్సిన ఈఎంఐ క్రమం తప్పకుండా చెల్లించి ఉండాలి. ఒకవేళ బకాయి ఉన్నా 90 రోజులకు మించి ఉండకూడదు. ఉద్యోగం పోతే అప్పటి వరకు పని చేసిన కంపెనీ జారీ చేసిన టెర్మినేషన్ లెటర్, అనారోగ్య సమస్య అయితే అందుకు సంబంధించిన మెడికల్ బిల్స్, ప్రకృతి వైపరీత్యాలైతే అందుకు సంబంధించిన ప్రాంతీయ నివేదికలు సమర్పించాలి. ఈ రుజువులన్నీ సమర్పించినా అందరికీ చెల్లింపుల వాయిదా లభిస్తుందని చెప్పలేం. ఆయా వ్యక్తుల ఆర్థిక స్థితిగతులను జాగ్రత్తగా పరిశీలించి మాత్రమే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు అందుకు ఆమోదం తెలుపుతాయి.

ఆర్థికంగా భారమే

ఈ వాయిదా ఊరికే రాదు. ఈఎంఐ చెల్లింపుల నుంచి తాత్కాలిక ఉపశమనం లభించినా, వాయిదా గడువు ముగిసే సరికి చెల్లించాల్సిన వడ్డీ 'అసలు'కు జమ అవుతుంది. దీంతో ఈఎంఐ లేదా రుణ చెల్లింపు కాల వ్యవధి పెరిగి పోతుంది.

ఉదాహరణ: ఒక వ్యక్తి ఐదేళ్లలో చెల్లించేలా 12 శాతం వడ్డీతో ఒక బ్యాంకు నుంచి రూ.5 లక్షలు రుణంగా తీసుకున్నాడు. ఏదో ఆర్థిక సమస్య వచ్చి ఆ వ్యక్తి ఈఎంఐ చెల్లింపుల నుంచి మూడు నెలలు విరామం పొందాడనుకుందాం. ఈ మూడు నెలలకు అతడు చెల్లించాల్సిన రూ.7,500 వడ్డీ అసలుకు జమ అవుతుంది. పైగా ఇది చక్రవడ్డీల రూపంలో ఉంటుంది. మూడు నెలల తర్వాత మళ్లీ చెల్లింపులు ప్రారంభించినప్పుడు ఈఎంఐల రూపంలో రూ.10,000 వరకు అదనపు భారం పడుతుంది.

క్రెడిట్ స్కోరు ఓకే

ఈఎంఐల చెల్లింపుల్లో తీసుకునే ఈ తాత్కాలిక విరామం వల్ల ఆయా వ్యక్తుల క్రెడిట్ స్కోరుకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. బ్యాంకులు కూడా ఈ విరామాన్ని డిఫర్డ్ లేదా అండర్ మారటోరియం పద్దు కింద చూపిస్తాయి తప్ప, చెల్లింపులు ఆగిపోయాయని చూపించవు. దీనివల్ల ఆయా వ్యక్తుల పరపతి స్కోరుకు ఎలాంటి ఢోకా ఉండదు. కాకపోతే చెల్లింపుల భారం, ఈఎంఐల గడువు పెరిగిపోతాయి. దీంతో రుణ భారం పెరిగి భవిష్యత్‌లో తీసుకునే రుణాలపైనా ప్రభావం చూపుతుంది.

మార్గాలు ఏమిటి?

బ్యాంకుతో మాట్లాడడం

ఆర్థిక పరిస్థితి బాగోలేనప్పుడు అప్పు ఇచ్చిన బ్యాంకుతో నేరుగా మాట్లాడి రుణ పునర్ వ్యవస్థీకరణ, ఈఎంఐ తగ్గింపు లేదా వడ్డీ చెల్లింపుల భారం తగ్గించుకోవడం మంచిది.

ఎమర్జెన్సీ ఫండ్

ఆర్థిక కష్టాలు తాత్కాలికమైతే అత్యవసర ఖర్చుల కోసం దాచుకున్న మొత్తం నుంచి ఈఎంఐలు చెల్లించడం మంచిది.

ఖర్చులు తగ్గించుకోవడం

ప్రతి వ్యక్తికి ఎంతో కొంత అనవసర ఖర్చులు ఉంటాయి. ఈ ఖర్చులు తగ్గించుకోవడం ద్వారా చాలా వరకు వాయిదాల అవసరం లేకుండానే రుణ ఈఎంఐలు చెల్లించవచ్చు.

ఇతర మార్గాలు

టాప్ అప్ రుణాల ద్వారా కూడా రుణ చెల్లింపుల వాయిదాల నుంచి తప్పించుకోవచ్చు. ఒకవేళ అనేక రుణాలు ఉంటే అన్ని రుణాలను, ఒకే రుణంగా మార్చి తక్కువ వడ్డీ వసూలు చేసే బ్యాంకుకు మార్చి కూడా వాయిదాల భారం నుంచి బయట పడవచ్చు.

పై విషయాలను దృష్టిలో ఉంచుకుని రుణ చెల్లింపుల 'వాయిదా' అస్త్రాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. లేకపోతే అదే పెద్ద గుదిబండగా మారి ఆర్థిక స్థితిగతుల్ని తారుమారు చేసే ప్రమాదం ఉంది.

7 నుంచి జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ ఐపీఓ

రూ.3,600 కోట్లకు తగ్గిన నిధుల సమీకరణ లక్ష్యం

ప్రముఖ పారిశ్రామికవేత్త సజ్జన్ జిందాల్‌కు చెందిన జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ సంస్థ జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 7న ప్రారంభమై 11న ముగియనుంది. ఐపీఓ ద్వారా నిధుల సమీకరణ లక్ష్యాన్ని మాత్రం కంపెనీలో గతంలో నిర్దేశించుకున్న రూ.4,000 కోట్ల నుంచి రూ.3,600 కోట్లకు తగ్గించుకుంది. ఐపీఓలో భాగంగా రూ.1,600 కోట్ల తాజా ఈక్విటీని జారీ చేయడంతో పాటు ప్రస్తుత వాటాదారులకు చెందిన రూ.2,000 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనున్నట్లు సెబీకి సమర్పించిన రెడ్ హియరింగ్ ప్రాస్పెక్టస్(ఆర్‌హెచ్‌పీ)లో కంపెనీ వెల్లడించింది. ఓఎఫ్ఎస్ ద్వారా ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం అపోలో మేనేజ్‌మెంట్ రూ.931.80 కోట్లు, సినర్జీ మెటల్స్ ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్స్ రూ.938.50, ప్రభుత్వ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ రూ.129.70 కోట్ల విలువైన వాటాను ఉపసంహరించుకోనున్నాయని జేఎస్‌డబ్ల్యూ వెల్లడించింది.

ఆర్సిల్ ఐపీఓ కోసం దరఖాస్తు: అవెన్యూ క్యాపిటల్ పెట్టుబడులు కలిగిన అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ ఇండియా లిమిటెడ్ (ఆర్సిల్).. ఐపీఓ ద్వారా నిధుల సమీకరణకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓలో భాగంగా ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులు 10.54 ఈక్విటీ కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనున్నట్లు డీఆర్‌హెచ్‌పీలో కంపెనీ పేర్కొంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	99
వరంగల్	90	గుంటూరు	104
కరీంనగర్	90	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	92
కర్నూలు	90	నెల్లూరు	97
విశాఖపట్నం	92	అనంతపురం	97
గోదావరి	99		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,350 ▲	92,900 ▲	1,23,000 ▼
విజయవాడ	1,02,500 ▼	96,500 ▲	1,14,000 ▲
విశాఖపట్నం	1,01,350 ▼	92,900 ▲	1,23,000 ▼
రాజమండ్రి	1,01,350 ▲	92,900 ▲	1,14,400 ▲
ప్రొద్దుటూరు	1,00,350 ▲	92,320 ▲	1,14,200 ▲
ముంబై	98,253 ▼	90,000 ▼	1,09,646 ▼

క్యాప్‌జెమినీలో 45,000 నియామకాలు

టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) 12,000 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్న సమయంలో ఫ్రెంచ్ ఐటీ కంపెనీ క్యాప్‌జెమినీ కాస్త ఊరట కలిగించే వార్త చెప్పింది. ఈ ఏడాది 40,000-45,000 నియామకాలు చేపట్టనున్నట్లు ప్రకటించింది. అందులో 35-45 శాతం అనుభవజ్ఞులను ఉద్యోగంలో చేర్చుకోవాలనుకుంటున్నట్లు క్యాప్‌జెమినీ సీఈఓ అశ్విన్ యార్డీ వెల్లడించారు. ఫ్రాన్స్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ కంపెనీకి చెందిన భారత కార్యాలయాల్లో ప్రస్తుతం 1.75 లక్షల మంది పనిచేస్తున్నారు. భారత్‌లో ప్రాంగణ నియామకాల (క్యాంపస్ హైరింగ్) ద్వారా ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకునేందుకు కంపెనీ 50కి పైగా కాలేజీలు, క్యాంపస్‌లతో జట్టు కట్టింది. ప్రస్తుత సీజన్ హైరింగ్ కొనసాగుతోందని, కొత్తగా రిక్రూట్ చేసుకున్నవారికి కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతలో శిక్షణ ఇవ్వడంపై దృష్టిసారించినట్లు కంపెనీ తెలిపింది.

వడ్డీ రేట్లు మరో 0.25% తగ్గే చాన్స్

ఎస్‌బీఐ

ఈ నెలలో నిర్వహించనున్న ద్రవ్య పరపతి విధాన సమీక్షలో భాగంగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కీలక వడ్డీ (రెపో) రేట్లను మరో 0.25 శాతం తగ్గించే అవకాశం ఉందని ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ తాజా నివేదిక అంచనా వేసింది. రెపో తగ్గింపు పండగ సీజన్‌లో రుణ వృద్ధికి దోహదపడనుందని రిపోర్టు పేర్కొంది. దీపావళికి ముందు వడ్డీ రేట్లు తగ్గిన సందర్భాల్లో రుణ వృద్ధి గణనీయంగా పెరిగిందని గత గణాంకాలు సూచిస్తున్నాయని తెలిపింది.

2017 ఆగస్టులో ఆర్‌బీఐ రెపో రేటు 0.25 శాతం తగ్గించిందని, దాంతో ఆ ఏడాది దీపావళితో ముగిసిన పండగ సీజన్‌లో రూ.1.95 లక్షల కోట్ల రుణ వృద్ధి నమోదైందని, ముఖ్యంగా వ్యక్తిగత రుణాలు 30 శాతం పుంజుకున్నాయని ఎస్‌బీఐ తన నివేదికలో ప్రస్తావించింది. పరపతి సమీక్షలో భాగంగా ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) ఈ నెల 4-6 తేదీల్లో సమావేశం కానుంది. సమీక్ష చివరి రోజున ఆర్‌బీఐ వడ్డీ రేట్లపై ఎంపీసీ నిర్ణయాన్ని ప్రకటించనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ			
హైదరాబాద్	430	విజయవాడ	475
వరంగల్	432	గోదావరి	465
చిత్తూరు	513	విశాఖపట్నం	465
		డజను గుడ్లు రూ. 72	

కలిసే ఉంటాం!

కశ్యప్‌తో విడిపోవాలన్న నిర్ణయంపై సైనా యూటర్న్

ఇన్‌స్టాలో పోస్ట్ చేసిన షట్లర్



హైదరాబాద్: మాజీ షట్లర్ పారుపల్లి కశ్యప్‌తో దాంపత్య జీవితానికి ముగింపు పలుకుతున్నట్టు ఇటీవలే ప్రకటించిన బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ యూటర్న్ తీసుకుంది. భర్త కశ్యప్ నుంచి విడిపోవాలన్న నిర్ణయంపై పునరాలోచన చేస్తున్నట్టు సైనా తన ఇన్‌స్టాగ్రామ్‌లో శనివారం పోస్ట్ చేసింది. 'కొన్నిసార్లు దూరం.. వర్తమానం విలువను తెలియజేస్తుంది. మళ్లీ కలిసిపోయేందుకు ప్రయత్నిస్తున్నాం' అని ఆ పోస్ట్‌లో పేర్కొన్న సైనా.. కశ్యప్‌తో కలిసున్న ఫొటోను షేర్ చేసింది. కశ్యప్ నుంచి విడిపోతున్నట్టు గత నెల 13న సైనా ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా వెల్లడించిన సంగతి తెలిసిందే. కొన్నాళ్ల పాటు ప్రేమించుకున్న వీళ్లిద్దరూ 2018లో పెళ్లితో ఒక్కటయ్యారు.

ఫైనల్లో భారత జోడీలు

డబ్ల్యూటీటీ స్టార్ కంటెండర్

న్యూఢిల్లీ: బ్రెజిల్‌లో జరుగుతున్న ప్రపంచ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) స్టార్ కంటెండర్ టోర్నీలో భారత జోడీలు మానుష్ షా-దియా చిటాలే, మానవ్ టక్కర్-మానుష్ షా ఫైనల్ చేరి చరిత్ర సృష్టించారు. మిక్స్‌డ్ డబుల్స్ సెమీస్‌లో మానుష్-దియా జోడీ 11-7, 11-2, 11-7తో చిలీకి చెందిన నికోలస్-పౌలినా జంటపై గెలిచింది. పురుషుల డబుల్స్ సెమీస్‌లో మానవ్-మానుష్ ద్వయం 5-11, 11-9, 11-6, 8-11, 11-5తో చైనీస్ తైపీ జోడీ హువాంగ్ - క్యు గువాన్ హోంగ్‌ను ఓడించింది. డబ్ల్యూటీటీ స్టార్ కంటెండర్ మిక్స్‌డ్, డబుల్స్‌లో భారత ఆటగాళ్లు ఫైనల్ చేరడం ఇదే తొలిసారి.

ఒకే ఓవర్‌లో 45 పరుగులు

టీ10 లీగ్‌లో సంచలన రికార్డు




ఉస్మాన్

లండన్: తన పవర్ హిట్టింగ్‌తో ఒకే ఓవర్‌లో అత్యధికంగా 45 పరుగులు రాబట్టి అఫ్ఘానిస్థాన్ మాజీ బ్యాటర్ ఉస్మాన్ ఘనీ (43 బంతుల్లో 11 ఫోర్లు, 17 సిక్స్‌లతో 153 నాటౌట్) ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఈసీఎస్ టీ10 లీగ్‌లో గిల్డ్‌ఫోర్డ్‌తో మ్యాచ్‌లో లండన్ కౌంటీ తరపున ఉస్మాన్ సూపర్ ఫీట్ నమోదు చేశాడు. విల్ జర్నీ బౌలింగ్ చేసిన 9 బంతుల ఓవర్‌లో ఒక్క బంతిని మిస్ అయిన ఘనీ.. 5 సిక్స్‌లు, 3 ఫోర్లు బాదాడు. ఇందులో రెండు నోబాల్స్, వైడ్ ఉన్నాయి. కాగా, ఉస్మాన్ కేవలం 28 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. దీంతో లండన్ కౌంటీ 10 ఓవర్లలో 226 పరుగులు చేసింది. ఛేదనలో 115/4 స్కోరుకే పరిమితమైన గిల్డ్‌ఫోర్డ్.. 71 పరుగుల తేడాతో ఓడింది.

బాయ్‌ఫ్రెండ్‌పై దాడి

100 మీటర్ల వరల్డ్ చాంపియన్ షకేరి అరెస్ట్





సియాటెల్ (అమెరికా): మహిళల 100 మీటర్ల డిఫెండింగ్ వరల్డ్ చాంపియన్ షకేరి రిచర్డ్‌సన్ గృహహింస కేసులో అరెస్టయింది. గత ఆదివారం సియాటెల్ విమానాశ్రయంలో తన బాయ్‌ఫ్రెండ్, అమెరికాకే చెందిన మరో ప్రఖ్యాత స్ప్రింటర్, 100 మీటర్ల ప్రపంచ మాజీ చాంపియన్ క్రిస్టియన్ కోల్‌మన్‌పై దాడి చేసినందుకు పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. కోల్‌మన్‌తో వాదనకు దిగిన ఆమె అతడిని బలంగా నెట్టివేయడంతో విమానాశ్రయంలోని ఓ గోడకు అతడు గుద్దుకొన్నాడు. విమానాశ్రయ సీసీ కెమెరా ఫుటేజ్‌లో..కోల్‌మన్‌పై రిచర్డ్‌సన్ ఏదో వస్తువును విసరడం కూడా కనిపించింది. దాంతో రిచర్డ్‌సన్‌పై నాలుగో డిగ్రీ గృహహింస కేసు నమోదు చేసి ఆదివారం సాయంత్రం అరెస్ట్ చేశారు. అనంతరం సోమవారం మధ్యాహ్నం ఆమెను విడుదల జేశారు. గతేడాది పారిస్ ఒలింపిక్స్‌లో రజతం నెగ్గిన 25 ఏళ్ల షకేరి, 29 ఏళ్ల కోల్‌మన్ రెండేళ్లుగా డేటింగ్‌లో ఉన్నారు.

లక్ష్య, తరుణ్ అవుట్

మకావు: తెలుగు షట్లర్ తరుణ్ మన్నేపల్లి, స్టార్ ఆటగాడు లక్ష్య సేన్‌లకు మకావు ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో నిరాశ ఎదురైంది. ఈ ఇద్దరు సెమీఫైనల్స్‌లో ప్రత్యర్థులకు తలొగ్గి ఇంటిబాట పట్టారు. లక్ష్య సేన్ 16-21, 9-21తో అల్వి ఫర్హాన్ (ఇండోనేసియా) చేతిలో, తరుణ్ 21-19, 16-21, 16-21తో జస్టిన్ హో (మలేసియా) చేతిలో ఓటమి పాలయ్యారు.

స్పోర్ట్స్

బౌలర్లూ.. చెలరేగాలి!

ఇంగ్లండ్ లక్ష్యం 374

ప్రస్తుతం 50/1

భారత్ రెండో ఇన్నింగ్స్ 396

జైస్వాల్ శతకం

ఆకాశ్, జడేజా, సుందర్ హాఫ్ సెంచరీలు

టంగ్‌కు 5 వికెట్లు

1 ఓ టెస్టు సిరీస్‌లో ఎక్కువ శతకాలు (12) బాదిన జట్టుగా ఆస్ట్రేలియా, పాకిస్థాన్, దక్షిణాఫ్రికాలతో కలిసి టాప్‌లో నిలిచిన భారత్.

ఇంగ్లండ్‌లో జరిగిన సిరీస్‌ల్లో 50+ స్కోర్లు ఎక్కువసార్లు (6) సాధించిన భారత బ్యాటర్‌గా జడేజా.

2 భారత్ తరపున ఓ టెస్టు సిరీస్‌లో ఎక్కువ పరుగులు (754) చేసిన రెండో భారత బ్యాటర్‌గా గిల్. గవాస్కర్ (1971లో 774) టాప్‌లో ఉన్నాడు. అలాగే ఈ ఫీట్ సాధించిన రెండో కెప్టెన్ కూడా గిల్. డాన్ బ్రాడ్‌మన్ (1936లో 810) ముందున్నాడు.



జైస్వాల్ (118)



ఆకాశ్‌దీప్ (66)

లండన్: అత్యంత ఆసక్తిగా సాగుతున్న ఐదో టెస్టులో ఫలితం తేలడం ఖాయమైంది. ఈ ఆఖరి మ్యాచ్‌లో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగిన భారత్‌కు బ్యాటర్లు అండగా నిలిచారు. ఫలితంగా టీమిండియా.. ప్రత్యర్థి ఇంగ్లండ్ ముందు 374 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (118) సెంచరీ, ఆకాశ్‌దీప్ (66), వాషింగ్టన్ సుందర్ (53), జడేజా (53)ల అర్ధసెంచరీలతో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 396 పరుగులు సాధించింది. పేసర్ టంగ్ ఐదు వికెట్లతో ఆకట్టుకున్నాడు. ధ్రువ్ జురెల్ (34) ఫర్వాలేదనిపించాడు. ఇక ఛేదనకు దిగిన ఇంగ్లండ్ శనివారం ఆట చివరి ఓవర్‌లో ఓపెనర్ క్రాలే (14) వికెట్‌ను కోల్పోయి 50/1 స్కోరుతో నిలిచింది. ఓపెనర్ డకెట్ (34) క్రీజులో ఉన్నాడు. ఆటకు ఇంకా రెండు రోజుల సమయం ఉండగా.. ఇంగ్లండ్ గెలుపునకు మరో 324 పరుగుల దూరంలో ఉంది. ఈ స్థితిలో ఇరు జట్ల విజయావకాశాలపై ఉత్కంఠ నెలకొంది. మిగిలిన వికెట్లను భారత బౌలర్లు ఎంత వేగంగా తీస్తారనేది కీలకంగా మారనుంది. తొలి టెస్టులో కూడా ఇంగ్లండ్ ఆఖరి రోజు 350 రన్స్ బాది విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. మరోవైపు ఓవల్‌లో అత్యధిక ఛేదన 263 పరుగులే కావడం గమనార్హం.

ఆకాశ్ అనూహ్యంగా..: ఓవర్‌నైట్ స్కోరు 75/2తో భారత్ మూడో రోజును మెరుగ్గా ఆరంభించింది. ముఖ్యంగా శుక్రవారం నైట్‌వాచ్‌మన్‌గా వచ్చిన ఆకాశ్ అంచనాలకు మించిన ఆటతో అదరగొట్టాడు. దాదాపు సెషన్ మొత్తం క్రీజులో నిలిచి బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతడిని ఊరించేందుకు తొలి ఓవర్‌నే స్పిన్నర్ బెథెల్‌తో వేయించారు. కానీ మూడో బంతినే ఫోర్‌గా మలిచిన ఆకాశ్ దీటుగా బదులిచ్చాడు. పిచ్ ఫ్లాట్‌గా మారడంతో టంగ్, అట్కిన్సన్ ఓవర్లలోనూ అవలీలగా బౌండరీలు సాధిస్తూ అండగా నిలిచాడు. అటు జైస్వాల్ తన సహజశైలిలో ఆడి ఒత్తిడి పెంచాడు. ఇక ఆకాశ్ 21 పరుగుల వద్ద ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్‌లో క్రాలే వదిలేయగా.. ఈ చాన్స్‌ను వినియోగించుకుంటూ కెరీర్‌లో తొలి అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత ఎక్కువగా తనే స్ట్రయికింగ్ తీసుకోగా.. ఒవర్టన్, టంగ్ ఓవర్లలో వరుసగా రెండేసి ఫోర్లతో అదుర్స్ అనిపించాడు. చివరకు లంచ్‌కు ముందు ఒవర్టన్ షార్ట్ బాల్‌కు ఆకాశ్ షో ముగిసింది. అప్పటికే మూడో వికెట్‌కు 107 పరుగుల భాగస్వామ్యం చేరింది.

జైస్వాల్ అదుర్స్: రెండో సెషన్‌లో జైస్వాల్ శతకంతో పాటు భారత్‌కు భారీ ఆధిక్యం దక్కింది. అయితే అటు ఇంగ్లండ్ పేసర్లు కూడా ప్రభావం చూపి మూడు వికెట్లు తీయగలిగారు. ఫీల్డింగ్‌లో మాత్రం మళ్లీ నిరాశపరుస్తూ జైస్వాల్, కరుణ్ క్యాచ్‌లను వదిలేశారు. సెషన్ తొలి బంతికే కెప్టెన్ గిల్ (11)ను అట్కిన్సన్ ఎల్బీ చేశాడు. ఇక 127 బంతుల్లో జైస్వాల్ కెరీర్‌లో ఆరో శతకం పూర్తి చేసుకున్నాడు. మరోవైపు క్రీజులో ఇబ్బందిపడిన కరుణ్ (17)ను సైతం అట్కిన్సన్ పెవిలియన్‌కు చేర్చాడు. అయితే జడేజాతో కలిసి ఆరో వికెట్‌కు 44 పరుగులు జోడించిన జైస్వాల్.. టంగ్ షార్ట్ పిచ్ బాల్‌కు దొరికిపోయాడు. అనంతరం జురెల్ ఎదురుదాడికి దిగడంతో భారత్ స్కోరు ఈ సెషన్‌లోనే 300 దాటింది.

జడేజా-సుందర్ మరోసారి..: ఆఖరి సెషన్‌లో లోయర్ మిడిలార్డర్ నుంచి విలువైన పరుగులు జత చేరాయి. ఏడో వికెట్‌కు జడేజాతో కలిసి 50 పరుగులు జోడించాక జురెల్ వెనుదిరిగాడు. అనంతరం జడ్డూ ఈ సిరీస్‌లో ఐదో హాఫ్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఆ వెంటనే జడేజా, సిరాజ్ (0)లను టంగ్ ఒకే ఓవర్‌లో దెబ్బతీశాడు. అయితే చివర్లో సుందర్ చెలరేగి అట్కిన్సన్ ఓవర్‌లో 4,4,6తో 39 బంతుల్లోనే అర్ధసెంచరీ సాధించాడు. కానీ భారీ షాట్ ఆడే యత్నంలో టంగ్‌కు చిక్కడంతో భారత్ ఇన్నింగ్స్ ముగిసింది.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 224; ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 247;

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) ఒవర్టన్ (బి) టంగ్ 118, రాహుల్ (సి) రూట్ (బి) టంగ్ 7, సుదర్శన్ (ఎల్బీ) అట్కిన్సన్ 11, ఆకాశ్‌దీప్ (సి) అట్కిన్సన్ (బి) ఒవర్టన్ 66, గిల్ (ఎల్బీ) అట్కిన్సన్ 11, నాయర్ (సి) స్మిత్ (బి) అట్కిన్సన్ 17, జడేజా (సి) బ్రూక్ (బి) టంగ్ 53, జురెల్ (ఎల్బీ) ఒవర్టన్ 34, సుందర్ (సి) క్రాలే (బి) టంగ్ 53, సిరాజ్ (ఎల్బీ) టంగ్ 0, ప్రసిద్ధ్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 26; మొత్తం: 88 ఓవర్లలో 396 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-46, 2-70, 3-177, 4-189, 5-229, 6-273, 7-323, 8-357, 9-357, 10-396; **బౌలింగ్:** అట్కిన్సన్ 27-3-127-3, టంగ్ 30-4-125-5, ఒవర్టన్ 22-2-98-2, బెథెల్ 4-0-13-0, రూట్ 5-1-15-0.

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలే (బి) సిరాజ్ 14, డకెట్ (బ్యాటింగ్) 34, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 13.5 ఓవర్లలో 50/1; వికెట్ పతనం:** 1-50; **బౌలింగ్:** ఆకాశ్‌దీప్ 5-1-15-0, ప్రసిద్ధ్ 5-1-23-0, సిరాజ్ 3.5-0-11-1.

ఆసియా కప్ వేదికలివే..

దుబాయ్: ఆసియా కప్ టీ20 టోర్నీ వేదికలను ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) శనివారం ప్రకటించింది. సెప్టెంబరు తొమ్మిది నుంచి 28 వరకు దుబాయ్, అబుధాబి వేదికలుగా టోర్నీ నిర్వహించనున్నట్టు తెలిపింది. సెప్టెంబరు 14న భారత్-పాకిస్థాన్ గ్రూపు దశ మ్యాచ్ దుబాయ్‌లో జరగనుంది. అఫ్ఘానిస్థాన్-హాంకాంగ్ జట్ల ప్రారంభ మ్యాచ్‌కు అబుధాబి ఆతిథ్యమివ్వనుంది. ఇక.ఫైనల్‌ను దుబాయ్‌లో నిర్వహిస్తారు. సెప్టెంబరు 10న తమ ప్రారంభ మ్యాచ్‌లో యూఏఈతో దుబాయ్‌లో టీమిండియా తలపడనుంది.

ప్రైవేటు క్రికెట్ లీగుల్లో 'పాకిస్థాన్' పేరు వాడొద్దు!

న్యూఢిల్లీ: పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) సంచలన నిర్ణయం తీసుకొంది. ప్రైవేటు క్రికెట్ లీగుల్లో 'పాకిస్థాన్' దేశం పేరును వాడటంపై నిషేధం విధించింది. వరల్డ్ చాంపియన్‌షిప్స్ ఆఫ్ లెజెండ్స్ (డబ్ల్యూసీఎల్)లో పాక్‌తో మ్యాచ్‌లను భారత వెటరన్ జట్టు రెండుసార్లు బహిష్కరించింది. ఈ నేపథ్యంలో బోర్డు అనుమతి లేకుండా ప్రైవేటు లీగుల్లో 'పాకిస్థాన్' అని వాడితే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించింది.

ఓవల్ గ్రౌండ్‌లో రోహిత్



లండన్: మూడో రోజు ఆటలో భారత జట్టు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ సందడి చేశాడు. ఆట ఆరంభమైన కాసేపటికే తను సాధారణ ప్రేక్షకుడి మాదిరి మొబైల్‌లో టిక్కెట్‌ను సెక్యూరిటీ గార్డ్‌కు చూపించి లోనికి ప్రవేశించాడు. నాలుగేళ్ల క్రితం ఇదే ఓవల్‌లో రోహిత్ సెంచరీతో జట్టును గెలిపించడం విశేషం. అలాగే గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ కూడా మ్యాచ్‌ను తిలకించేందుకు వచ్చాడు.

నగల్‌కు చుక్కెదురు

న్యూఢిల్లీ: భారత టెన్నిస్ సింగిల్స్ టాప్ ఆటగాడు సుమిత్ నగల్‌కు జర్మనీలోని హాగెన్‌లో జరుగుతున్న ప్లాట్జ్‌మన్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ ఈవెంట్‌లో చుక్కెదురైంది. ప్రీక్వార్టర్స్‌లో నగల్ 2-6, 6-4, 4-6తో జర్మనీకి చెందిన నీల్స్ మెక్‌డొనాల్డ్ చేతిలో ఓటమి పాలయ్యాడు.

దందాలతో దడ

(మొదటి పేజీ తరువాయి)



వెళ్లటానికి వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వ్యాపారుల వ్యవహారంలో ఎమ్మెల్యే పేరు చెప్పి కొందరు చేస్తున్న అరాచకాలు పతాక స్థాయికి చేరాయి. ఈ విషయంలో సొంత పార్టీకి చెందిన వారిని కూడా వదిలిపెట్టడం లేదు. సదరు ఎమ్మెల్యే ముడుపుల దందాతో ఆ నియోజకవర్గంలో భయానక వాతావరణం నెలకొందని విమర్శలు వినిపిస్తున్నాయి.

సగం వాటా ఇవ్వాల్సిందే..

సీనియర్ ఎమ్మెల్యే తన అనుచరుల ద్వారా గత ఏడాదిగా చేస్తున్న ఆగడాలకు అడ్డే లేకుండా పోయింది. కోట్లు పెట్టుబడులు పెట్టి రియల్ ఎస్టేట్ వెంచర్ల కోసం భూములు కొనేవారిని వేధిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నియోజకవర్గం రాజధానికి సమీపంలో ఉండటంతో అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారులు చాలా భూములు కొనుగోలు చేశారు. ఎకరం రూ.కోట్లలోనే పలుకుతోంది. వ్యవసాయ భూమిలో వెంచర్ వేయడానికి రెవెన్యూ శాఖ అనుమతి తప్పనిసరి. ల్యాండ్ కన్వర్షన్ జరిగితే తప్ప ప్లాట్‌లు వేసి విక్రయించే అవకాశం ఉండదు. దీని కోసం భూమి కొనుగోలు చేసిన వ్యాపారులు రెవెన్యూ అధికారులకు దరఖాస్తులు చేసుకుంటారు. ముడుపుల వసూలుకుఎమ్మెల్యే దీన్ని అవకాశంగా వాడుకుంటున్నారు. తనకు తెలియకుండా అనుమతులు ఇవ్వొద్దని అధికారులను ఆదేశించారు. దాంతో అధికారులు.. 'మీరు వెళ్లి సార్‌ను కలిసి రండి' అని వ్యాపారులకు సలహాలు ఇస్తున్నారు. దీంతో వారు ఆయన దర్శనం కోసం పడిగాపులు పడాల్సిన పరిస్థితి. చివరకు సార్‌ను కలిసిన తర్వాత ఆయన మాటలు విని రియల్ వ్యాపారులు బిత్తరపోతున్నారు. 'ఆ భూమి మా వాడికి నచ్చింది. మీ కంటే ముందు మా వాడు కొనాలని అనుకున్నాడు. కానీ మీరు కొనేశారు. ఇప్పటికైనా ఏమీ మునిగి పోలా.. మా వాడికి వాటా ఇవ్వండి' అని బెదిరిస్తున్నారు.

ఊ.. అనకపోతే ఉహూనే...

సీనియర్ ఎమ్మెల్యే చెప్పినట్లు వినకపోతే వ్యాపారులకు తిప్పలు తప్పవు. వాటాలు ఇవ్వబోమన్నందుకు గత ఏడాదిగా ఎన్నో రియల్ ఎస్టేట్ వెంచర్లకు అనుమతులు రాకుండా ఆయన అడ్డుపడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరైతే అనుమతులు ఆలస్యమైతే నష్టపోతామనే భయంతో.. అనుచరులు అడిగినంత ఇచ్చుకోలేమని నేరుగా ఆయన్నే కలిసి సెటిల్ చేసుకున్నారు. ఇస్తే వాటాలు ఇవ్వాలి.. లేకపోతే ఎకరాకు రూ.10 లక్షలకు తక్కువ లేకుండా ముడుపులు ముట్టజెప్పాలని డిమాండ్ చేస్తున్నట్టు బాధితులు వాపోతున్నారు. కొందరు దళారులను రంగంలోకి దించి సీనియర్ ఎమ్మెల్యే రియల్ ఎస్టేట్ వ్యాపారులను వేధిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

రిజిస్ట్రేషన్ చేశావా.. పోతావ్!

ఇప్పటి వరకు రియల్ ఎస్టేట్ వ్యాపారుల భూములకు అనుమతి రాకుండా రెవెన్యూ అధికారులను అదుపు చేసిన సీనియర్ ఎమ్మెల్యే ఇప్పుడు మరో అడుగు ముందుకేశారు. తన అనుమతి లేనిదే రిజిస్ట్రేషన్ చేయరాదని, వేలం పాట నిర్వహించరాదని రిజిస్ట్రేషన్లు, బ్యాంకు అధికారులను కూడా బెదిరిస్తున్నారు. 'నాకు తెలియకుండా వెంచర్లలోని ప్లాట్లు, ఎక్కువ మొత్తంలో లబ్ధి చేకూరే భూములు రిజిస్ట్రేషన్ చేస్తే నీ పోస్టింగ్ ఊస్టింగ్' అంటూ కీలక ప్రాంతానికి చెందిన రిజిస్ట్రార్‌ను బెదిరించినట్లు చెబుతున్నారు. ఎమ్మెల్యే ఆదేశాలు రావడంతో సదరు రిజిస్ట్రార్ సీట్లో కూర్చోవాలన్నా బెంబేలెత్తుతున్నారు. ఇదే నియోజకవర్గంలోని ఒక గ్రామానికి చెందిన అర ఎకరం భూమిని బ్యాంకు వేలం వేసింది. ఆ భూమిని ఆన్‌లైన్‌లో ఒకరు పాడుకొని దక్కించుకున్నారు. తనకు తెలియకుండా ఆ భూమిని ఎలా పాట పాడుకుంటారని ప్రశ్నించిన సదరు ఎమ్మెల్యే.. రిజిస్ట్రేషన్ విషయంలో సినిమా చూపించారు. బ్యాంకు అధికారులు రిజిస్ట్రేషన్‌కు సిద్ధమైనా సబ్ రిజిస్ట్రార్‌కు చెప్పి ఆపించారు. తన నియోజకవర్గంలో ఎటువంటి వేలం పాట అయినా తనకు తెలియకుండా చేస్తే బాగుండదని చివరికి బ్యాంకు అధికారులనూ బెదిరించినట్లు తెలుస్తోంది.

తోటి ఎమ్మెల్యేకూ తిప్పలు

ఆ ఎమ్మెల్యే భూదందాలో ఒక ఎమ్మెల్యే కూడా బాధితురాలే అని తెలుస్తున్నది. తన భర్త రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థలో ఆమె ఒక డైరెక్టర్. వారికి సంబంధించిన వెంచర్ అనుమతులు అడ్డుకుంటూ ఏడాదిగా సీనియర్ ఎమ్మెల్యే ముప్పుతిప్పలు పెడుతున్నట్లు తెలిసింది. అడిగినంత ఇవ్వకపోతే అంతే అని చెప్పినట్లు సమాచారం. పలుమార్లు ఎమ్మెల్యే భర్త మాట్లాడినా సీనియర్ ఎమ్మెల్యే మెత్త పడలేదని సమాచారం. అదేమని అడిగితే.. ఆ భూమిని తన అనుచరుడు ముందుగా కొనాలని అనుకున్నాడని, ఆ భూమిని మీరు కొన్నందున ఆ వెంచర్‌లో అతనికి కూడా వాటా ఇవ్వాలని షరతు పెట్టినట్టు తెలిసింది. ఆఖరికి ఆ ఎమ్మెల్యే భర్త గత్యంతరం లేక పది శాతం వాటా ఇస్తానని చెప్పినా సంతృప్తి చెందలేదని సమాచారం. సీనియర్ ఎమ్మెల్యే, ఆయన అనుచరుల ఆగడాలు భరించలేక రియల్ ఎస్టేట్ వ్యాపారులు అమీతుమీ తేల్చుకోవటానికి సిద్ధపడినట్లు తెలిసింది. గత ఏడాదిగా భూముల అనుమతుల కోసం వేచి చూసి విసుగుచెందిన వారు గత్యంతరం లేని పరిస్థితుల్లో రోడ్డెక్కి నిరసన కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.



కొవ్వూరులో చంద్రబాబు ఫ్లెక్సీకి ధాన్యాభిషేకం చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, పక్కన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



విజయనగరం జిల్లా పురిటిపెంట గ్రామంలో పొలంలో దిగి వరినాట్లు వేస్తున్న హోంమంత్రి అనిత

టీడీపీ పాలనలోనే

రైతులకు మేలు

- అన్నదాత సుఖీభవ నిధుల విడుదలపై మంత్రుల హర్షం
- చంద్రబాబు ఫ్లెక్సీకి ధాన్యాభిషేకం చేసిన నిమ్మల
- పొలంలో దిగి నాట్లు వేసిన హోంమంత్రి అనిత
- గాజువాకలో రైతులకు చెక్కు అందజేసిన డోలా

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

వైసీపీ పాలనలో రైతులను పట్టించుకోలేదని జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. రైతాంగానికి టీడీపీ పాలనలోనే మేలు జరుగుతుందని చెప్పారు. అన్నదాత సుఖీభవ నిధుల విడుదల సందర్భంగా శనివారం పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు, తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో నిర్వహించిన కార్యక్రమాల్లో నిమ్మల పాల్గొన్నారు. పాలకొల్లులో రైతులు ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించగా, మంత్రి స్వయంగా ట్రాక్టర్‌ను నడిపారు. నిమ్మల మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టతరంగా ఉన్నప్పటికీ సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ వస్తున్నామన్నారు. కౌలు రైతులకు కౌలు కార్డుల ప్రక్రియను పూర్తిచేసి కేంద్రం సాయం అందకపోయినా రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు రూ.20 వేలు అందజేస్తుందన్నారు. విజయనగరం జిల్లా గజపతినగరం మార్కెట్‌యార్డులో 2.27 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ నిధులను హోంమంత్రి అనిత విడుదల చేశారు. గజపతినగరం మండలం పురిటిపెంట గ్రామ సమీప పొలాల్లో వరినాట్లు వేస్తున్న రైతులు, కూలీలతో ఆమె మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వరి మడిలోకి దిగిన నాట్లు వేశారు. ఆమె మాట్లాడుతూ రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రైతులు సేంద్రియ సాగు చేసేందుకు ముందుకు రావాలని కోరారు. మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు పాల్గొన్నారు. విశాఖపట్నం జిల్లా గాజువాకలో అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమంలో మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతన్నలకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టుకున్నారన్నారు. అనంతరం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందించి ప్రజలను అన్నివిధాలా ఆదుకుంటోందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో నిర్వహించిన కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్రంలో 46,85,838 మంది రైతులకు లబ్ధి చేకూరుతోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందని చెప్పారు. మహిళలకు ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభమవుతుందన్నారు.

'హోర్డింగ్స్' ఏర్పాటుపై

పాలసీ ఉందా?

- రాష్ట్ర వ్యాప్తంగా అధికారిక హోర్డింగ్స్ ఎన్ని?
- పూర్తి వివరాలతో నివేదిక సమర్పించండి: హైకోర్టు

అమరావతి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): హోర్డింగ్స్, ఫ్లెక్సీల ఏర్పాటు, బహిరంగ ప్రకటనల విషయంలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, స్థానిక సంస్థలకు మార్గదర్శకం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా విధానాన్ని(పాలసీ) రూపొందించిందా? అని హైకోర్టు ప్రశ్నించింది. వర్షాలు, తుఫాన్లు వంటి విపత్తులు సంభవించిన సమయంలో వాటి వల్ల ప్రమాదాలు జరగకుండా సదరు పాలసీలో ఏమైనా జాగ్రత్త చర్యలు పేర్కొన్నారా? అని ఆరా తీసింది. ఆయా వివరాలతో నివేదిక సమర్పించాలని పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శిని హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. "అధికారిక ప్రచార బోర్డులు/హోర్డింగ్‌లు/ఫ్లెక్సీలు/ఆర్చ్‌లు ఎన్ని ఏర్పాటయ్యాయి?. అవన్నీ నిబంధనలు, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగానే ఉన్నాయా?. అనే విషయాన్ని నివేదికలో పొందుపరచండి. అనధికారిక/ప్రమాదకర హోర్డింగ్‌ల ఏర్పాటు విషయంలో ఎన్ని ఫిర్యాదులు అందాయి?. వాటిలో ఎన్ని పరిష్కరించారు?. వంటి వివరాలను కూడా అందులో చేర్చండి." అని ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. అనధికారికంగా వెలుస్తున్న హోర్డింగ్స్, బ్యానర్లను అధికారులు తొలగించకపోవడాన్ని సవాల్ చేస్తూ డాక్టర్ అగరాల ఈశ్వర్‌రెడ్డి 2018లో హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం నగరాలు, పట్టణాలు ఉన్నది హోర్డింగ్స్ ఏర్పాటు చేయడానికి కాదని వ్యాఖ్యానించింది. రాజకీయ పార్టీ నాయకులే కాకుండా ప్రైవేటు వ్యక్తులు సైతం అనుమతులు లేకుండా హోర్డింగ్స్ ఏర్పాటు చేస్తున్నారని పేర్కొంది. చట్టవిరుద్ధంగా హోర్డింగ్స్ ఏర్పాటు చేస్తుంటే మున్సిపల్ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించింది. హోర్డింగ్స్, ఫ్లెక్సీ బ్యానర్లను నియంత్రించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఈ వ్యవహారంలో కోర్టుకు సహాయకారిగా(అమికస్ క్యూరీ) న్యాయవాది వివేక్ చంద్రశేఖర్‌ను నియమించింది. తాజాగా మరోసారి ఈ పిల్ విచారణకు రాగా అమికస్ క్యూరీ సమర్పించిన వివరాలను ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది.

కాళేశ్వరంతో ప్రజాధనం వృథా


- ఆర్థిక అవకతవకలకు కేరాఫ్‌గా ప్రాజెక్టు
- మాజీ సీఎం కేసీఆరే ప్రత్యక్షంగా బాధ్యుడు
- మాజీ మంత్రులు ఈటల, హరీశ్‌లకూ పాత్ర
- జస్టిస్ సీపీ ఘోష్ కమిషన్ నిర్ధారణ

హైదరాబాద్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు భారీగా ప్రజాధనం వృథా పథకంగా మారిందని జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ తేల్చి చెప్పింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో తీసుకున్న సొంత నిర్ణయాలు, నిబంధనల ఉల్లంఘన, అక్రమాలు, ఆర్థిక అవకతవకలు, నిర్వహణ లోపాలు, నిర్లక్ష్యం, అశ్రద్ధ, నిజాయతీ లేకపోవడం తదితరాలే దీనికి కారణమని స్పష్టం చేసింది. వీటన్నింటికీ మాజీ సీఎం కేసీఆరే ప్రత్యక్షంగా బాధ్యుడని ఉద్ఘాటించింది. మాజీ మంత్రులు టి.హరీశ్‌రావు, ఈటల రాజేందర్, పలువురు అధికారులు దురుద్దేశపూర్వకంగా వ్యవహరించడం, వాస్తవాలు తొక్కిపెట్టడం, బిజినెస్ రూల్స్ పాటించకుండా నిర్ణయాలు తీసుకోవడం వంటి ఆర్థిక అవకతవకల్లో పాలుపంచుకున్నారని నిర్ధారించింది. దీనికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిషన్ సిఫారసు చేసింది. కొందరు అధికారులపై చట్టప్రకారం చర్యలకు ఉపక్రమించాలని సూచించింది. మేడిగడ్డలోని ఏడో బ్లాకు పునరుద్ధరణ, మరమ్మతుల బాధ్యత నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీదేనని, అదేవిధంగా అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో లోపాలు సరిచేయాల్సిన బాధ్యత కూడా నిర్మాణ సంస్థలదేనని స్పష్టం చేసింది. కాళేశ్వరం బ్యారేజీల విచారణలో భాగంగా జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఇటీవలే ప్రభుత్వానికి నివేదిక అందించింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కమిషన్ పలు అంశాలను ఎత్తిచూపింది. ప్రాజెక్టుల రీ ఇంజనీరింగ్ పేరుతో మేడిగడ్డలో బ్యారేజీ నిర్మాణం ఏ మాత్రం సహేతుకం కాదని నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికను తొక్కిపెట్టి, కమిటీ సిఫారసులను ఉద్దేశపూర్వకంగా పక్కనపెట్టి మేడిగడ్డ నిర్మాణంపై అప్పటి సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని కమిషన్ నిర్ధారించింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి టి.హరీశ్‌రావు పాత్ర ఇందులో ఉందని గుర్తు చేసింది. ఇక మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కట్టాలని కేసీఆర్, హరీశ్‌రావు సొంతంగా నిర్ణయం తీసుకున్నారని, ప్రభుత్వ నిర్ణయం ఏమాత్రం కాదని తప్పుపట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టు ఆర్థికపరమైన అవకతవకలకు కేరాఫ్‌గా మారిందని, బరితెగింపుతోనే నిర్ణయాలు తీసుకున్నారని తేల్చింది. మేడిగడ్డ నిర్మాణ సంస్థతో అధికారులు కుమ్మక్కై భారీ మొత్తంలో ప్రజాధనం దోచుకోవడానికి దురుద్దేశపూర్వకంగా వ్యవహరించారని తప్పుబట్టింది. బ్యారేజీలపై వాప్కోస్ నివేదికను పక్కనపెట్టినందున... ఆ సంస్థకు చెల్లించిన రూ.6.77కోట్లను బాధ్యులైన అధికారుల నుంచి రికవరీ చేయాలని కమిషన్ సిఫారసు చేసింది.

చిత్రజ్యోతి


★ SINCE 1965 ★

రణమున యముడు



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ తెరకెక్కిస్తున్న గ్యాంగ్‌స్టర్ డ్రామా 'ఓజీ'. డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. ఇందులో ఓజాస్ గంభీరా అనే శక్తిమంతమైన పాత్రను పవన్ కల్యాణ్ పోషిస్తున్నారు. ఇమ్రాన్ హష్మీ విలన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ సినిమాపై అంచనాలను పతాకస్థాయికి తీసుకెళ్లింది. శనివారం ఈ చిత్రం నుంచి మొదటి పాట 'ఫైర్ స్టార్మ్'ను విడుదల చేశారు మేకర్స్. 'అలలిక కదలక భయపడెలే.. క్షణక్షణమొక తల తెగిపడెలే.. రణమున యముడిక కనపడెలే' అంటూ పవర్‌ఫుల్ పదాలతో సాగిందీ గీతం. అదిరిపోయే ఎలివేషన్స్‌తో ఉన్న ఈ పాట అందరినీ ఆకట్టుకుంటోంది. విశ్వ, శ్రీనివాస మౌళి లిరిక్స్ రాశారు. తమిళ నటుడు శింబు, దీపక్ బ్లూ తదితరులు ఈ గీతాన్ని ఆలపించగా, తమన్ సంగీతం అందించారు. ప్రియాంక మోహన్ హీరోయిన్. దసరా సందర్భంగా సెప్టెంబరు 25న ప్రేక్షకుల ముందుకు వస్తోందీ చిత్రం.

రెండో భాగం మరింత అలరిస్తుంది



- విజయ్ దేవరకొండ

'తన అన్న శివ కోసం సూరి చేసిన ప్రయాణాన్ని 'కింగ్‌డమ్' తొలి భాగంలో చూశాం. రెండో భాగం కోసం దర్శకుడు గౌతమ్ దగ్గర గొప్ప ఆలోచనలున్నాయి. అది మరింత అద్భుతంగా ఉండబోతోంది' అని విజయ్ దేవరకొండ అన్నారు. ఆయన హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన చిత్రమిది. ఇటీవలే విడుదలై చక్కటి ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మీడియాతో ముచ్చటించారు.


- సినిమా విడుదలకు ముందు ప్రతి ఒక్క హీరో పైనా ఒత్తిడి ఉంటుంది. 'కింగ్‌డమ్' విడుదలకు ముందు నాపైనా అలాంటి ఒత్తిడి ఉంది. మొదటి షో పూర్తయి హిట్ టాక్ రాగానే చాలా సంతోషం కలిగింది. ఈ చిత్రానికి తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ మంచి ఆదరణ దక్కుతున్నందుకు ఆనందంగా ఉంది.
- అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో గ్యాంగ్‌స్టర్ డ్రామా అనే లైన్ గౌతమ్ చెప్పినప్పుడు నాకు చాలా ఆసక్తికరంగా అనిపించింది. సినిమాలో బలమైన భావోద్వేగాలు ఉండేలా ఆయన కథను తీర్చిదిద్దారు.
- 'పెళ్లిచూపులు' చిత్రం హిట్టయినప్పుడు మరికొన్ని సినిమాల్లో అవకాశాలు వస్తాయని అనుకున్నాను. కానీ ఇప్పుడు ఒక సినిమా హిట్టయితే, ఆనందం కన్నా మంచి సినిమాలు చేయాలనే బాధ్యత ఎక్కువ ఉంది.
- ఈ సినిమాలో మరింత ధృడంగా కనిపించేందుకు కసరత్తులు చేశాను. నాటి కాలానికి తగ్గట్లు ఆహార్యం, అభినయంలో వైవిధ్యం చూపేందుకు ప్రయత్నించాను. రాహుల్ సాంకృత్యాన్, రవికిరణ్ కోలా దర్శకత్వంలో నా తదుపరి సినిమాలు చేస్తున్నాను.

ఒక తన్మయత్వంలో రచన చేశాను



'బేబీ' సినిమా స్క్రిప్ట్ రాసేటప్పుడు ఒక తన్మయత్వంలో ఉండిపోయేవాణ్ణి. హీరో హీరోయిన్ల పాత్రల మానసిక స్థితిని, భావోద్వేగాలను నేను అనుభూతి చెందుతూ రాసేవాణ్ణి. ప్రతి సన్నివేశానికి మెరుగులు దిద్దుతూ రెండేళ్ల పాటు కష్టపడి ఈ సినిమా స్క్రిప్ట్‌కు తుదిరూపు ఇచ్చాను. ఇప్పుడు ఈ చిత్రానికి ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగా నాకూ, ఉత్తమ నేపథ్య గాయకుడిగా పీవీఎన్ఎస్ రోహిత్‌కు జాతీయ పురస్కారం దక్కినందుకు ఆనందంగా ఉంది' అని దర్శకుడు సాయిరాజేశ్ అన్నారు. జాతీయ పురస్కారాలకు ఎంపికైన సందర్భంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం సాయిరాజేశ్‌ను, రోహిత్‌ను సత్కరించింది. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ "బేబీ' సినిమాలో పాట పాడడానికి ముందు నా కెరీర్ చాలా డల్‌గా ఉంది. ఈ చిత్రంలో 'ప్రేమిస్తున్నా' పాటకు అవకాశం రాగానే, చావో రేవో అన్నట్లుగా సాధన చేశాను. ఇప్పుడు ఆ పాటకు జాతీయ పురస్కారం దక్కినందుకు ఎంతో ఆనందంగా ఉంది' అన్నారు.

దేవాతో ఆటలా..



రజనీకాంత్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించిన చిత్రం 'కూలీ'. నాగార్జున, ఆమిర్ ఖాన్, ఉపేంద్ర, సౌబిన్ షాహిర్, శ్రుతి హాసన్ కీలక పాత్రలు పోషించారు. కళానిధి మారన్ నిర్మించారు. ఈనెల 14న సినిమా విడుదలవుతోంది. తెలుగులో ఈ చిత్రాన్ని ఏషియన్ సురేశ్ ఎంటర్టైన్‌మెంట్స్ సంస్థ విడుదల చేస్తోంది. శనివారం ట్రైలర్‌ను విడుదల చేశారు. ప్రధాన పాత్రలను పరిచయం చేసిన విధానం, విజువల్స్ ఆకట్టుకున్నాయి. 'ఈ దేవా గురించి తెలిసి కూడా గేమ్స్ ఆడతావా రా' అంటూ రజనీ చెప్పిన సంభాషణతో ముగిసిన ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచేసింది.

నవ్వుల బన్



రాజు జయమోహన్, ఆద్యప్రసాద్, భవ్య త్రిఖ ప్రధాన పాత్రధారులుగా రాఘవ్ మిర్దత్ తెరకెక్కించిన వినోదాత్మక చిత్రం 'బన్ బటర్ జామ్'. సురేశ్ సుబ్రమణియన్ నిర్మించారు. ఇప్పటికే తమిళ్‌లో విడుదలై విజయం సాధించిందీ చిత్రం. ఈనెల 8న సినిమాను సీహెచ్ సతీశ్‌కుమార్ తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా టీజర్‌ను దర్శకుడు మెహర్ రమేశ్ విడుదల చేశారు. సినిమా ఘనవిజయం సాధించాలని కోరుతూ, చిత్రబృందానికి అభినందనలు తెలియజేశారు.

సైంటిఫిక్ థ్రిల్లర్



హీరో శ్రీరామ్ ముఖ్యపాత్రలో జాన్ జక్కి తెరకెక్కించిన సైంటిఫిక్ థ్రిల్లర్ మూవీ 'మాతృ'. సుగి విజయ్, రూపాలీ భూషణ్ జంటగా నటించారు. శ్రీ పద్మిని సినిమాస్ బేనర్‌పై బూర్లె శివప్రసాద్ నిర్మించారు. ఈనెల 8న థియేటర్లలో విడుదల అవుతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత మాట్లాడుతూ 'ఇప్పటికే రిలీజ్ చేసిన చిత్ర కంటెంట్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని నమ్ముతున్నాం' అని అన్నారు.

నా పేరూ తీసేశారు: తేజస్వి.. ఇదిగో ఉంది: ఈసీ

న్యూఢిల్లీ, ఆగస్టు 2: బిహార్‌లో చేపట్టిన ఓటర్ల రీ సర్వేపై విపక్ష ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ విమర్శలు గుప్పించారు. రీ సర్వే అనంతరం శుక్రవారం ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో తన పేరును తీసేశారని ఆరోపించారు. శనివారం ఆయన పట్నాలో మీడియాతో మాట్లాడారు. ఫొటో గుర్తింపు కార్డులో ఉన్న ఎపిక్ నెంబర్‌ను ఎన్నికల సంఘం అధికారిక యాప్‌లో నమోదు చేసిన తేజస్వి.. జాబితాలో తన ఓటుకు సంబంధించిన వివరాలు తీసేశారని పేర్కొన్నారు. 'ఎలాంటి రికార్డులు లేవు.' అని ఉన్న సందేశాన్ని చూపించారు. "జాబితాలో నా పేరు లేదు. ఎన్నికల్లో నేనెలా పోటీ చేయగలను?." అని ప్రశ్నించారు. తేజస్వి ఆరోపణలపై ఎన్నికల సంఘం వెంటనే స్పందించింది. ఎలక్టోరల్ జాబితాలోని ఓ కాపీని సోషల్ మీడియాలో పోస్టు చేసి.. పట్నాలోని వెటర్నరీ కాలేజీ పోలింగ్ బూత్ పరిధిలో తేజస్వికి ఓటు హక్కు ఉందని స్పష్టం చేసింది. ఆయన చేసిన ఆరోపణలు దుర్మార్గపూరితమైనవని, నిరాధారమని దుయ్యబట్టింది. ముసాయిదా ఓటర్ల జాబితాలో సీరియల్ నెంబరు 416లో తేజస్వి పేరు, వివరాలు ఉన్నాయని వివరించింది.

రాజ్యసభలో 102కు పెరిగిన బీజేపీ బలం

న్యూఢిల్లీ, ఆగస్టు 2: వచ్చే నెల 9వ తేదీన ఉపరాష్ట్రపతి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజ్యసభలో అధికార బీజేపీ బలం మరింత పెరిగింది. ఇటీవల రాజ్యసభకు నామినేట్ అయిన ముగ్గురు ఎంపీలు ఈ వారం ఆ పార్టీలో చేరారు. దీంతో పెద్దల సభలో బీజేపీ సభ్యుల సంఖ్య 102కి చేరింది. 2022 ఏప్రిల్ తర్వాత బీజేపీ సభ్యుల సంఖ్య రెండోసారి 100 మార్కు దాటింది. రాజ్యసభ ఎంపీలుగా రాష్ట్రపతి నామినేట్ చేసిన ప్రముఖ న్యాయవాది ఉజ్వల్ నికమ్, విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి హర్షవర్ధన్ సింగ్ శ్రింగ్లా, కేరళకు చెందిన సామాజిక కార్యకర్త సీ సదానందన్ అధికారికంగా బీజేపీలో చేరారు. వీరి చేరికతో ప్రస్తుతం 240 మంది సభ్యులు ఉన్న పెద్దల సభలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి బలం మెజార్టీ మార్కు దాటి 134కి చేరింది. వీరిలో ఐదుగురు నామినేటెడ్ ఎంపీలు ఉన్నారు.

మీ ఎఫ్-35 ఫైటర్ జెట్లు మాకొద్దు..!

▸▸ సుంకాల నేపథ్యంలో అమెరికాతో డీల్‌పై భారత్ అనాసక్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 2: సుంకాలతో రెచ్చిపోతున్న ట్రంప్ దూకుడుకు దీటుగా బదులిచ్చేందుకు మన దేశం సిద్ధమైంది. భారత్ వస్తువులపై 25% సుంకాలు వేసిన అమెరికా నుంచి ఎఫ్-35 స్టెల్త్ ఫైటర్ జెట్లు కొనుగోలు చేయకూడదని భావిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు 'మీ ఐదో తరం ఎఫ్-35 యుద్ధవిమానాల కొనుగోలుపై మాకు ఆసక్తిలేదు' అని అమెరికా అధికారులకు భారత్ స్పష్టం చేసినట్లు తాజాగా బ్లూమ్‌బర్గ్ నివేదిక వెల్లడించింది. ఇకపై అమెరికాతో ప్రధాన రక్షణ ఒప్పందాలకు భారత ప్రభుత్వం అనుమతి ఇచ్చే అవకాశం లేదని ఆ నివేదిక స్పష్టం చేసింది. మేకిన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఏదైనా భాగస్వామ్యంతో దేశీయంగా ఆయుధాల తయారీపై భారత్ పెద్దఎత్తున దృష్టి పెట్టిందని పేర్కొంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రధాని మోదీ అమెరికా పర్యటనకు వెళ్లినపుడు ఎఫ్-35లను విక్రయించేందుకు అమెరికా అంగీకరించింది. ట్రంప్ కూడా ఆ విషయాన్ని వెల్లడించారు. ఆ యుద్ధ విమానాలు ఓ చెత్త అంటూ గతంలో ఎలాన్ మస్క్ చేసిన వ్యాఖ్యల్ని ఉటంకిస్తూ విపక్ష కాంగ్రెస్.. మోదీ సర్కార్‌పై అప్పట్లో విమర్శలు చేసింది.

మాలేగావ్ కేసులో మోదీ పేరు చెప్పాలన్నారు

▸▸ యోగి, భాగవత్ పేర్ల కోసం హింసించారు: ప్రజ్ఞాసింగ్

న్యూఢిల్లీ, ఆగస్టు 2: మాలేగావ్ పేలుళ్ల కేసులో ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగి, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, బీజేపీ నేత రామ్ మాధవ్ పేర్లు చెప్పాలని తనను ఏటీఎస్ అధికారులు హింసించారని బీజేపీ మాజీ ఎంపీ ప్రజ్ఞా సింగ్ ఠాకూర్ ఆరోపించారు. ఈ పేర్లు చెబితే తనను హింసించబోమని మాటిచ్చారని ఆమె చెప్పారు. తనపై తప్పుడు ఆరోపణలతో కేసు పెట్టారని, ఇదంతా కాంగ్రెస్ కుట్రగా ప్రస్తుతం బహిర్గతమైందన్నారు. ఈ కేసులో తనతో సహా ఆరోపణలు ఎదుర్కొన్నవారంతా నిర్దోషులుగా బయటపడటం కాషాయానికి, సనాతన ధర్మానికి లభించిన విజయమని ఆమె చెప్పారు. ఈ కేసులో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌ను అరెస్ట్ చేయాలని తనపై ఒత్తిడి తెచ్చారని ఏటీఎస్ అధికారి మహబూబ్ ముజావ్ ఇటీవలే ఆరోపించారు.

ఈ ఏడాది అమెరికా నుంచి..

1,703 మంది భారతీయుల బహిష్కరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 2: డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్ష పీఠాన్ని అధిరోహించాక.. అమెరికా నుంచి 1,703 మంది భారతీయులను బహిష్కరించారు. వీరంతా అక్రమంగా అమెరికాలో ఉంటున్నట్లు అక్కడి హోంల్యాండ్ సెక్యూరిటీ, ఇమిగ్రేషన్ అధికారులు తెలిపారు. ఈ గణాంకాలను భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ ఏడాది ప్రథమార్థంలో రోజుకు సగటున 8 మంది చొప్పున అమెరికా నుంచి డీపోర్ట్ అయినట్లు ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2020-24 మధ్య– బైడెన్ పరిపాలనలో ఈ సంఖ్య రోజుకు సగటున 3గా ఉండేది. ఈ లెక్కన అమెరికా నుంచి భారతీయుల డీపోర్టింగ్ ఈ ఏడాది మూడింతలు పెరిగింది. గడిచిన ఐదేళ్లలో మొత్తం 7,244 మంది భారతీయులు అమెరికా నుంచి బహిష్కరణకు గురయ్యారు. వారిలో పాతిక శాతం మంది ఈ ఏడాది తొలి ఆర్నెల్లలోనే భారత్‌కు తిరిగి రావడం గమనార్హం..!

మసాజ్ చేసే ఏఐ రోబో

న్యూయార్క్, ఆగస్టు 2: ఏఐ విస్తృత అభివృద్ధితో మానవ ఉద్యోగాలకు ముప్పు ఏర్పడుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ అమెరికా కంపెనీ మానవ మసాజ్‌కు ప్రత్యామ్నాయంగా మొట్టమొదటి ఏఐ ఆధారిత మసాజ్ రోబోను పరిచయం చేసింది. ఈ నూతన టెక్నాలజీ తమ ఉద్యోగాలకు ఎక్కడ ఎసరు పెడుతుందోనని థెరపిస్టులు భయపడుతున్నారు. అమెరికాలోని ఎస్కేప్ అనే సంస్థ అభివృద్ధి చేసిన ఈ ఏఐ మసాజ్ రోబో.. మనిషి శరీరాకృతి, కండరాల పనితీరు ఆధారంగా తగిన రీతిలో మర్దన చేస్తుంది. ఈ మసాజ్‌లో వినియోగదారుడికి ప్రత్యేక సూట్‌ను ధరింపజేస్తారు. ఇది మనిషి శరీరాన్ని 10 లక్షల 3డీ డేటా పాయింట్లతో మ్యాప్ చేస్తుంది. అనంతరం రోబోకు అమర్చిన భుజం మంచం మీద పడుకున్న మనిషి శరీరం అంతటా సంచరిస్తూ, శరీరానికి అవసరమైన ఒత్తిడిని కలిగిస్తూ మర్దన చేస్తుంది. ఈ ఏఐ రోబో ఏడు రకాల మసాజ్ పద్ధతులను కచ్చితమైన ఒత్తిడితో తగిన ఉష్ణోగ్రతను అందిస్తుందని ఎస్కేప్ సంస్థ వ్యవస్థాపకుడు ఎరిక్ లిట్‌మన్ తెలిపారు.



డాలస్‌లోని భారత కాన్సులర్ కేంద్రంలో అధికారులతో ప్రసాద్ తోటకూర

అమెరికాలో మరో 8 భారత కాన్సులర్ కేంద్రాలు

▸▸ డాలస్‌లో ఏర్పాటుపై ఐఏఎఫ్‌సీ అధ్యక్షుడు ప్రసాద్ హర్షం

న్యూయార్క్, ఆగస్టు 2: అమెరికా వ్యాప్తంగా కొత్తగా 8 ఇండియా కాన్సులర్ అప్లికేషన్ సెంటర్ల(ఐసీఏసీ)ను భారత్ తెరిచింది. డాలస్, బోస్టన్, కొలంబస్, డెట్రాయిట్, ఎడిసన్, ఒర్లాండో, రాలీ, శాన్‌జోస్‌లలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలను అమెరికాలోని భారత రాయబారి వినయ్ క్వాట్రా శుక్రవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే లాస్‌ఏంజెలిస్‌లో మరో కేంద్రాన్ని కూడా ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. 'అమెరికాలో ఉంటున్న 50 లక్షలకు పైగా ప్రవాస భారతీయుల కోసం మా సేవలను మరింత విస్తరిస్తున్నాం. పాస్‌పోర్టు, వీసా, జనన/వివాహ ధ్రువీకరణ పత్రం, ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ), సరెండర్ సర్టిఫికెట్, పోలీసు క్లియరెన్స్ సహా అన్ని సేవలను ఈ కాన్సులర్ కేంద్రాల ద్వారా పొందవచ్చు' అని వెల్లడించారు. డాలస్‌లో కాన్సులర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం పట్ల ఇండియన్ అమెరికన్ ఫ్రెండ్షిప్ కౌన్సిల్ (ఐఏఎఫ్‌సీ) అధ్యక్షుడు ప్రసాద్ తోటకూర హర్షం వ్యక్తం చేశారు. కాగా, కొత్త వాటితో కలిపి అమెరికాలోని భారత కాన్సులర్ కేంద్రాల సంఖ్య 17కు పెరిగింది.

లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్

70-100 స్థానాల్లో ఫలితాలు తారుమారు.. మా వద్ద వంద శాతం ఆధారాలున్నాయి

▸▸ వాటిని త్వరలోనే బయటపెడతాం

▸▸ ఇది అణుబాంబు వంటిది..

▸▸ కాంగ్రెస్ లీగల్ సదస్సులో రాహుల్

▸▸ 10-15 నియోజకవర్గాల్లో రిగ్గింగ్ జరిగి ఉండకపోతే మోదీ ప్రధాని అయ్యేవారు కాదని వ్యాఖ్య



శనివారం కాంగ్రెస్ లీగల్ సదస్సులో కర్ణాటక సీఎం సిద్ధరామయ్యతో రాహుల్ గాంధీ కరచాలనం

న్యూఢిల్లీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): "గత (2024) లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగింది. కనీసం 70 నుంచి వంద స్థానాల్లో ఫలితాలను తారుమారు చేశారని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఎన్నికల ఫలితాలను ఎలా తారుమారు చేశారో చెప్పడానికి మా వద్ద నూటికి నూరు శాతం ఆధారాలున్నాయి. వాటిని త్వరలో బయటపెడతాం. ఇది ఓ ఆటం బాంబు వంటిది" అని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా ఆరోపించారు. ఎన్నికల్లో రిగ్గింగ్‌పై తమకు ఎప్పటి నుంచో అనుమానాలు ఉన్నాయని, కానీ, ఇప్పుడు ఆధారాలు లభించాయని తెలిపారు. రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్లో కాంగ్రెస్ పార్టీ న్యాయ, మానవ హక్కులు, సమాచార హక్కు విభాగం శనివారం వార్షిక సదస్సును నిర్వహించింది. ఈ సదస్సును ఉద్దేశించి మాట్లాడుతూ రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. మోదీ అతి తక్కువ మెజారిటీతో ప్రధాన మంత్రి అయ్యారని, 10-15 నియోజకవర్గాల్లో రిగ్గింగ్ జరిగి ఉండకపోతే ఆయన ప్రధాన మంత్రి అయి ఉండేవారు కాదని వ్యాఖ్యానించారు. "అసలు దేశంలో ఎన్నికల కమిషన్ అనేదే లేదన్నట్లుగా మా వద్ద ఆధారాలున్నాయి. వాటిని దేశం మొత్తానికి చూపిస్తాం. కాంగ్రెస్ పార్టీ దాదాపు ఆరు నెలలపాటు కష్టపడి ఎన్నికల అక్రమాలకు సంబంధించిన ఆధారాలు సంపాదించింది. ఉదాహరణకు, ఓ నియోజకవర్గంలో 6.5 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. కానీ, వారిలో లక్షన్నర మంది బోగస్ ఓటర్లే" అని రాహుల్ వివరించారు. లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ ఎలా చేయవచ్చు.. ఎలా చేశారనే విషయాన్ని తాము నిరూపిస్తామని చెప్పారు. ఆ డేటాను తాము విడుదల చేసినప్పుడు ప్రకంపనలు తప్పవని చెప్పారు. "మేం ఈ ఆధారాలను కొంత మందికి చూపించినప్పుడు వాళ్లు కుర్చీ నుంచి కిందకు పడిపోయారు. ఇదెలా సాధ్యమని ప్రశ్నించారు. కానీ, ఇది సాధ్యం. ఇదే జరిగింది. ఇది నిజం" అని రాహుల్ వ్యాఖ్యానించారు.

ఎన్నికల కమిషన్ పూర్తిగా నిర్వీర్యం


దేశంలో ఎన్నికల వ్యవస్థ ఇప్పటికే చచ్చిపోయిందని రాహుల్ ఆరోపించారు. "లోక్‌సభ ఎన్నికలు జరిగిన తర్వాత నాలుగు నెలల్లోనే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ నాలుగు నెలల్లో కోటి మంది కొత్త ఓటర్లను చేర్చారు. వారిలో అత్యధికులు బీజేపీకే ఓటు వేశారు" అని ఆరోపించారు. 2014 నుంచే ఎన్నికల ఫలితాలపై తమకు సందేహాలు ఉన్నాయని, మరీ ముఖ్యంగా, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల్లో ఘన విజయాలు బీజేపీ మేనేజ్ చేసిందని, కానీ, టర్నింగ్ పాయింట్ మాత్రం ఇటీవలి మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలని వ్యాఖ్యానించారు. "లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో మేం గెలిచాం. కానీ, కేవలం నాలుగు నెలల్లోనే అక్కడ మేం ఓడిపోవడమే కాదు.. పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాం. మూడు ప్రధాన పార్టీలు కనిపించకుండా పోయాయి. అప్పటి నుంచే ఎన్నికల అక్రమాలపై మేం సీరియస్‌గా దృష్టిసారించాం" అని వివరించారు. 'నువ్వు నిప్పుతో చెలగాటం ఆడుతున్నావ్' అని తన సోదరి ప్రియాంక గాంధీ తనను హెచ్చరించారని, పిరికివాళ్లను చూసి భయపడవద్దని తన కుటుంబం తనకు నేర్పిందని చెప్పారు. రఫేల్ ఒప్పందంలో ప్రధాన మంత్రి కార్యాలయం, జాతీయ భద్రతా సలహాదారు జోక్యం ఉందని డాక్యుమెంట్లు చెబుతున్నాయని, ఇలాంటి డాక్యుమెంట్ మరో దేశంలో బయటపడి ఉంటే.. ప్రభుత్వం కుప్పకూలిపోయేదని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. కానీ, మన దేశంలో ఏమీ జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, రాహుల్ ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందించింది. అధికారులను బెదిరించడానికి విపక్ష నేత ఆరోపణలు చేస్తున్నారని విమర్శించింది. అలాంటి ఆరోపణలు ఎన్నికల యంత్రాంగాన్ని తీవ్ర ఒత్తిడి గురిచేయిస్తాయని వ్యాఖ్యానించింది.

కావాలనే తొలగించారు: ఖర్గే

బిహార్ అసెంబ్లీ ఎన్నికల జాబితాల నుంచి నిరుపేదలు, అణచివేతకు గురైన, మైనారిటీల ఓట్లను కావాలనే ఎన్నికల సంఘం తొలగించిందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ.. పదవిలో ఉన్నా.. పదవీ విరమణ చేసినా నిబంధనలను ఉల్లంఘించిన ఎన్నికల సంఘం అధికారులను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డులను వెరిఫికేషన్ ప్రక్రియలో అనుమతించాలని సుప్రీం కోర్టు చెప్పినా.. ఎన్నికల సంఘం పట్టించుకోలేదని దుయ్యబట్టారు. రాజ్యాంగం కబ్జాలో ఉందని, రాజ్యాంగ నిర్మాణాన్ని ధ్వంసం చేయడానికి బీజేపీ తన అధికారాన్ని ఉపయోగిస్తోందని సోనియా గాంధీ దుయ్యబట్టారు. ఆమె ప్రత్యేక సందేశాన్ని సదస్సులో వినిపించారు.

అరుణ్ జైట్లీపై వ్యాఖ్యలు.. విమర్శలు

"ఇప్పుడు ఆయన మన మధ్య లేరు. అందుకని, ఈ విషయం ఇప్పుడు చెప్పకూడదు. కానీ, చెప్పక తప్పడం లేదు. సాగు చట్టాలపై మేం పోరాడుతున్నప్పుడు అరుణ్ జైట్లీ నా వద్దకు వచ్చారు. మీరు ఇలాగే వ్యతిరేకిస్తూ ఉంటే మీపై చర్యలు తీసుకోకతప్పదని హెచ్చరించారు" అని రాహుల్ వెల్లడించారు. అయితే, మీరు తప్పుడు వ్యక్తి వద్దకు వచ్చారని, కాంగ్రెస్‌వాదిని ఎవరూ బెదిరించడం కానీ, లొంగదీసుకోవడం కానీ చేయలేరని, తాము కాంగ్రెస్ వాళ్లమే కానీ పిరికివాళ్లం కాదని, బ్రిటిష్ వాళ్లే తమను లొంగదీసుకోలేకపోయారని ఆయనకు జవాబు ఇచ్చానని రాహుల్ చెప్పారు. అయితే, రాహుల్ వ్యాఖ్యలను అరుణ్ జైట్లీ తనయుడు రోహన్ జైట్లీ ఖండించారు. తన తండ్రి 2019లోనే చనిపోయారని, కానీ, సాగు చట్టాలను మాత్రం 2020లో ప్రవేశపెట్టారని గుర్తు చేశారు.



ఆలూ తల్లి టమాట!

శీతల వాతావరణాన్ని తట్టుకునే క్రమంలో దుంపలా ఆవిర్భావం

బీజింగ్, ఆగస్టు 2: టమాట నుంచి ఆలుగడ్డ పుట్టిందా? ఆ రెండింటికీ మధ్య కొన్ని లక్షల ఏళ్ల అనుబంధం ఉందా?.. చైనా శాస్త్రవేత్తల పరిశోధన ఈ అంశంపై కొత్త కోణాలను వెల్లడించింది. ప్రస్తుత దక్షిణ అమెరికా ఖండంలోని అండీస్ పర్వతప్రాంతంలో అడవి టమాట మొక్కకు, ఆలుగడ్డ వంటి ఎటుబిరోసమ్ అనే మొక్కతో 90 లక్షల ఏళ్ల క్రితం సంపర్కం జరిగి ఆలుగడ్డ అనే కొత్త మొక్క పుట్టిందని వీరు గుర్తించారు. టమాట, ఎటుబిరోసమ్ రెండూ కూడా 1.4 కోట్ల ఏళ్ల క్రితం ఒకే వృక్షజాతికి చెందినవని, తర్వాత కాలంలో అవి రెండూ విడివిడిగా అభివృద్ధి చెందాయని తెలుసుకున్నారు. చైనా అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ శాస్త్రవేత్తలు ఈ పరిశోధన నిర్వహించారు. దీంట్లోభాగంగా.. రైతులు పండించే ఆలుగడ్డ రకాలు, అడవిలో పెరిగిన ఆలుగడ్డ రకాలకు చెందిన 450 జన్యుక్రమాలను విశ్లేషించారు. ఫలితాలపై ముఖ్య శాస్త్రవేత్త ఝియాంగ్ ఝూంగ్ మాట్లాడుతూ, ఆలుగడ్డ పుట్టుకకు కారణమైన టమాట, ఎటుబిరోసమ్.. రెండింటిలోనూ దుంపలకు ఉండేటువంటి వేళ్లు, కాండం వంటివి లేవని.. ఆ లక్షణం ఆలూలోనే ఆవిర్భవించిందని తెలిపారు. అండీస్ ప్రాంతంలో వాతావరణం అత్యంత శీతలంగా మారిపోతున్నందున దానిని తట్టుకొనేందుకే.. ఈ కొత్త లక్షణం అంకురించిందన్నారు. దీని వల్ల మొక్కకు అవసరమైన పోషకాలను నేల లోపల దుంప రూపంలో భద్రపర్చుకునే వీలు కలిగిందని ఝియాంగ్ పేర్కొన్నారు. ఈ పరిశోధనలో పాలుపంచుకున్న ప్రొఫెసర్ జియాన్‌క్వన్ లీ మాట్లాడుతూ, మనుషుల్లో వంశక్రమాలను తెలుసుకోవటానికి ఉపయోగించే 'ఫైలోజెనెటిక్ ఎనాలిసిస్' పద్ధతినే ఇక్కడ కూడా తాము వాడామని తెలిపారు. ఈ పరిశోధన వివరాలు సెల్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

రష్యా చమురు కొనుగోళ్లను..

భారత్ ఆపేస్తోంది!

▸▸ ఇదో మంచి ముందడుగు: ట్రంప్

▸▸ అది అవాస్తవం: విదేశాంగ అధికారులు

వాషింగ్టన్/న్యూఢిల్లీ, ఆగస్టు 2: భారత్, రష్యాలవి పతన ఆర్థిక వ్యవస్థలంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ఏకపక్ష వ్యాఖ్యలు చేశారు. 'రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లను నిలిపేస్తోంద'ంటూ చిత్రమైన వ్యాఖ్యలు చేశారు. శనివారం అమెరికాలోని వాషింగ్టన్‌లో ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ.. "రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేస్తున్నట్టు నాకు సమాచారం వచ్చింది. అది సరైనదేనా, కాదా అనేది తెలియదు. కానీ ఒక మంచి ముందడుగు. ఏం జరుగుతుందో చూద్దాం.." అని పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయవద్దంటూ తీవ్రంగా ఒత్తిడి తెచ్చిన అమెరికా.. అందుకు అంగీకరించకపోవడంతో భారత్‌పై 25శాతం అదనపు సుంకాలు, జరిమానాలు విధిస్తున్నట్టుగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ట్రంప్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు ట్రంప్ వ్యాఖ్యలను విదేశాంగ శాఖ అధికార వర్గాలు ఖండించాయి. "భారత ప్రయోజనాలు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుంది. రష్యా నుంచి చమురు, ఇతర ఉత్పత్తుల దిగుమతులను నిలిపివేసే దిశగా ఎలాంటి నిర్ణయం తీసుకున్న దాఖలాలు లేవు.." అని తెలిపాయి. అయితే దీనిపై అధికారిక ప్రకటన ఏదీ వెలువడలేదు.

రాయితీలు తగ్గడంతో కొనుగోళ్లపై ప్రభావం?

వాస్తవానికి అమెరికా ఆంక్షల నేపథ్యంలో రష్యా తన చమురును అమ్ముకోవడానికి రాయితీ (డిస్కౌంట్)లు ఇస్తోంది. దీనితో రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు గత మూడు, నాలుగేళ్లలో భారీగా పెరిగాయి. కానీ ఇటీవల రష్యా తన రాయితీలను తగ్గించడం, రవాణా సమస్యలతో.. భారత రిఫైనరీలు రష్యా నుంచి చమురు కొనుగోళ్లను తగ్గిస్తూ వస్తున్నాయని పలు గణాంకాలను ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తా సంస్థ కథనాన్ని ప్రచురించింది. ఇండియన్ ఆయిల్, హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం వంటివి దాదాపుగా రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేశాయని పేర్కొంది.

మూడో అతిపెద్ద ఎకానమీగా

అవతరిస్తున్నాం

ట్రంప్ 'డెడ్ ఎకానమీ' వ్యాఖ్యలకు మోదీ కౌంటర్



వారాణసీలో నిర్వహించిన కార్యక్రమంలో ఓ దివ్యాంగుడికి సాయం చేస్తున్న మోదీ

▸▸ అప్రమత్తంగా ఉండాల్సిన సమయమిది

▸▸ ప్రపంచ పరిస్థితులు అస్థిరంగా ఉన్నాయి

▸▸ మనం స్వదేశీ ఉత్పత్తులపై దృష్టి సారించాలి

▸▸ విపక్షాలూ కలిసి రావాలని ప్రధాని పిలుపు

వారాణసీ, ఆగస్టు 2: 'భారత్, రష్యాలది డెడ్ ఎకానమీ' అంటూ పరుష వ్యాఖ్యలు చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు, ఆయనను సమర్థించిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి ప్రధాని మోదీ పరోక్షంగా కౌంటర్ ఇచ్చారు. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తోందని స్పష్టంచేశారు. ఈ సమయంలో అప్రమత్తంగా ఉండాలని, స్వదేశీ విధానాలపై దృష్టి సారించాల్సి ఉన్నదని ఆయన అన్నారు. విపక్షాలు సైతం రాజకీయ విభేదాలను పక్కనపెట్టి, స్వదేశీ ఉత్పత్తులకు ఉమ్మడి ప్రచారం కల్పించాలని ప్రధాని కోరారు. భారత్‌పై దాడికి తెగిస్తే ఏఒక్కరినీ వదిలిపెట్టబోమని, ఒకవేళ పాతాళంలో దాక్కున్నా వెతికి పట్టుకుంటామంటూ..దాయాదిదేశం పాకిస్థాన్‌పై తీవ్ర స్వరం వినిపించారు. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని జీర్ణించుకోవడం కొంతమందికి కష్టంగా ఉన్నదంటూ విపక్షాలపై విరుచుకుపడ్డారు. మోదీ తన సొంత నియోజకవర్గం యూపీలోని వారాణసీలో శనివారం రైతుల ఖాతాల్లో నగదు జమ చేసే పీఎం కిసాన్ యోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. భారత్‌పై 25 శాతం ప్రతీకార సుంకాలు విధిస్తూ ట్రంప్ చేసిన 'డెడ్ ఎకానమీ' వ్యాఖ్యలతో పాటు ఆపరేషన్ సిందూర్, మహాదేవ్‌లపై విపక్షాల విమర్శలను కూడా ఈ సందర్భంగా మోదీ తిప్పికొట్టారు. "ప్రపంచ పరిస్థితులు అస్థిరంగా ఉన్నాయి. ప్రతి దేశం తన సొంత ప్రయోజనాలనే చూసుకుంటోంది. మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తున్న వేళ మన ఆర్థిక ప్రయోజనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. దేశంకోసం ఏది ఉత్తమమో దాన్నంతా ప్రభుత్వం చేస్తోంది." అని మోదీ అన్నారు. 'మేక్ ఇన్ ఇండియా' ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రజలను ఆయన కోరారు.

ముహూర్తం చూస్తామా?

కాంగ్రెస్, ఇతర విపక్షాలు పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలను కూల్చడంపై కలత చెందుతున్నాయని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు. "పహల్గాం దాడి హంతకులను పార్లమెంటు సమావేశాలప్పుడే ఎన్‌కౌంటర్ ఎలా చేస్తారని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఉగ్రవాదులను చంపడానికి ముహూర్తం చూస్తామా? దొరికినప్పుడు చంపకుండా వదిలేస్తామా.?" అంటూ ప్రతిపక్షాలకు చురకలు అంటించారు. "తన ఎదుట అన్యాయం, ఉన్మాదం జరుగుతుంటే మహాదేవుడు రౌద్రరూపం దాల్చుతారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రపంచం ఇదే రూపాన్ని చూసింది. భారత్‌తో పెట్టుకుంటే ఎవరినీ వదిలిపెట్టం. ఆపరేషన్ సిందూర్ దెబ్బకు పాక్‌లోని వైమానిక స్థావరాలు ఇప్పటికీ ఐసీయూలోనే ఉన్నాయి. మన బ్రహ్మోస్ క్షిపణులు దాయాదికి నిద్రను దూరంచేశాయి. ఈ క్షిపణులను ఇకపై యూపీలోనే తయారుచేయబోతున్నాం. లఖనవూలో ఉత్పత్తిని ప్రారంభంచనున్నాం. అయితే, కొంతమందికి ఆపరేషన్ సిందూర్ విజయం రుచించకపోవడం దురదృష్టకరం. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు మాత్రం పాక్ దుస్థితిని చూసి తట్టుకోలేకపోతున్నాయి. ఉగ్రవాదుల పరిస్థితి చూసి అక్కడ పాక్, ఇక్కడ ఈ రెండు పార్టీలూ రోదిస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్‌ను 'తమాషా'గా తూలనాడుతూ, మన బలగాల శౌర్యప్రతాపాలను కాంగ్రెస్, ఎస్పీ నేతలు పదేపదే కించపరుస్తున్నారు" అని మోదీ మండిపడ్డారు.

రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్ నిధులు

వారాణసీ, ఆగస్టు 2 : పీఎం కిసాన్ యోజన కింద దేశవ్యాప్తంగా ఉన్న 9.70 కోట్లమంది రైతుల ఖాతాల్లో రూ.20,500 కోట్ల నిధులను ప్రధాని మోదీ జమ చేశారు. ఇది 20వ విడత సాయం. శనివారం తన సొంత నియోజకవర్గం వారాణసీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ నిధులను ఆయన విడుదల చేశారు. పీఎం కిసాన్ పథకాన్ని ఫిబ్రవరి 2019లో మోదీ ప్రారంభించారు. ఇప్పటివరకు అన్నదాతల ఖాతాల్లో 3.90 లక్షల కోట్లు కేంద్ర ప్రభుత్వం జమ చేసింది. కాగా, వారాణసీ నియోజకవర్గ అభివృద్ధి లో భాగంగా రూ.రెండు వేల కోట్లకుపైగా విలువైన పలు ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. 2014లో ఇక్కడి నుంచి మోదీ పార్లమెంటుకు తొలిసారి ఎన్నికయ్యారు. ఇప్పటివరకు 51 సార్లు తన నియోజకవర్గాన్ని ఆయన సందర్శించారని బీజేపీ రైతు విభాగం అధ్యక్షుడు దిలీప్ పటేల్ వివరించారు.

ప్రజ్వల్ రేవణ్ణకు యావజ్జీవం

పనిమనిషిపై అత్యాచారం కేసులో శిక్ష

▸▸ 10 లక్షల జరిమానా..అందులో 7 లక్షలు బాధితురాలికి..

▸▸ తీర్పు వెల్లడించిన ప్రజాప్రతినిధుల కోర్టు



ప్రజ్వల్ రేవణ్ణ

బెంగళూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు, జేడీఎస్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు(34) బెంగళూరులోని ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. పనిమనిషిపై అత్యాచారం కేసులో నేరం రుజువైనట్లు కోర్టు శుక్రవారం ప్రకటించిన విషయం తెలిసిందే. న్యాయాధికారి సంతోశ్ గజానన భట్ శనివారం శిక్షను ఖరారు చేశారు. వివిధ సెక్షన్ల కింద శిక్ష వేయడంతోపాటు రూ.10 లక్షల జరిమానా కూడా విధించారు. జరిమానాలో రూ.7 లక్షలను బాధితురాలికి(పని మనిషి) ఇవ్వాలని ఆదేశించారు. కర్ణాటక రాజకీయాల్లో దేవెగౌడ కుటుంబానికి ఎంతో పేరుంది. ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, ప్రధాన మంత్రిగా సేవలు అందించిన దేవెగౌడ, ప్రస్తుతం 92 ఏళ్ల వయసులోనూ రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. దేవెగౌడ మరో కుమారుడు కుమారస్వామి కేంద్రమంత్రిగా ఉన్నారు. రెండో కుమారుడు రేవణ్ణ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ప్రజ్వల్ తమ్ముడు సూరజ్ ఎమ్మెల్సీగా ఉన్నారు.

ఎన్నికల సమయంలో..

2024 లోక్‌సభ ఎన్నికలలో ప్రజ్వల్ రేవణ్ణ రెండోసారి జేడీఎస్ తరఫున హసన్ స్థానం నుంచి పోటీ చేశారు. ప్రజ్వల్ లైంగిక దౌర్జన్యానికి పాల్పడుతుండగా తీసిన వీడియోలు, ఫొటోలు ఉన్న పెన్‌డ్రైవ్‌లు సరిగ్గా పోలింగ్‌కు (ఆ ఏడాది ఏప్రిల్) రెండు రోజుల ముందు బయటకు వచ్చాయి. ఆ వీడియోల్లో 48 ఏళ్ల వయసున్న ప్రజ్వల్ పనిమనిషికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు కూడా ఉన్నాయి. ప్రజ్వల్ లైంగిక దాడి చేస్తూ స్వయంగా వీడియోలు చిత్రీకరించుకున్నారు. ఇవి వెలుగులోకి రావడంతో దేశవ్యాప్తంగా కలకలం రేగింది. బాధితురాలు (పనిమనిషి) పోలీసులను ఆశ్రయించారు. ఈ వివాదం నేపథ్యంలో పోలింగ్ జరిగిన రోజు రాత్రే ప్రజ్వల్ యూరప్ దేశాలకు వెళ్లారు. మే 31న ఆయన బెంగళూరుకు తిరిగి రాగా, ఎయిర్‌పోర్టులోనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేసిన సిట్ అధికారులు ప్రజాప్రతినిధుల కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ నెల ఒకటో తేదీ, శుక్రవారం, అత్యాచారం కేసులో ప్రజ్వల్ నేరం రుజువైందని న్యాయస్థానం ప్రకటించింది.

కోర్టులోనే గట్టిగా ఏడ్చేసిన ప్రజ్వల్

కోర్టు కార్యకలాపాలు శనివారం ఉదయం ప్రారంభం కాగానే, 'చివరిగా చెప్పుకొనేది ఏమైనా ఉందా..?' అని ప్రజ్వల్‌ను న్యాయాధికారి ప్రశ్నించారు. దీంతో ప్రజ్వల్ కన్నీరు పెట్టుకున్నారు. ఒక దశలో గట్టిగా ఏడ్చారు. రాజకీయాల్లో వేగంగా ఎదగడమే తాను చేసిన తప్పు అని రోదించారు. న్యాయాధికారి సంతోశ్ గజానన భట్ సాయంత్రం 4 గంటల తర్వాత తీర్పు ప్రకటించారు. కాగా, పనిమనిషి(బాధితురాలు) కిడ్నాప్ కేసులో ప్రజ్వల్ తండ్రి రేవణ్ణ కూడా అరెస్టు అయి, ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారు.



ప్రకాశం జిల్లా దర్శి మండలం వీరాయపాలెంలోని పొలంలో రైతులతో కలిసి మంచాలపై కూర్చుని ప్రధాని ప్రసంగాన్ని వీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, గొట్టిపాటి లక్ష్మి, కలెక్టర్ తమీమ్ అన్సారియా

పంట పొలాల్లో.. మంచాలపై కూర్చొని రైతులతో చంద్రబాబు ముఖాముఖి

- వినూత్నంగా అన్నదాత సుఖీభవ కార్యక్రమం
- సూపర్-6లో మరో హామీ అమలు.. 2 గంటలు ఎండలోనే సీఎం
- అక్కడి నుంచే స్ర్కీన్ ద్వారా ప్రధాని వారాణసీ సభను తిలకించిన సీఎం


ఒంగోలు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సాధారణంగా ముఖ్యమంత్రి సభలంటే.. వీఐపీలు కూర్చునేందుకు ప్రత్యేక వేదిక, సభికుల కోసం ప్రాంగణమంతా టెంట్లు, కుర్చీలు, బారికేడ్లతో ఏర్పాట్లు చేస్తారు. సీఎం చంద్రబాబు పాల్గొన్న అన్నదాత సుఖీభవ ప్రారంభ కార్యక్రమం ఇందుకు భిన్నంగా సాగింది. ఒకవైపు పచ్చగా ఎదిగిన సజ్జ పంట.. మరోవైపు వరి సాగుకు వీలుగా నీరు పెట్టి దమ్ము చేసిన మాగాణి భూమి మధ్య పూర్తిగా పల్లెటూరి వాతావరణంలో నులక, నవ్వారు మంచాలపై రైతులు కూర్చొనేలా ఏర్పాట్లు చేశారు. రైతులకు అభిముఖంగా వేసిన మంచాలపైనే ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కూర్చున్నారు. పైన టెంట్లు లేకుండా ఆరు బయట ఆకుపచ్చ కండువాలు వేసుకుని అందరూ ఆశీనులయ్యారు. శనివారం ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గం తూర్పువీరాయపాలెం గ్రామం వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు సాగు ఖర్చు కోసం కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని చంద్రబాబు ప్రారంభించారు. రైతులతో ముఖాముఖి పేరుతో ఈ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఉదయం 11.30కు ప్రాంగణానికి చేరుకున్న సీఎం చంద్రబాబు అక్కడ ఏర్పాటు చేసిన భారీ స్ర్కీన్ ద్వారా వారాణసీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని అందరితో కలిసి తిలకించారు. దాదాపు 50 నిమిషాల పాటు మోదీ ప్రసంగాన్ని విన్నారు. అనంతరం మహిళా రైతులతో మాట్లాడారు. ఎండ వేడిమి ఎక్కువగా ఉండటంతో చెమట తుడుచుకుంటూ అటు ప్రముఖులు, ఇటు రైతులు కార్యక్రమం జరిగినంత సమయం మంచాలపైనే కూర్చున్నారు. 1.30 గంటల వరకు సుమారు రెండు గంటల పాటు చంద్రబాబు సహా అందరూ ఎండలోనే గడిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కె.అచ్చెన్నాయుడు, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలతో సమావేశం రద్దు

తొలుత సీఎంతో ముఖాముఖి కార్యక్రమానికి గ్రామానికి చెందిన రైతులను పరిమితంగానే అధికారులు అనుమతించారు. ప్రతి ఒక్కరిని తనిఖీ చేసి ఉదయం 10 గంటలలోపే ప్రాంగణంలోకి అనుమతించారు. సీఎం చంద్రబాబు వచ్చిన అనంతరం గ్రామస్థులు, పరిసర ప్రాంత టీడీపీ శ్రేణులు భారీగా అక్కడికి చేరుకున్నారు. దీంతో ముందు వైపు ప్రాంగణమంతా రైతులు, ప్రత్యేకించి మహిళా రైతులు, టీడీపీ శ్రేణులతో కిటకిటలాడిపోయింది.



అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి హాజరైన రైతులు



మహిళా రైతులకు అన్నదాత సుఖీభవ మెగా చెక్కును అందజేస్తున్న సీఎం చంద్రబాబు

అన్నదాతకు అండగా..


(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రప్రభుత్వం ఈ పథకం కింద రూ.14 వేలు కలిపి ఏటా రూ.20 వేల నగదును జమ చేస్తుందని అన్నారు. చంద్రన్న ఉన్నంతవరకు రైతుకు భరోసా ఉంటుందని హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకాన్ని శనివారం ప్రకాశం జిల్లా దర్శి మండలం తూర్పువీరాయపాలెంలో చంద్రబాబు ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకంలో తొలివిడతగా 46.86 లక్షల మంది రైతులకు సుమారు రూ.3,174.42 కోట్ల నగదును వారి ఖాతాల్లో జమ చేశారు. ఇందుకు సంబంధించిన మెగా చెక్‌ను మహిళా రైతులు నాగలక్ష్మి, షేక్ మున్నాలకు అందజేశారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలు, సాగులో ఎదురవుతున్న ఇబ్బందులు, ప్రభుత్వం ద్వారా అందుతున్న లబ్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. సాధారణ సభలకు భిన్నంగా పూర్తిగా పల్లెటూరి వాతావరణంలో పచ్చని పొలాల మధ్య సుమారు రెండు గంటల పాటు కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. వ్యవసాయంలో సాంకేతిక వినియోగం, ప్రకృతి సేద్యం, మైక్రో ఇరిగేషన్ అమలు, పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కరోనాను సైతం జయించి పంటల సాగు చేసిన రైతన్నకు అండగా టీడీపీ ప్రభుత్వం నిలుస్తుందన్నారు. అందుకే ధరలు లేక నష్టపోతున్న నల్లబర్లీ పొగాకు, మామిడి, కోకో ఆయిల్ రైతుల ఉత్పత్తులు కొనుగోలు చేసి ఆదుకున్నామన్నారు. ప్రపంచంలో ఎప్పటికప్పుడు మారుతున్న రాజకీయ పరిణామాలు కూడా ఇక్కడ సాగుపై పడుతున్నాయని, అమెరికా అధ్యక్షుడు ఆకస్మికంగా ప్రకటించిన పన్నుల వల్ల ఇక్కడ ఆక్వా, ఇతర వ్యవసాయ ఉత్పత్తులకు ప్రతికూలత ఉంటుందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. వ్యవసాయంలో రైతులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించిందని చంద్రబాబు చెప్పారు. గోదావరి-బనకచర్ల పథకం ద్వారా రాష్ట్రంలో కరువు లేకుండా చేస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని తెలిపారు.

15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం

ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం స్ర్తీశక్తి పథకం అమలులోకి రానుందని చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్రంలో 2.62 కోట్లమందికి ఈ పథకం ద్వారా లబ్ధి కలుగుతుందన్నారు. ఉచితంగా 3 సిలిండర్లు, నెలనెలా 1న పేదల సేవలో పేరుతో సామాజిక పింఛన్లు, ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం పేరుతో ఒక్కొక్కరికి రూ.15వేల నగదు ఇప్పటికే అమలు చేస్తున్నామని చెప్పారు. అప్పుడప్పుడు కొత్త బిచ్చగాళ్లు వచ్చి అబద్ధాలు చెబితే నమ్మవద్దని ప్రజలను కోరారు. ఎన్ని కష్టాలు ఉన్నా పేదల సంక్షేమం కోసం, ప్రజల సుఖం కోసం పనిచేస్తానన్నారు. ఎన్నికల ముందు ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని పవన్ కల్యాణ్ కలిసి రావడం, రాష్ట్ర ప్రయోజనాల కోసం బీజేపీతో కలిసి కూటమిగా పోటీ చేస్తే ప్రజలు మంచి ఫలితాలు ఇచ్చారని అన్నారు. ఈ రోజు సభలో ప్రధాని ఆపరేషన్ సిందూర్ గురించి మాట్లాడారని, ఆడబిడ్డలు బొట్టు తుడిచేసిన వారిని మట్టుబెట్టిన ఘనత నరేంద్రమోదీదని ప్రశంసించారు. నాలుగో సారి కూడా దేశంలో ఎన్‌డీఏ అధికారంలోకి వస్తుందన్నారు.

నువ్వు లేపేస్తా అంటే.. ఇక్కడ ఉన్నది సీబీఎన్



- రప్పా, రప్పా ఏమిటో ప్రజలు ఆలోచించాలి
- నా 49 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి నాయకుడిని, పార్టీని చూడలేదు
- రాజకీయ ముసుగు తీసి నేరస్థులుగానే చూస్తా
- జగన్, ఆ పార్టీ నేతలపై చంద్రబాబు ఫైర్

'49 ఏళ్లుగా రాజకీయాలలో ఉన్నా.. నా అనుభవంలో ప్రస్తుతం ఉన్నంత దారుణ పరిస్థితి ఎన్నడూ చూడలేదు. రాజకీయమంటే మనల్ని చూసి పదిమంది నేర్చుకోవాలి. అంతిమ లక్ష్యం అధికారమే అయినా నిబద్ధత, నైతిక విలువలు, కట్టుబాట్లు ఉండాలి. కానీ మన రాష్ట్రంలో ఇప్పుడు ఒకాయన వ్యవహారం ఎలా ఉందో చూడండి.. ఆయనను చూసి ఏమి నేర్చుకోవాలి? గొడ్డలి వేటా? బూతుల పంచాంగమా? రప్పా, రప్పా ఏమిటో ప్రజలు ఆలోచించాలి. మా వాళ్లను మీ ఇళ్లకు పంపితే లేపేస్తారని నెల్లూరులో అతను మాట్లాడాడు. నువ్వు లేపేస్తా అంటే.. చూడటానికి ఇక్కడ ఉంది సీబీఎన్' అంటూ వైసీపీ అధినేత జగన్‌ను పరోక్షంగా ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. గతంలో తీవ్రవాదులు, ఫ్యాక్షనిస్టులు, సంఘ విద్రోహశక్తులతో పోరాడామని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం రాజకీయ ముసుగులో కొందరు వస్తున్నారని, వారి రాజకీయ ముసుగు తొలగించి నేరస్తులుగానే పరిగణించాలని అన్నారు. ప్రజల కోసం, రాష్ట్ర భవిష్యత్ కోసం.. కష్టాలు ఉన్నా, ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా 2047 నాటికి దేశంలో ఏపీ ప్రథమస్థానంలో ఉండాలన్న సంకల్పంతో రాత్రింబవళ్లు పనిచేస్తున్నానని, ప్రజలంతా తనకు సహకరించాలని కోరారు. ఇలాంటి సమయంలో రాష్ట్రంలో ఒక రాజకీయ పార్టీ తీరు దారుణంగా ఉందన్నారు. ఆ పార్టీ అధినేత వైఖరిని వివరిస్తూ అలాంటి పార్టీని, అలాంటి నాయకుడిని తన రాజకీయ జీవితంలో ఎన్నడూ చూడలేదన్నారు. "అమరావతి మహిళలను బ్రోతల్స్‌గా చిత్రీకరించేలా మాట్లాడిన దానిపై ప్రకాశం జిల్లాలోనే పొదిలిలో క్షమాపణ చెప్పాలని స్థానిక మహిళలు కోరితే వారిపై దాడులు చేశారు. నెల్లూరు జిల్లాలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వ్యక్తిగత జీవితంపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే అంత్యంత దారుణంగా మాట్లాడారు. అదే నేనైతే అలాంటి వ్యక్తిని పిలిచి వార్నింగ్ ఇచ్చి ఇంకొకరు అలా మాట్లాడకుండా చేసేవాడిని. కానీ ఆ పార్టీ అధినేత వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించడాన్ని ప్రజలు గమనించాలి. బంగారుపాళెం వీడియోలను నెల్లూరులో జరిగినట్లు ఫేక్ ప్రచారం చేశారు. గతంలో నేను ఒకసారి ఏమరుపాటుగా ఉంటే బాబాయ్‌పై గొడ్డలి వేటు వేసి మరుటిరోజు సాక్షిలో నారాసుర రక్తచరిత్ర అని రాశారు. ప్రజలంతా ఇలాంటివి గమనించాలి" అని చంద్రబాబు అన్నారు.

డబ్బులు పడ్డాయ్!



అన్నదాత సుఖీభవ లబ్ధి పడిందని ఫోన్ మెసేజ్ చూపుతున్న రైతులు

దర్శి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ప్రకాశం జిల్లా దర్శి పర్యటన ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది. అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించి చెక్కులు అందజేసిన అనంతరం ఆయన ప్రసంగం ప్రారంభించారు. ఆ సమయంలో ఒక రైతు సెల్‌లో మెసేజ్ చూసుకొని తన బ్యాంకు ఖాతాలో అన్నదాత సుఖీభవ నగదు జమ అయిందని ఆనందంతో కేరింతలు కొడుతూ చెప్పాడు. సెల్ ఫోన్ పైకెత్తి మెసేజ్ చూపాడు. అందుకు స్పందించిన సీఎం.. ఆనందంగా ఉందా అని అడిగారు. రైతుల కళ్లల్లో ఆనందం చూడటమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. డబ్బులు పడిన వెంటనే రైతులు మెసేజ్‌లు చూసుకోవటం చంద్రబాబు గమనించి సెల్ ఫోన్‌ను ఎన్నో రకాలుగా ఉపయోగించుకోవచ్చన్నారు.

99.98% ఖాతాల్లో సొమ్ము

సీఎం చంద్రబాబు 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' లబ్ధిదారులకు రూ.3,174.43 కోట్లు విడుదల చేయడంతో గంటల వ్యవధిలోనే 99.98% మంది లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు చేరింది. ఈ పథకానికి అర్హులైన 46.86 లక్షల రైతు కుటుంబాల్లో 44.76 లక్షల మంది బ్యాంకు ఖాతాల్లో నగదు జమైంది. 44.75 లక్షల ఖాతాల్లో డబ్బులు పడ్డాయని ఆర్టీజీఎస్ ప్రకటించింది. పీఎం కిసాన్ 20వ విడత నిధులను ప్రధాని మోదీ శనివారం వారాణసీలో విడుదల చేశారు. అదే సమయంలో సీఎం చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకానికి శ్రీకారం చుట్టారు. దీంతో ఈ విడత పీఎం కిసాన్ కింద రూ.2వేలు రాగా, అన్నదాత సుఖీభవ కింద రూ.5వేలు జమయ్యాయి. దీంతో రికార్డు స్థాయిలో రైతుకు రూ.7 వేలు అందింది. గత ప్రభుత్వంలో జగన్ 'రైతుభరోసా'కు బటన్ నొక్కిన 10-15 రోజులకు కూడా పడేది కాదని రైతులు గుర్తుచేస్తున్నారు. కాగా, ఈ పథకానికి రాష్ట్రవ్యాప్తంగా 46.86లక్షల మంది లబ్దిదారులను గుర్తించగా, ప్రస్తుతం స్థానిక ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో 'కోడ్' కారణంగా అన్నదాత సుఖీభవ సొమ్ము విడుదలకు బ్రేక్ పడింది. పీఎం కిసాన్‌కి మాత్రమే రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చింది. దీంతో స్థానిక ఎన్నికల కోడ్ సడలించిన తర్వాత ఆయా ప్రాంతాల్లోని సుమారు లక్ష మంది రైతుల ఖాతాలకు అన్నదాత సుఖీభవ నిధులు జమ చేస్తామని అధికారులు ప్రకటించారు.



తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్‌తో వెంకటేశ్ నాయుడు, చిత్రంలో విజయ సాయిరెడ్డి (ఫైల్)



వీడియోలో నోట్ల కట్టలతో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అనుచరుడు వెంకటేశ్ నాయుడు

దోచుకున్న సొమ్ముతో దొరికేశారు!

(మొదటి పేజీ తరువాయి)

అరెస్టు చేశారు. వెంకటేశ్ నాయుడు ఫోన్‌ను స్వాధీనం చేసుకుని... అందులో వాట్సాప్ నుంచి తొలగించిన చాట్, వీడియోలను సాంకేతిక సహాయంతో రిట్రీవ్ చేశారు. అందులో... 35 సెకన్ల వీడియో ఒకటి ఇప్పుడు బయటపడింది. అందులో... వెంకటేశ్ నాయుడు నోట్ల కట్టలు చక్కగా లెక్కబెడుతున్నాడు. టేబుల్‌పైన ఉన్నవి... కింద అప్పటికే అట్టపెట్టెల్లో సర్దినవి... మొత్తం కలిసి 'ఐదు' (కోట్లు) ఉన్నట్లు ధ్రువీకరిస్తూ ఆ మొత్తాన్ని బట్వాడాకు సిద్ధం చేసిన దృశ్యాలు ఆ వీడియోలో స్పష్టంగా రికార్డు అయ్యాయి.

ఎవరీ వెంకటేశ్ నాయుడు...

చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి వెంకటేశ్ నాయుడు ముఖ్య అనుచరుడు. అనేక పర్యాయాలు జగన్‌ను కూడా కలిశాడు. మద్యం ముడుపుల సొమ్మును ఎన్నికల్లో ఓట్లు కొనేందుకు ఉపయోగించాలనేది వైసీపీ స్కీమ్! విశ్వసనీయ సమాచారం ప్రకారం... ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల వైసీపీ అభ్యర్థులకు డబ్బులు బట్వాడా చేసే బాధ్యతను చెవిరెడ్డికి అప్పగించారు. వెంకటేశ్ నాయుడు ద్వారా డబ్బు పంపిణీ జరిగింది. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని 'క్రిష్ వ్యాలీ'లో ఏర్పాటు చేసుకున్న డెన్‌కు రాజ్ కసిరెడ్డి (ఏ1) నుంచి విడతల వారీగా రూ.25 లక్షల నుంచి 30 లక్షల దాకా బాక్సుల్లో వచ్చేవి. ఆ మొత్తాన్ని వెంకటేశ్ నాయుడు భద్రపరిచేవాడు. ఎన్నికలకు ఆరేడు నెలల ముందు నుంచి ఈ డబ్బును జిల్లాలకు పంపిణీ చేయడం మొదలుపెట్టారు. 'ఫలానా నంబరు, ఫలానా కారులో ఒకరు వస్తారు. రూ.5 కోట్లు ఇచ్చి పంపించు' అని చెవిరెడ్డి ఆదేశించేవారు. ఆ మేరకు... వెంకటేశ్ నాయుడు డబ్బులు రెడీ చేసి, బాక్సుల్లో పెట్టి అప్పగించేవాడు. ఇప్పుడు వీడియోలో బయటపడింది.. 2023 నవంబరు నాటి దృశ్యాలని భావిస్తున్నారు. ఎన్నికల సమయంలో తెలంగాణ-ఆంధ్రా సరిహద్దులో దొరికిన రూ.8 కోట్ల నగదు కూడా ఇతని ద్వారానే బట్వాడా అయినట్లు సిట్ అధికారులు భావిస్తున్నారు.

తామే వీడియోలు తీసి...

'తమ ఆదేశాల మేరకు డబ్బులు పంపిణీ చేశారా... లేదా..' అని నిర్ధారించుకునేందుకు వీడియోలు తీసి పంపాలనేది 'లిక్కర్ పెద్దలు' పెట్టిన రూల్! అందులో భాగంగా... వెంకటేశ్ నాయుడు కూడా డబ్బులు రెడీ చేసి అప్పగించే ముందు తన సెల్‌ఫోన్‌లో వీడియో తీసి, దానిని పైవాళ్లకు పంపించేవాడు. ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయాక నిందితులు ముందుజాగ్రత్తగా తమ సెల్‌ఫోన్ల నుంచి ఆ వీడియోలను డిలీట్ చేశారు. అయితే అధికారులు సెల్‌ఫోన్లను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్)కి పంపి డిలీట్ చేసిన వీడియోలను వెలికి తీయించారు. దీనిపై గతనెల 14వ తేదీన 'కట్టల గుట్టలు!' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఇప్పుడు బయటపడిన వీడియో వాటిలో ఒకటే! ఇలాంటివి మరెన్నో ఉన్నట్లు సమాచారం!

హవాలా 'లింకు'పై ఈడీ ఆరా

- సొమ్ములు తరలించినట్లు గుర్తించిన ఈడీ
- వెంకటేశ్ నాయుడు వీడియో పరిశీలన

మద్యం స్కామ్ నిందితులు హైదరాబాద్‌లోని టాప్ హవాలా డీలర్లలో ఒకరి ద్వారా భారీగా విదేశాలకు సొమ్ము తరలించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గుర్తించినట్లు తెలిసింది. ఒక్క వెంకటేశ్ నాయుడే అతని ద్వారా రూ.35 కోట్లు పంపినట్లు తమకు సమాచారం ఉందని, వారిద్దరినీ కలిపి ప్రశ్నించాల్సి ఉందని 'సిట్'కు ఈడీ చెప్పినట్లు తెలిసింది. ఇందులో భాగంగా... తాజాగా నోట్లకట్టలతో బయటపడిన వెంకటేశ్ నాయుడు వీడియోను కూడా తమ పరిశీలనకు పంపాలని 'సిట్'ను కోరినట్లు తెలిసింది.

రెండేళ్లలో ఏపీకి లక్ష కోట్ల రోడ్లు

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. అలాగే, రూ.2100 కోట్ల వ్యయంతో పూర్తిచేసిన రెండు రహదారులను జాతికి అంకితం చేశారు. "ఆంధ్రప్రదేశ్ రహదారి ప్రాజెక్టులు పూర్తయితే అమెరికా రోడ్లతో పోటీపడతాయి. నేను మాటల మనిషిని కానేకాదు, మాట ఇచ్చానంటే చేతల్లో చేసి చూపిస్తాను. ఇక భవిష్యత్ అంతా ఆంధ్రప్రదేశ్‌దే."నని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనల జాబితా చాలా పెద్దగా ఉందంటూ చమత్కరించిన ఆయన, ప్రతి ప్రాజెక్టునూ ఆమోదిస్తామన్నారు. తొలుత వాటిని తమ మంత్రిత్వశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని గడ్కరీ వివరించారు. ఏపీకి మంచి దశ, దిశ, విజనరీ ఉన్న నాయకుడు చంద్రబాబు ఉన్నారని, రాష్ట్ర భవిష్యత్తుకు ఢోకా లేదన్నారు. ప్రధానమంత్రి కోరుకుంటున్న ప్రగతి, వికాసం ఏపీలో కనిపిస్తున్నాయన్నారు. రహదారులు, పోర్టులు ఉన్న రాష్ట్రాలు చాలా వేగంగా అభివృద్ధి చెందుతాయని, బస్సు, రైలు కన్నా జలమార్గంలోనే రవాణా ఖర్చు చాలా తక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ రంగాలను ఏపీ అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తు ఇథనాల్, హైడ్రోజన్‌లదేనని తెలిపారు. డీజిల్, పెట్రోల్ వినియోగం తగ్గి, ప్రత్యామ్నాయ, కాలుష్య రహిత ఇంధనాల వినియోగం పెరిగితేనే దేశం మిగతా ప్రపంచంతో వేగంగా పోటీపడగలదని గడ్కరీ అన్నారు. ఏపీలో గ్రీన్‌హైడ్రోజన్ మిషన్ అందుబాటులోకి వస్తే నూతన అభివృద్ధిని చూస్తారని, రైతులకు లక్షల్లో ఆదాయం ఉంటుందని చెప్పారు. విశాఖపట్నంలో హైడ్రోజన్ ప్రాజెక్టును ఓ ప్రైవేటు కంపెనీకి ఇచ్చినట్లు గడ్కరీ చెప్పారు.

ఏపీని సొంత రాష్ట్రంలా చూడండి: చంద్రబాబు

నితిన్ గడ్కరీ మాట అంటే మాటే అని, చెప్పారంటే చేసి చూపిస్తారని సీఎం చంద్రబాబు కితాబిచ్చారు. గడ్కరీ ఏపీని కూడా మహారాష్ట్రలాగా చూడాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం ఇచ్చే కొత్త రహదారి ప్రాజెక్టులకు ఎలాంటి భూసేకరణ సమస్య రాకుండా చూసుకుంటానని చంద్రబాబు హామీ ఇచ్చారు. "మేం ఏది అడిగినా గడ్కరీ ఎప్పుడూ నో చెప్పలేదు. పోలవరం ప్రాజెక్టుకు ఆక్సిజన్ ఇచ్చింది ఆయనే. అమరావతికి 189 కిలోమీటర్ల ఔటర్‌రింగ్ రోడ్డు ఇచ్చారు. గతంలో రహదారులు నరకప్రాయంగా ఉండేవి. ఇప్పుడు వాటిని బాగుచేస్తున్నాం. హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో రాష్ట్రంలో మరో 20 పోర్టులు రాబోతున్నాయి. మరో 9 ఎయిర్‌పోర్టులు సిద్ధం కావాల్సిఉంది." అని చంద్రబాబు అన్నారు.



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు

తాను ఈ రోజును జీవితంలో మరచిపోలేనని, ఉదయం సంక్షేమం కింద రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ డబ్బు జమచేసి, సాయంత్రం అభివృద్ధికి అవసరమైన పెట్టుబడులను తెచ్చే రహదారి ప్రాజెక్టుల కార్యక్రమంలో పాల్గొన్నానని చెప్పారు. ఏపీపై వరాల జల్లుకురిపించిన నితిన్ గడ్కరీని ఆయన శాలువాతో సత్కరించారు.

ఆ నాయకులతో జాగ్రత్త: రామ్మోహన్ నాయుడు

మామిడికాయలు, తలకాయలు తొక్కుకుంటూ వెళ్లే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్‌నాయుడు అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును తొక్కుకుంటూ వెళ్లే నాయకులతో చాలా జాగ్రత్తగా ఉండాలని ప్రజలను కోరారు. ఏపీలో ఐదేళ్ల అధికారం ఇస్తే ఓ వ్యక్తి ఏం చేశారో ప్రజలందరికీ తెలుసని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. "ఆయన సార్‌కు ఏజ్ అయిపోయిందని అంటున్నారు. కానీ ఇక్కడ మా ముఖ్యమంత్రి అహర్నిశలు పనిచేస్తున్నారు. ఇక్కడ కావాల్సింది ఏజ్ కాదు.. టాలెంట్. నువ్వు ఎప్పుడైనా సింగపూర్, ఢిల్లీ, దుబాయ్ వెళ్లావా?" అని జగన్‌ను ప్రశ్నించారు.

వికృత మనస్తత్వం వారితో జాగ్రత్త: సత్యప్రసాద్

రాష్ట్ర ప్రజలు వికృత మనస్తత్వం ఉన్న వ్యక్తులతో చాలా జాగ్రత్తగా ఉండాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు అభివృద్ధి చేస్తోందని, దాన్ని ఓర్వలేని వికృత మనస్తత్వం ఉన్న నేతలు ఎమ్మెల్యేలను హత్య చేస్తామని మాట్లాడుతున్నారని, ప్రజలు వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

కూటమి 15 ఏళ్లు పదిలంగా ఉండాలి

- పవన్ కల్యాణ్

గత ప్రభుత్వం కూల్చివేతలతో మొదలైతే కూటమి ప్రభుత్వం రహదారులను, వ్యవస్థలను పునరుద్ధరిస్తూ ముందుకు వెళుతోందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్రాభివృద్ధి, ఐక్యతకు కూటమి ప్రభుత్వం పునాదులేస్తోందన్నారు. "కూటమి ప్రభుత్వం కనీసం 15 ఏళ్లు బలంగా పనిచేయాలి. అప్పుడే రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం బలంగా ఉంటుంది. ఇప్పుడిప్పుడే రాష్ట్రాభివృద్ధికి పెట్టుబడులు, కొత్త ప్రాజెక్టులు వస్తున్నాయి. అవి రాష్ట్ర భవిష్యత్తును, ఐదు కోట్ల ప్రజల సంక్షేమాన్ని కాపాడతాయి. కూటమి ఐక్యతను దెబ్బతీసే కుట్రలు జరుగుతున్నాయి. చాలా జాగ్రత్తగా ఉండాలి. కూటమిని దెబ్బతీసే కుట్రలను ఐక్యంగా ఎదుర్కొనాలి." అని తెలిపారు. మోదీ స్ఫూర్తితో 'అడవితల్లి బాట' పేరుతో గిరిజన గ్రామాల్లో రహదారుల నిర్మాణం చేపట్టామని ఆయన చెప్పారు. గిరిజన గ్రామాల్లో రోడ్లు నిర్మిస్తే ఓట్లు వస్తాయా? అన్న కోణంలో తమకు ఆలోచన లేదని, అడవి ప్రాంతాల్లో డోలిమోతలు ఉండకూడదన్నదే తమ ఉద్దేశమని ఆయన చెప్పారు. తాను కోరిన వెంటనే ముఖ్యమంత్రిచంద్రబాబు 50 కోట్లు ఇచ్చారని, వాటికి ఉపాధి హామీ కింద వచ్చిన 500 కోట్లు కలిపి ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కె. రామ్మోహన్‌నాయుడు, శ్రీనివాసవర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, సత్యప్రసాద్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌హెచ్‌ఆర్- ఏపీ సమావేశంలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు, వేదికపై కేంద్రమంత్రులు గడ్కరీ, రామ్మోహన్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రులు సత్యకుమార్, బీసీ జనార్దన్, ఎంపీ సీఎం రమేశ్ తదితరులు

అందరికీ నమస్కారం

- గడ్కరీ నోట తెలుగు పలుకులు

ఎన్‌హెచ్‌ఆర్- ఏపీ సమావేశంలో 'అందరికీ నమస్కారం' అంటూ తెలుగులో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తన ప్రసంగం ప్రారంభించారు. తాను ఎలక్ట్రికల్ కారును ప్రారంభించిన రోజులను ఆయన గుర్తుచేసుకున్నారు. 'విద్యుత్ వాహనాన్ని ప్రారంభించిన రోజు నన్ను ఒక విలేకరి ఒక ప్రశ్న అడిగారు. అది మధ్యలో ఆగిపోతే పరిస్థితి ఏమిటని ఆయన సందేహం వెలిబుచ్చారు. కానీ, కానీ ఇప్పుడు కార్లతో పాటు ఎలక్ట్రిక్ బస్సులు కూడా రయ్‌రయ్‌మంటూ తిరుగుతున్నాయి. రహదారి ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గాయకుడు శంకర్‌మహదేవన్ పాడిన పాటతో రూపొందించిన ఓ సంక్షిప్త వీడియోను సమావేశంలో మంత్రి ప్రదర్శించారు.



ఐసీజేఎస్‌తో వేగంగా న్యాయ విచారణ

- సామాన్య బాధితుడికి సకాలంలో న్యాయం
- కోర్టులు, పోలీసు, ఫోరెన్సిక్, జైళ్ల శాఖలకు 4,575 కంప్యూటర్లు: డీజీపీ హరీశ్ గుప్తా


అమరావతి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): న్యాయ స్థానాలు, దర్యాప్తు సంస్థల మధ్య డేటా బదిలీ వల్ల న్యాయ విచారణ త్వరితగతిన పూర్తి అవుతుందని, సామాన్య బాధితుడికి సకాలంలో న్యాయం జరుగుతుందని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా అన్నారు. శనివారం కేంద్ర హోంశాఖ సహకారంతో ఇంటర్-ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్(ఐసీజేఎస్)ను ఏపీలో అధికారికంగా డీజీపీ ప్రారంభించారు. మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో టెక్నికల్ విభాగం ఐజీ శ్రీకాంత్‌తో కలిసి డీజీపీ ఈ సందర్భంగా మాట్లాడారు. ఐసీజేఎస్ అమల్లోకి రావడం కేసుల్లో శిక్షలు పడటానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నేరాలు చేసిన వ్యక్తులు ఏదో ఒక రూపంలో తప్పించుకోవడానికి అడ్డంకులు సృష్టిస్తుంటారని, ఇకనుంచి ప్రతి పేపర్, ఆధారం అన్నీ డిజిటల్ రూపంలో కోర్టు, పోలీసు, ఫోరెన్సిక్, జైలు అధికారుల కంప్యూటర్లలో నిక్షిప్తమై ఉంటాయని చెప్పారు. న్యాయ, పోలీసు, ఫోరెన్సిక్, జైళ్ల శాఖల అనుసంధానంతో రియల్ టైమ్ డేటా బదిలీ జరుగుతుందని, సంబంధిత అధికారుల్లో పారదర్శకత కూడా పెరుగుతుందని అన్నారు. డిజిటల్ వేదిక ద్వారా కాగిత రహిత సాంకేతిక ఆధారిత న్యాయవ్యవస్థను రూపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్టుకు రూ.88.03 కోట్లు ఖర్చు చేసి 4,575 కంప్యూటర్లు, ప్రింటర్లు, బయోమెట్రిక్ స్కానర్లు, క్యూఆర్ కోడ్ రీడర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి పోలీస్ స్టేషన్, కోర్టు, ఫోరెన్సిక్ ల్యాబ్, జైలు, ప్రాసిక్యూషన్ ఆఫీసుల్లో ఉంటాయన్నారు. వీడియో కాన్ఫరెన్స్, సాక్ష్యాల రికార్డింగ్, రియల్ టైమ్ క్రైమ్ సీన్ డాక్యుమెంటేషన్, నిందితుల వేలిముద్రల ప్రాసెసింగ్ లాంటి సదుపాయలు ఉన్నట్లు వివరించారు.

ఆ 11 కోట్లను ప్రత్యేకంగా ఉంచండి

- సిట్‌కు ఏసీబీ కోర్టు ఆదేశం

విజయవాడ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో సిట్ స్వాధీనం చేసుకున్న రూ.11 కోట్లను ప్రత్యేకంగా ఉంచాలని ఏసీబీ కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఆ నగదుతో తనకు ఎలాంటి సంబంధం లేదని, వాటిలో 2024 తర్వాత ముద్రించిన నోట్లు ఉండే అవకాశం ఉందని నిందితుడు రాజ్ కసిరెడ్డి కోర్టుకు చెప్పుకున్నారు. ఆ నగదు సీరియల్ నంబర్లను నమోదు చేయాలంటూ ఆయన తరఫు న్యాయవాదులు శనివారం పిటిషన్ వేశారు. దీనిపై న్యాయాధికారి పి.భాస్కరరావు విచారణ చేశారు. నగదును బ్యాంకులో డిపాజిట్ చేశామని సిట్ దర్యాప్తు అధికారి శ్రీహరిబాబు కోర్టుకు వివరించారు. దీంతో రూ.11 కోట్లను ఇతర నోట్లతో కలపకుండా ప్రత్యేకంగా ఉంచాలని న్యాయాధికారి ఉత్తర్వులిచ్చారు. దీనిపై బ్యాంకు అధికారులకు కూడా నోటీసు ఇచ్చారు. కాగా, స్వాధీనం చేసుకున్న నగదును సిట్ అధికారులు విజయవాడ ఆటోనగర్ ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో డిపాజిట్ చేశారు.

నెల్లూరులో 38.7 డిగ్రీలు



- గడిచిన నాలుగు దశాబ్దాల్లో ఇదే అత్యధికం
- కోస్తాలో పలుచోట్ల 35 నుంచి 38 డిగ్రీలు
- రేపటినుంచి దక్షిణ కోస్తా, సీమలో వర్షాలు

విశాఖపట్నం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ఎండలు హడలెత్తిస్తున్నాయి. శనివారం అనేక ప్రాంతాల్లో ఎండ తీవ్రతతో ప్రజలు అల్లాడిపోయారు. మధ్యాహ్న సమయంలో పలుచోట్ల వేడి గాలులు వీచాయి. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3నుంచి 5డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. శనివారం దేశంలోనే అత్యధికంగా నెల్లూరులో 38.7 డిగ్రీలు నమోదైంది. గడచిన నాలుగు దశాబ్దాల్లో ఆగస్టు నెలలో నెల్లూరులో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత. కోస్తాలో పలుచోట్ల 35 నుంచి 38 డిగ్రీలు వరకూ నమోదయ్యాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని, సోమవారం నుంచి రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో వర్షాలు పెరుగుతాయని వాతావరణ శాఖ పేర్కొంది. అక్కడక్కడా భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆదివారం కూడా చాలా ప్రాంతాల్లో ఎండలు కొనసాగుతాయని వెల్లడించింది.

శ్రీశైలానికి తగ్గిన వరద

- ఆరు గేట్ల నుంచి నీటి విడుదల
- జలాశయం వద్ద పెరిగిన సందర్శకుల తాకిడి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)


శ్రీశైలం డ్యాం 7 గేట్ల నుంచి విడుదలవుతున్న వరద

ఎగువ నుంచి శ్రీశైలం డ్యాంకు వరద ప్రవాహం తగ్గింది. జూరాల, సుంకేసుల నుంచి 1,88,791 క్యూసెక్కుల నీరు శ్రీశైలం డ్యాంలోకి వచ్చి చేరుతోంది. దీంతో సాయంత్రం ఏడు గేట్ల ద్వారా 1,87,530 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేసిన అధికారులు రాత్రి 9 గంటలకు ఒక గేటు మూసివేసి ఆరు గేట్ల ద్వారా 1,61,016 క్యూసెక్కులు, కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ ఉత్పాదన నిమిత్తం మరో 66,102 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 882.30 అడుగులకు చేరింది. డ్యాంలో 200.6588 టీఎంసీల నీరు ఉంది. వారాంతం కావడంతో శనివారం జలాశయం వద్ద సందర్శకుల తాకిడి పెరిగింది. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్ డ్యాంలోకి 2,10,499 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ 18 గేట్ల ద్వారా 1,36,656 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,070, కుడి కాలువ ద్వారా 8023, ఎడమ కాలువ ద్వారా 7937, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్‌ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం 1,83,786 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 585.30 అడుగులు ఉంది. పులిచింతల ప్రాజెక్టులో 40.77 టీఎంసీల నీరు ఉన్నట్టు ఆ ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 1,81,808 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. 7 గేట్ల ద్వారా 1,65,069, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 16,600, లీకుల ద్వారా 400 క్యూసెక్కులు మొత్తం 1,82,069 క్యూసెక్కుల నీరు దిగువనున్న ప్రకాశం బ్యారేజీకి విడుదలవుతోంది.

లిక్కర్ స్కామ్‌లో జగన్ లోపలకు వెళ్లడం ఖాయం

- లెక్కల్ని సీబీఐ, ఈడీ, సిట్ తేలుస్తాయి: విష్ణుకుమార్‌రాజు

గాజువాక (విశాఖపట్నం), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కామ్‌లో మాజీ సీఎం జగన్ త్వరలో లోపలకు వెళ్లడం ఖాయమని విశాఖపట్నం నార్త్ బీజేపీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. గాజువాక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ వికాస్' పథకం మొదటి విడత నిధుల విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'ఇప్పటి వరకూ బయటపడింది లిక్కర్ సరఫరా చేసిన వారిచ్చిన కమీషన్ మాత్రమే. ఇంకా రూ.12 బాటిల్‌ను రూ.200కు అమ్మిన లెక్కలు తేలాల్సి ఉంది. రూ.100 కోట్ల విలువైన మద్యాన్ని నేరుగా ఫ్యాక్టరీ నుంచి తీసుకొని బయట అమ్మితే రూ.2 వేల కోట్లు వస్తుంది. ఆ స్కామ్ ఎంత పెద్దదో అర్థం చేసుకోవాలి. అదంతా సీబీఐ, ఈడీ, సిట్ తేలుస్తాయి. రాష్ట్ర పురోభివృద్ధి కోసం రానున్న ఎన్నికల్లో సైతం జగన్‌కు బుద్ధి చెప్పాలి' అని అన్నారు.





Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal, Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.